


మా కలం - సామాన్యుడి బలం

# నంది పత్రిక

జాతీయ తెలుగు దిన పత్రిక

RNI-APTEL/2023/88162

GSTIN 37AMRPM5719R1ZX


హైదరాబాదులో బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి రజతోత్సవం..




ఎడిటర్: మహేష్ యాదవ్ | తెలంగాణ , ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి : 4 | సంచిక : 167 | మంగళవారం 23- 06 -2026 | పేజీలు : 12 | వెల-3 | No: KNL/3-77(D)/2026-2028



## రాష్ట్రంలో కుట్రలు పన్నే పార్టీలు

రాజకీయం రంగు పులుముతున్న నేతలు

ఫేక్ ప్రచారాలపై ఉద్యోగులు అప్రమత్తం కావాలి

ప్రజల సమస్యల పరిష్కారంలో మానవీయకోణం ముఖ్యం

ఆర్టీజీఎస్‌పై సమీక్షలో సీఎం చంద్రబాబు హెచ్చరిక



## రైతులను ఇబ్బంది పెడితే చర్యలు

యూరియా ఎమ్మార్పీ ధరలకే అమ్మాలి

వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు హెచ్చరిక

రైతులను ఇబ్బంది పెడితే డీలర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని, కంపెనీలపై కూడా చర్యలు తీసుకుంటామని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు హెచ్చరించారు.



## 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎపి

ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల సృష్టి ధ్యేయంగా కృషి

ఎపి రూపురేఖలు మార్చేలా చంద్రబాబు వేగంగా అడుగులు

ఢిల్లీ సదస్సులో మంత్రి లోకేశ్ వెల్లడి



## సాయికృష్ణ కేసు నుంచి సుగాలీ ప్రీతి ఉదంతం వరకు ప్రజలను మోసం చేస్తున్న డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్

### ఆయనది ద్వంద్వ వైఖరి అంటూ మండిపడ్డ అంబటి రాంబాబు



సాయికృష్ణ కేసు నుంచి సుగాలీ ప్రీతి ఉదంతం వరకు ప్రతి విషయంలోనూ డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ ప్రజలను, బాధితులను మోసం చేస్తున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీమంత్రి అంబటి రాంబాబు మండిపడ్డారు. ఒకవైపు ప్రభుత్వం సాయికృష్ణ కుటుంబాన్ని పిలిపించి న్యాయం చేస్తామని చెబుతుంటే.. మరోవైపు పవన్ కళ్యాణ్ ఏమో సాయికృష్ణను ఒక క్రిమినల్ అని మాట్లాడుతున్నారని అన్నారు. ఈ మేరకు పవన్ కళ్యాణ్ తీరుపై అంబటి రాంబాబు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అమరావతిలో జరిగిన ప్రెస్ మీట్‌లో ఆయన మాట్లాడుతూ.. పవన్ కళ్యాణ్ అనుసరిస్తున్న ద్వంద్వ వైఖరిని ఎండగట్టారు. అదే సమయంలో జనసేన నేత సామినేని ఉదయభాను సాయికృష్ణ తల్లిని ఓదార్చేందుకు వెళ్లి.. పవన్ కళ్యాణ్ పంపిస్తేనే వచ్చామని చెబుతున్నారు. అసలు పవన్ ఏం చెప్పాలనుకుంటున్నారో ఆయనకే తెలియాలి అని అన్నారు. వైసిపి నేతలను తాటతీస్తామంటూ పవన్ చేస్తున్న వ్యాఖ్యలపై అంబటి మండిపడ్డారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉండి ఇలా మాట్లాడొచ్చా? మీ ఎమ్మెల్యే పంతం నానాజీ భాష ఎలా ఉందో చూశారా? అసలు ఎవరు గూండాలు? పవన్ గారూ.. మీరు ఏడు జన్మలెత్తినా మమ్మల్ని ఏమీ చేయలేరు. మీ ఉడత ఊపులకు, సొల్లు కబుర్లకు ఇక్కడెవరూ భయపడరని స్పష్టం చేశారు. 'నేను హోంమంత్రిగా లేకపోవడం మీ అదృష్టం' అని పవన్ అనడం ద్వారా ప్రస్తుతం ఉన్న హోంమంత్రి సరిగ్గా పని చేయడం లేదని ఆయనే ఒప్పుకున్నట్లయిందని అంబటి ఎద్దేవా చేశారు. పవన్ కళ్యాణ్‌కు హోంమంత్రి పదవి ఇవ్వాలని తాను సీఎం చంద్రబాబును రిక్వెస్ట్ చేస్తున్నానని పేర్కొన్నారు. చట్టాన్ని ఎవరూ చేతుల్లోకి తీసుకోకూడదని, ముంబై దాడుల నిందితుడు కసబ్‌ను కూడా చట్టప్రకారమే శిక్షించారని గుర్తు చేశారు.

## ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు పూర్తి సహకారం

దేవరకద్ర డిఆర్ఎస్ ప్రాజెక్ట్ సత్వరం చేపట్టాలి

కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌తో సిఎం రేవంత్ భేటీ

రక్షణ భూములు కేటాయించినందుకు కృతజ్ఞతలు



## నెత్తురోడిన ఎపి రోడ్లు

### వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురు మృతి ప్రకాశంలో ముగ్గురు, తిరుపతిలో ఇద్దరు మృత్యువాత

ఎపిలో రోడ్లు నెత్తురోడాయి. వేర్వేను రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు దుర్మరణం చెందారు. ప్రకాశం జిల్లాలో ముగ్గరు, తిరుపతి జిల్లాలో ఇద్దరు మృతి చెందారు. ప్రకాశం జిల్లా సంతమాగులూరు మండలం కామేపల్లి సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగింది. ఆటోను లారీ ఢీకొన్న ఘటనలో ముగ్గరు ప్రాణాలు కోల్పోయారు. శావల్యాపురం మండలం వేల్పూరు గ్రామానికి చెందిన 10 మంది నాదెండ్ల మండలం సంకురాత్రిపాడులో జరిగే దశదిన కర్మకు హాజరయ్యేందుకు ఆటోలో బయల్దేరారు. కామేపల్లి రైల్వే అండర్‌పాస్ సమీపానికి వచ్చేసరికి.. గ్రానైట్‌తో వస్తున్న లారీ మలుపు తిరుగుతూ.. ఆటోను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఏడుకొండలు (60), రమణమ్మ (50) అక్కడికక్కడే మృతి చెందారు.

## ఓట్, సీట్ చోరీలో బిజెపి నిమగ్నం



సర్ ప్రక్రియ ఓట్ల తొలగింపుకే ప్రాధాన్యం

ఎన్నికలు ఎప్పుడు జరిగినా కాంగ్రెస్‌కు వంద ఖాయం

బూత్ లెవెల్ ఏజంట్ల శిక్షణలో టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్

## చిత్తూరు జిల్లాలో దారుణ ఘటన

### ఒకే కుటుంబానికి చెందిన నలుగురు బలవన్మరణం

చిత్తూరు జిల్లాలో దారుణం చోటు చేసుకుంది. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు బలవన్మరణానికి పాల్పడ్డారు. ఈ ఘటన దిగుమసపల్లె పంచాయతీ బంగారెడ్డిల్లిలో జరిగింది. దామోదరం(30) అనే వ్యక్తి.. తన భార్య నిర్మల(25), కుమారుడు రాజేష్, కుమార్తె శ్రీవిద్యకు విషమిచ్చి, అనంతరం తానూ ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్యకు బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో కొన్ని రోజులుగా సీఎంసీ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. భార్య ఆరోగ్య పరిస్థితి బాగోలేకపోవడం, ఆర్థిక పరిస్థితులు అంతంతమాత్రంగానే ఉండటంతో దామోదరం ఈ దారుణానికి ఒడిగట్టినట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న బీఎన్ఆర్ పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దామోదర్.. సూసైడ్ నోట్‌లో బ్యాంకు ఏటీఎం కార్డు, ఫోన్‌పే పిన్ నెంబర్ రాసిపెట్టాడు. అంత్యక్రియలకు తన ఖాతా నుంచే డబ్బులు వాడుకోవాలని లేఖలో పేర్కొన్నాడు.

## మమతా బెనర్జీకి షాక్..

టీఎంసీలో మరింత ముదిరిన సంక్షోభం

చైర్‌పర్సన్ పదవి నుంచి మమతను తొలగించిన రెబల్స్

కొత్త కమిటీ ఏర్పాటు, అరూప్ రాయ్ నూతన చైర్మన్

అభిషేక్ బెనర్జీని సస్పెండ్ చేసిన తిరుగుబాటు వర్గం



## చిట్టినాయుడిని వదిలిపెట్టే ప్రసక్తి లేదు

ఇబ్బంది పెట్టిన ప్రతీ ఒక్కరికీ సమాధానం ఇస్తా

వర్ధన్నపేట కార్యకర్తల భేటీలో కెటిఆర్ ఘాటు హెచ్చరిక





## నటుడు చిరంజీవితో బిజెపి అధ్యక్షుడు రామ్ భేటీ



# మమతా బెనర్జీకి షాక్..

పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో పెను సంచలనం చోటుచేసుకుంది. తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) పార్టీలో సంక్షోభం పతాక స్థాయికి చేరింది. పార్టీ అధినేత్రి మమతా బెనర్జీని చైర్‌పర్సన్ పదవి నుంచి తొలగిస్తున్నట్లు ప్రతిపక్ష నేత, టీఎంసీ రెబల్ నాయకుడు రితబ్రత బెనర్జీ ప్రకటించారు. అసలైన టీఎంసీ తమదేనని ఆయన స్పష్టం చేశారు.కోల్‌కతాలోని న్యూటౌన్‌లో గల ఒక ఫైవ్‌స్టార్ హోటల్‌లో సోమవారం ఈ వర్గం సమావేశమైంది. ఈ సందర్భంగా సీనియర్ ఎమ్మెల్యే అరూప్ రాయ్‌ను కొత్త చైర్‌పర్సన్‌గా వాయిస్ ఓటు ద్వారా ఎన్నుకున్నారు. పార్టీ నిర్వహణ కోసం 30 మంది సభ్యులతో కూడిన ఒక కమిటీని కూడా నియమించారు. ఒకప్పుడు మమతకు అత్యంత సన్నిహితుడైన ఫిర్హాద్ హకీమ్‌తో పాటు అరూప్ బిశ్వాస్, రతిన్ ఘోష్, సబినా యాస్మిన్‌లను వైస్ చైర్‌పర్సన్‌లుగా నియమించారు. రితబ్రత బెనర్జీ, జావేద్ ఖాన్, సందీపన్ సాహాలను ప్రధాన కార్యదర్శులుగా ప్రకటించారు. తమకు 60 మంది ఎమ్మెల్యేలు, 70 మంది మాజీ కౌన్సిలర్ల మద్దతు ఉందని వారు వెల్లడించారు. ఇదే క్రమంలో మమత మేనల్లుడు, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీని కూడా ఈ వర్గం పార్టీ నుంచి సస్పెండ్ చేసింది.

# నెత్తురోడిన ఎపి రోడ్లు

గాయపడిన మరో ఏడుగురిని సమీపంలోని వివిధ ఆస్పత్రులకు తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సుబ్బాయమ్మ (70) ప్రాణాలు కోల్పోయారు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇకపోతే తిరుపతి జిల్లా పుల్లంపేట మండలం ఉడుంవారిపల్లి వద్ద సోమవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఓ ఆర్టీసీ బస్సును లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా.. 15 మందికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. ఆదివారం రాత్రి ఓ ఆర్టీసీ బస్సు తిరుపతి నుంచి కడప వెళ్తోంది. మరోవైపు ఓ లారీ ఎర్రగుంట్ల నుంచి చెన్నైకి వెళ్తోంది. ఉడుంవారిపల్లి వద్దకు రాగానే లారీ.. బస్సును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఏడాది వయసు గల చిన్నారి ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. పలువురికి కాళ్లు, చేతులు తెగిపడి రోడ్డు మొత్తం రక్తసిక్తమైంది. కోడూరు రూరల్ సీఐ డి. శ్రీనివాసులు, సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను అంబులెన్సులో రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విరిగిన చేతిని సైతం అంబులెన్స్‌లో ఆస్పత్రికి పంపడం ప్రమాద తీవ్రతకు అద్దం పట్టింది. రాజంపేట నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. అందులో కె. జస్విక (16) అనే బాలిక చికిత్స పొందుతూ మృతి చెందింది. కోడూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు పూర్తి సహకారం

ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టు నిర్మాణానికి రాష్ట్రం అన్ని విధాలా సహకారం అందిస్తుందని సిఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోన్న ప్రాజెక్టుల్లో ఒకటైన ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ అభివృద్ధికి సంబంధించి తమ ప్రభుత్వం భూ సేకరణ, యుటిలిటీస్ బదలాయింపు వంటి అంశాల్లో పూర్తి సహకారం అందిస్తామని కేంద్రమంత్రికి రేవంత్‌రెడ్డి తెలిపారు. కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీలో సోమవారం సమావేశం అయ్యారు. ఈ భేటీలో ఇరువురు నేతలు పలు కీలక అంశాలపై చర్చించారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు రక్షణ శాఖ భూములు బదలాయించినందుకు రాజ్‌నాథ్ సింగ్‌కు.. సీఎం కృతజ్ఞతలు తెలిపారు. దేశ సమగ్రత, రక్షణకు సంబంధించిన అంశం కావడంతో రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్నివిధాలా సహాయ, సహకారాలు అందిస్తామని కేంద్రమంత్రికి స్పష్టం చేశారు సీఎం. ఆదిలాబాద్‌లో రానున్న భారతీయ వాయుసేన ఎయిర్‌పోర్ట్‌ను భారీగా విస్తరిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్నివిధాలా సహకరిస్తామని వివరించారు. భారత వాయుసేన టెర్మినల్‌తో పాటు ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మించనున్న పౌర విమానయాన శాఖకు చెందిన టెర్మినల్ బిల్డింగ్‌తో పాటుగా కార్గో, ఎమ్ఆర్‌వో , హ్యాంగర్ సౌకర్యాలను పెద్దఎత్తున ఏర్పాటు చేసేలా సహకరించాలని ముఖ్యమంత్రి కోరారు. ఇటీవల పశ్చిమాసియాలో చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో ప్రపంచ ప్రసిద్ధిగాంచిన ఎయిర్‌లైన్స్ తమ హ్యాంగర్స్‌ను ఏర్పాటు చేసుకోవడానికి అత్యంత అనుకూలమైన ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్‌ను ఆ దిశగా అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్రంలోని మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర సమీపంలో డీఆర్డీవో/డీఆర్‌డీఎల్ ఎంచుకున్న ప్రదేశంలో వారికి సంబంధించిన కీలకమైన ప్రాజెక్ట్‌ను త్వరగా మంజూరు చేయాలని కేంద్రమంత్రికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. హస్తిన పర్యటనలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో భేటీ అయ్యారు. దాదాపు 20 నిమిషాల పాటు వివిధ అంశాలపై చర్చించారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు రక్షణభూములు బదలాయించినందుకు రేవంత్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. దేశ సమగ్రత, రక్షణకు సంబంధించిన అంశమైనందువల్ల ఆదిలాబాద్‌లో వాయుసేన విమానాశ్రయానికి సహకరిస్తామన్నారు.

# ఓట్, సీట్ చోరీలో బిజెపి నిమగ్నం

సర్ పేరిట దేశంలో ప్రజాస్వామ్యంపై దాడి జరుగుతోందని.. గతంలో ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ లేదని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. హనుమకొండలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ బూత్ లెవెల్ ఏజంట్ల శిక్షణా కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షుడు పాల్గొని ప్రసంగించారు. నాడు ఓటును జోడించే కార్యక్రమం జరిగితే.. నేడు ఓటును తొలగించే కార్యక్రమం జరుగుతోందని ఆరోపించారు. బెంగాల్‌లో ఓట్ చోరీ చేసి అడ్డదారిన బీజేపీ గెలిచిందని దుయ్యబట్టారు. ఓట్లేకాదని.. మీనాక్షి నటరాజన్ రాజ్యసభ సీటును కూడా దొంగిలించారని విమర్శించారు. ఇక దేశంలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగం ఎక్కడుందని ప్రశ్నించారు. ఓట్ల చోరీయే కాకుండా సీట్ల చోరీకి కూడా భాజపా పాల్పడుతోందని మహేశ్‌కుమార్ గౌడ్ విమర్శించారు. తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్‌ను కావాలనే తిరస్కరించారని ఆరోపించారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో ఎస్ఐఆర్‌పై నిర్వహించిన బూత్ లెవల్ ఏజెంట్ల శిక్షణ కార్యక్రమంలో మీనాక్షి నటరాజన్‌తో కలిసి మహేశ్‌కుమార్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలనలో పదేళ్లపాటు దోపిడీ చేసి ఇప్పుడు కేటీఆర్ అసత్యాలు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ దోపిడీని ప్రజలు మరిచిపోయారనే భ్రమలో కేటీఆర్ ఉన్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి, సంక్షేమం జోడెద్దుల్లా ఉన్నాయన్నారు. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు ఎప్పుడు జరిగినా కాంగ్రెస్ పార్టీ వంద సీట్లు గెలవడం ఖాయమని మహేశ్ కుమార్‌గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షా సొంత ఎజెండాతో ముందుకెళ్తున్నారని.. అందుకే వాస్తవాలు చెప్పేందుకు ఇక్కడికి వచ్చామని మహేశ్ తెలిపారు. కేటీఆర్ ఏ ముఖం పెట్టుకుని తిరుగుతున్నారని నిలదీశారు. పదేళ్లలో జరిగిన దోపిడీ, అవినీతి, అక్రమాలు మర్చిపోయారా అని ప్రశ్నించారు. ఆస్తుల కోసం చెల్లిని గెంటేసిన కేటీఆర్ ఇక ప్రజలకు ఏం న్యాయం చేస్తారన్నారు. మీనాక్షి నటరాజన్ రాజ్యసభ సీటు విషయంలో బీఆర్ఎస్ తీరు బీజేపీకి బలం చేకూర్చేలా ఉందని వ్యాఖ్యానించారు. పార్టీ కోసం కష్టపడిన వారిని గుర్తిస్తున్నామని.. కాస్త ఆలస్యం కావడంలో తమ తప్పిదం ఉందన్నారు. తప్పకుండా అందరికీ న్యాయం చేస్తామని స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికల్లో 100 సీట్లు గెలుస్తామని మహేశ్ కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు.

# చిట్టినాయుడిని వదిలిపెట్టే ప్రసక్తి లేదు

వచ్చే ఐదేళ్లు ఎవ్వరినీ మరచిపోమని, సిఎం చిట్టి నాయుడును అస్సలు వదిలిపెట్టమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించారు. వర్ధన్నపేట నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొన్నారు. వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేశ్‌తోపాటు నియోజకవర్గానికి చెందిన నేతలు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. వచ్చే ఐదేళ్లు ఏదీ మర్చిపోము. మనల్ని ఇబ్బంది పెట్టినోడిని మర్చిపోం.. మనమీద కేసులు పెట్టినోడిని మరిచిపోం. మనతో నిలబడినోళ్లను కూడా మరిచిపోమన్నారు. తప్పకుండా చెప్తున్నా.. నేను కేసీఆర్ సారంతా మంచోన్నైతే కాదు. వచ్చే ఐదేళ్లు చిట్టినాయుడుకు ఆయన బృందానికి సినిమా చూపెట్టే బాధ్యత నాది.. పక్కా విడిచిపెట్ట. రిటైరైనా పారిపోయినా సప్తసముద్రాల అవతల దాక్కున్నా.. ఎవడెవడైతే మా కార్యకర్తలను సతాయించిండో ఒక్కొక్కడిని వెతికి తెచ్చి మీ ముందట నిలబెట్టే బాధ్యత నాది.. వదిలిపెట్టే సమస్యే లేదన్నారు. ఇది నేనేం ఊరికే చెప్పడం లేదు.. గుర్తు పెట్టుకోండి. కానీ రమేశన్న (ఆరూరి రమేశ్) వీడు మంచోడేనే అన్నా అని మళ్లా వారిని తీసుకొని రావొద్దని కేటీఆర్ సూచించారు.

# నటుడు చిరంజీవితో బిజెపి అధ్యక్షుడు రామ్ భేటీ

## మోడీ 12 పాలనపై పుస్తకాలు అందచేత

తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవిని భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ భేటీకి సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో రాజకీయ, సినీ వర్గాల్లో విస్తృత చర్చకు దారితీసింది. గత కొన్నేళ్లుగా ప్రత్యక్ష రాజకీయాలకు పూర్తిగా దూరంగా ఉంటూ సినిమాలపైనే దృష్టి సారించిన చిరంజీవిని బీజేపీ కీలక నేత కలవడం వెనుక అసలు ఉద్దేశం ఏమిటనే అంశంపై పలు ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయి.బీజేపీ వర్గాల సమాచారం ప్రకారం.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం 12 ఏళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా దేశవ్యాప్తంగా 'మహాజన్ సంపర్క్ అభియాన్' కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమం ద్వారా కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, ఆర్థిక సంస్కరణలను వివిధ రంగాల ప్రముఖులకు వివరించే ప్రయత్నం జరుగుతోంది. అందులో భాగంగానే రామచందర్ రావు చిరంజీవిని కలిసి మోదీ ప్రభుత్వ పనితీరుకు సంబంధించిన ప్రత్యేక పుస్తకాలు, ప్రచార పత్రాలను అందజేసినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా దేశ అభివృద్ధి, ఆర్థిక ప్రగతి, సామాజిక రంగాల్లో జరిగిన మార్పులపై ఇద్దరి మధ్య చర్చ జరిగినట్లు సమాచారం. అధికారికంగా ఇది మర్యాదపూర్వక భేటీగా చెబుతున్నప్పటికీ, రాజకీయ వర్గాల్లో మాత్రం పలు విశ్లేషణలు కొనసాగుతున్నాయి. గతంలో ప్రజారాజ్యం పార్టీని స్థాపించి రాజకీయాల్లో కీలక పాత్ర పోషించిన చిరంజీవి, అనంతరం ఆ పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేసి కేంద్ర మంత్రిగా పనిచేశారు. ఆ తర్వాత రాజకీయాలకు దూరంగా ఉంటూ సినిమాల్లో బిజీ అయిన ఆయన మళ్లీ యాక్టివ్ పాలిటిక్స్‌లోకి వస్తారా? అనే ప్రశ్న మరోసారి తెరపైకి వచ్చింది. ముఖ్యంగా బీజేపీతో ఆయన సాన్నిహిత్యం పెరుగుతుందా అనే అంశంపై కూడా చర్చ జరుగుతోంది. చిరంజీవి తమ్ముడు, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ప్రస్తుతం ఎన్డీయే కూటమిలో కీలక భాగస్వామిగా కొనసాగుతున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో డిప్యూటీ సీఎంగా బాధ్యతలు నిర్వహిస్తున్న పవన్ కళ్యాణ్‌కు బీజేపీతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో చిరంజీవి–బీజేపీ భేటీకి మరింత ప్రాధాన్యం ఏర్పడింది. అయితే ఈ సమావేశం కేవలం మర్యాదపూర్వకంగానే జరిగిందా? లేక భవిష్యత్ రాజకీయ సమీకరణాలకు సంకేతమా? అన్నది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.

# హైదరాబాదులో బసవవతారకం క్యాన్సర్ ఆసుపత్రి రజతోత్సవం..

**హైదరాబాద్‌లో ఘనంగా బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి రజతోత్సవ వేడుకలు**

**ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు**

**డబ్బు లేదనే కారణంతో ఏ రోగికి చికిత్స ఆగకూడదన్నదే లక్ష్యమన్న బాలకృష్ణ**

**అమరావతిలోనూ క్యాన్సర్ ఆసుపత్రి నిర్మిస్తున్నామని వెల్లడి**

**ఇప్పటివరకు 3.75 లక్షల మందికి ఓపీ సేవలు అందించినట్లు వివరణ**

హైదరాబాదులోని బసవతారకం ఇండో–అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రి రజతోత్సవ (25వ వార్షికోత్సవ) వేడుకలకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరయ్యారు. ఆసుపత్రి ఛైర్మన్, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఈ సందర్భంగా మాట్లాడుతూ, పేదలకు అండగా నిలవాలనే గొప్ప లక్ష్యంతోనే ఈ ఆసుపత్రిని ఏర్పాటు చేశామని స్పష్టం చేశారు. ఈ సభలో తాను నటుడిగానో, ఎమ్మెల్యేగానో కాకుండా ఒక కొడుకుగా మాట్లాడుతున్నానని బాలకృష్ణ భావోద్వేగంగా ప్రసంగించారు. తన తల్లి బసవతారకం గారు క్యాన్సర్‌తో బాధపడ్డారని, డబ్బు ఉన్నందున తాము పోరాడగలిగామని గుర్తు చేసుకున్నారు. "డబ్బు లేని పేదలు ఈ మహమ్మారి బారిన పడితే వారి పరిస్థితి ఏంటి?" అని తన తల్లి అడిగిన మాటే ఈ ఆసుపత్రి ఏర్పాటుకు స్ఫూర్తినిచ్చిందని వివరించారు. డబ్బు లేదనే కారణంతో ఏ ఒక్క క్యాన్సర్ రోగికి చికిత్స అందకుండా పోకూడదన్నదే తమ ధ్యేయమని బాలకృష్ణ పునరుద్ఘాటించారు. 25 ఏళ్ల క్రితం చేసిన ఈ ప్రతిజ్ఞను నిలబెట్టుకున్నామని, భవిష్యత్తులోనూ కొనసాగిస్తామని భరోసా ఇచ్చారు. ప్రస్తుతం ఆసుపత్రిలో రోజుకు 35 నుంచి 40 సర్జరీలు జరుగుతున్నాయని, ఇప్పటివరకు 3.75 లక్షల మందికి ఓపీ సేవలు అందించామని తెలిపారు. దేశంలోనే తొలి బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ కేంద్రాల్లో తమది ఒకటని గర్వంగా చెప్పారు. భవిష్యత్తులో ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలోనూ బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రిని నిర్మించనున్నట్లు బాలకృష్ణ ప్రకటించారు. హైదరాబాద్‌లోని ఆసుపత్రి సేవలను కూడా మరింత విస్తరిస్తామని వెల్లడించారు. ఈ వేడుకలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, కేంద్రమంత్రులు అనుప్రియ పటేల్, పెమ్మసాని చంద్రశేఖర్, తెలంగాణ మంత్రి దామోదర రాజనరసింహ, ఏపీ మంత్రి సత్యకుమార్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

# ఢిల్లీలో మురళీమోహన్, రాజేంద్రప్రసాద్ లను సత్కరించిన మంత్రి నారా లోకేశ్

**మంగళవారం నాడు పద్మశ్రీ పురస్కారాలు అందుకోనున్న మురళీమోహన్, రాజేంద్రప్రసాద్**

**తెలుగు సినిమాకు వన్నెతెచ్చారని నటులను కొనియాడిన మంత్రి లోకేశ్**

**ఈ సత్కారంలో పాల్గొన్న కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, ఎంపీలు**

**ఎన్టీఆర్‌తో అనుబంధాన్ని గుర్తుచేసుకున్న మురళీమోహన్, రాజేంద్రప్రసాద్**

కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పద్మశ్రీ పురస్కారాలను అందుకునేందుకు ఢిల్లీకి విచ్చేసిన ప్రముఖ సినీ నటులు మురళీమోహన్, రాజేంద్రప్రసాద్‌లను ఏపీ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఘనంగా సత్కరించారు. మంగళవారం నాడు ఢిల్లీలో జరగనున్న పద్మ అవార్డుల ప్రదానోత్సవంలో పాల్గొనేందుకు వచ్చిన ఈ ఇద్దరు సీనియర్ నటులను లోకేశ్ కలుసుకుని, జ్ఞాపికలు అందజేసి అభినందించారు. వందలాది చిత్రాలలో నటించి, తెలుగు చిత్రసీమకు వన్నె తెచ్చిన ఇద్దరు దిగ్గజ నటులకు ఏకకాలంలో పద్మశ్రీలు దక్కడం రాష్ట్రానికే గర్వకారణమని ఈ సందర్భంగా లోకేశ్ ప్రశంసించారు. ఈ సందర్భంగా, దివంగత నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) గారితో తమకున్న సాన్నిహిత్యాన్ని మురళీమోహన్, రాజేంద్రప్రసాద్‌లు గుర్తుచేసుకున్నారు. భవిష్యత్తులోనూ తెలుగు కళామతల్లికి తమ సేవలను కొనసాగించాలని మంత్రి లోకేశ్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుతో పాటు పలువురు పార్లమెంటు సభ్యులు కూడా పాల్గొని మురళీమోహన్, రాజేంద్రప్రసాద్‌లను అభినందించి సన్మానించారు.



# రాష్ట్రంలో కుట్రలు పన్నే పార్టీలు

రాష్ట్రంలో కుట్రలు పన్నే పార్టీలు ఉన్నాయని.. ప్రతి అంశాన్ని రాజకీయం చేసేందుకు ప్రయత్నిస్తున్నాయని సీఎం చంద్రబాబు అన్నారు. వివిధ ఘటనలకు కులమతాల రంగు పులుముతున్నారని.. వాటిని వివాదాస్పద అంశాలుగా మారుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్టీజీఎస్‌పై సమీక్షలో భాగంగా సీఎం చంద్రబాబు మాట్లాడారు. ఫేక్ ప్రచారం చేస్తూ ఉద్యోగులు, అధికారులను బద్నాం చేస్తున్నారన్నారు. ప్రభుత్వాన్ని టార్గెట్ చేస్తూ దుష్ప్రచారం చేస్తున్నారని ఆక్షేపించారు. ఇలాంటి విషయాల్లో అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సీఎం చంద్రబాబు సూచించారు. మానవీయ కోణంలో పీజీఆర్ఎస్ అర్జీలను పరిష్కారించాలని అధికారులను ఆదేశించారు. ఇటీవల కాలంలో మానసిక సమస్యల కారణంగా కూడా కొంతమంది నేరాలకు పాల్పడుతున్నారని చంద్రబాబు అన్నారు. డ్రగ్స్, గంజాయిలకు అలవాటు పడి తప్పుదారి పడుతున్నారని వ్యాఖ్యానించారు. 2019లో జరిగిన కొన్ని నేరాలను ఇప్పుడు ట్రేస్ చేసి పట్టుకుంటున్నారని, శిక్షలు కూడా పడుతున్నాయని చెప్పారు. ఇలాంటివి ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరముందన్నారు. తప్పుచేసిన వాడు ఎప్పుడూ తప్పించుకోలేడని హెచ్చరించారు. డిసెంబర్ నెలలో క్వాంటం కంప్యూటర్ లాంచ్ చేసేలోపు క్వాంటం పార్కు, సెమీ కండక్టర్ల పార్కు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమస్య పరిష్కారం కోసం అధికారులు, ఉద్యోగుల వద్దకు వచ్చే పౌరులతో సౌమ్యంగా వ్యవహరించాలన్నారు.పీజీఆర్ఎస్ అర్జీలను మానవీయ కోణంలో పరిష్కరించాలని అధికారులకు సీఎం చంద్రబాబు నాయుడు సూచించారు. అర్జీదారుల స్థానంలో ఉండి ఫిర్యాదులను పరిష్కరించే దిశగా దృష్టి సారించాలని ఆదేశించారు. ఉద్యోగులు, అధికారులు సాఫ్ట్ స్కిల్స్ అలవరచుకోవాలన్నారు. వినూత్న ఆలోచనలతో పని చేసే విధంగా ప్రోత్సహిస్తామన్నారు. పనితీరు ఆధారంగానే బాధ్యతలు అప్పగిస్తామని స్పష్టం చేశారు. ప్రజలతో వ్యవహరించే సమయంలో సౌమ్యంగా, మర్యాదపూర్వకంగా ఉండాలని సూచించారు. దీనివల్ల పాలనపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతుందని తెలిపారు. మానవ వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని, ఉద్యోగులు తమ సామర్థ్యాలను ఎప్పటికప్పుడు పెంచుకోవాలని చెప్పారు. తప్పుడు ప్రచారాలను, విద్వేషాలు పెంచే ఘటనలను అదుపు చేసేలా ఉద్యోగులు, అధికారులు అప్రమత్తతతో వ్యవహరించాలని సూచించారు. ఇటీవల కాలంలో మానసిక సమస్యల కారణంగా కూడా కొంతమంది నేరాలకు పాల్పడుతున్నారని సీఎం పేర్కొన్నారు. డ్రగ్స్, గంజాయిలకు అలవాటు పడి తప్పుదారి పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

# రైతులను ఇబ్బంది పెడితే చర్యలు

సోమవారం రాష్ట్ర సచివాలయంలో ఖరీఫ్–2026 ఎరువుల లభ్యత, పంపిణీపై మంత్రి సమీక్ష నిర్వహించారు. వ్యవసాయశాఖ అధికారులు, ఎరువుల కంపెనీ, అసోషియేషన్ సభ్యులతో సమావేశమయ్యారు. యూరియా, డీఏపీతో కాంప్లెక్స్ ఎరువుల బలవంతపు విక్రయాలు ఆపాలన్నారు. రైతులకు అవసరమైన ఎరువులనే అందించాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో అవసరమైన మేర కన్నా అధిక ఎరువుల నిల్వలు అందుబాటులో ఉన్నాయని మంత్రి చెప్పారు. యూరియా సరఫరాలో ఎలాంటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఎరువుల బుకింగ్ యాప్ నిర్వహణ సజావుగా ఉండాలన్నారు. నానో యూరియా ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. సహజ వ్యవసాయంపై రైతుల్లో ఆసక్తి పెరుగుతోందని తెలిపారు. సాధ్యమైనంత మేర రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలని, అధిక ఎరువుల వినియోగంపై రైతులు అప్రమత్తంగా ఉండాలని వెల్లడించారు. ఎమ్ఆర్‌పీ ధరకే యూరియాను విక్రయించాలని, ఎమ్ఆర్‌పీకి మించి విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని డీలర్లకు మంత్రి హెచ్చరిక జారీ చేశారు. యూరియా పక్కదారి పట్టకుండా ప్రత్యేక విజిలెన్స్ బృందాలు ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ఎరువుల బస్తాకు పూర్తి లెక్క ఉండాలన్నారు. గతంలోలా అక్రమాలు, ఇబ్బందులు సృష్టిస్తే ఉపేక్షించబోమని.. రైతుల ప్రయోజనాలే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

# 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎపి

2047 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి ప్రధాన విజన్ అని లోకేష్ వెల్లడించారు. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల సృష్టే ధ్యేయంగా ప్రభుత్వం అహర్నిశలూ శ్రమిస్తోందని చెప్పారు. ఢిల్లీ వేదికగా జరిగిన 'రిపబ్లిక్ టీవీ సమిట్ 2026'లో ఆంధ్రప్రదేశ్ ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పాల్గొని రాష్ట్ర అభివృద్ధి, భవిష్యత్తు ప్రణాళికలపై కీలక వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్ర రూపురేఖలను మార్చేందుకు అత్యంత వేగంగా అడుగులు వేస్తోందని ఆయన స్పష్టం చేశారు. పెట్టుబడులను ఆకర్షించడంలో దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఏపీ ఫార్ములాను అందిస్తోందని పేర్కొన్నారు. మా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అత్యంత వేగంగా పనులు పూర్తి కావాలని కోరుకునే ఒక 'స్పీడ్ బాస్'. ఆయన వేగానికి తగ్గట్టుగానే యంత్రాంగం పనిచేస్తోంది. ప్రస్తుతం దేశంలోకి వస్తున్న మొత్తం విదేశీ పెట్టుబడులలో 25 శాతం వాటా ఒక్క ఆంధ్రప్రదేశ్‌కే వస్తుండటం మా ప్రభుత్వ సమర్థతకు నిదర్శనం' అని లోకేష్ గర్వంగా ప్రకటించారు. రాష్ట్రంలో పారిశ్రామిక అనుమతులు, భూ కేటాయింపులు ఎంత వేగంగా జరుగుతున్నాయో వివరించడానికి మంత్రి కొన్ని ఉదాహరణలను ప్రస్తావించారు. కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక రక్షణ ప్రాజెక్ట్ కోసం కేవలం 37 రోజుల్లోనే 600 ఎకరాల భూమిని సేకరించి అప్పగించాం.గూగుల్ డేటా సెంటర్ ప్రాజెక్ట్‌ను కేవలం 13 నెలల రికార్డు కాలంలోనే పట్టాలెక్కించి ప్రభుత్వ స్పీడ్‌ను నిరూపించాం. రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణంపై లోకేష్ ప్రత్యేకంగా మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులు కేవలం ప్రారంభం మాత్రమేనని, అమరావతి ఒక 'సెల్ఫ్–ఫైనాన్సింగ్ ప్రాజెక్ట్' అని స్పష్టం చేశారు. ప్రస్తుతం రూ. 60,000 కోట్ల నిధుల సమీకరణతో అమరావతిని ప్రపంచస్థాయి నగరంగా నిర్మిస్తున్నట్లు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీకి ఇచ్చిన మాట ప్రకారం.. 2028 నాటికల్లా అమరావతి కోర్ క్యాపిటల్ భవనాలను సిద్ధం చేస్తామని హామీ ఇచ్చారు. ఢిల్లీ రాజకీయాల్లో ఏపీ ప్రాధాన్యతను ప్రస్తావిస్తూ.. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వ కూటమిలో ఏపీ నుంచి ఎక్కువ మంది ఎంపీలు ఉండటం వల్ల దేశ రాజధానిలో మన రాష్ట్ర గొంతు ఎంతో బలంగా వినబడుతోందని అన్నారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం ఆంధ్రప్రదేశ్‌ను మూడు ప్రధాన ఆర్థిక హబ్‌లుగా తీర్చిదిద్దుతున్నట్లు మంత్రి లోకేష్ వివరించారు. విశాఖపట్నం ఐటీ హబ్‌గా, అమరావతి నాలెడ్జ్ హబ్ గా, రాయలసీమ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌గా మారబోతున్నాయని అన్నారు.

రాజకీయాల్లో మార్పుల గురించి మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీలో స్పష్టమైన 'జనరేషన్ షిఫ్ట్' కనిపిస్తోందని లోకేష్ అన్నారు. తాము యువతకు పెద్దపీట వేస్తున్నామని, ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో 50 శాతం మంది తొలిసారి ఎమ్మెల్యేలుగా ఎన్నికైన వారేనని మంత్రి నారా లోకేష్ ఈ సందర్భంగా గుర్తుచేశారు.

## సాయికృష్ణ కేసు నుంచి సుగాలీ ప్రీతి ఉదంతం వరకు

# ప్రజలను మోసం చేస్తున్న డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్

సాయికృష్ణ కేసులో ఒక అధికారి విచారణ జరుపుతుండగా హఠాత్తుగా 'సిట్' వేయడం వెనుక ఆంతర్యమేంటని ప్రశ్నించారు. ప్రజల నుంచి వస్తున్న ఒత్తిడిని తట్టుకోలేకనే ఈ నాటకాలు ఆడుతున్నారని, ఈ కేసులో వాస్తవాలు బయటకు రావాలంటే సీబీఐ లేదా ఎన్ఐఏ చేత విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కోనసీమలో కాపు నేతల సమావేశంపై పవన్ ఇష్టం వచ్చినట్లు మాట్లాడారని, గతంలో కులాల గురించి పవన్ మాట్లాడినట్లుగా ఈ రాష్ట్రంలో ఎవరూ మాట్లాడి ఉండరని అంబటి రాంబాబు దుయ్యబట్టారు. ఒకవైపు సాయికృష్ణ ఇంటికి జనసేన నేతలను పంపుతూ.. మరోవైపు ఈ కేసులో నిందితుడైన సీఐ నాగరాజును అరెస్ట్ చేయవద్దని ఆందోళనలు చేయించడం పవన్ దుర్మార్గపు రాజకీయాలకు నిదర్శనమని ఆగ్రహం వ్యక్తం చేశారు.

నంది పత్రిక
మంగళవారం 23 - 06 -2026

# జర్నలిస్ట్ పిల్లలకు ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాల లో ఉచిత విద్య

**ఆర్.సి.నెం. 630965/సి5/2026**

**నంది పత్రిక ప్రతినిధి కడప** వైఎస్ఆర్ కడప జిల్లాలోని ప్రైవేట్ అన్-ఎయిడెడ్ గుర్తింపు పొందిన పాఠశాలల్లో చదువుతున్న అక్రిడిటెడ్ జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ కల్పించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ (ఏ.పి.యు.డబ్ల్యు.జె.), వైఎస్ఆర్ కడప జిల్లా వారు చేసిన సంక్షేమ చర్యల అభ్యర్థనపై ఆదేశాలు జారీ చేయబడ్డాయి.ఆర్.సి.నెం. 630965/సి5/2026

**సూచన:** కన్వీనర్ విజ్ఞప్తి, ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఏ.పి.యు.డబ్ల్యు.జె.), వైఎస్ఆర్ కడప జిల్లా.

**ఆర్డర్:** అయితే, పైన చదివిన ప్రస్తావనలో, ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఏ.పి.యు.డబ్ల్యు.జె.), వైఎస్ఆర్ కడప జిల్లా కన్వీనర్, పూర్వపు జిల్లాలో ప్రైవేట్ అన్-ఎయిడెడ్ గుర్తింపు పొందిన పాఠశాలల్లో అక్రిడిటెడ్ జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ/ఉచిత విద్యను అందించే కార్యక్రమం చాలా సంవత్సరాలుగా అమలులో ఉందని పేర్కొంటూ, వైఎస్ఆర్ కడప జిల్లా కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్‌కు ఒక వినతిపత్రాన్ని సమర్పించారు. ఇంకా, జిల్లాలో పనిచేస్తున్న అక్రిడిటెడ్ జర్నలిస్టులు, ముఖ్యంగా దారిద్ర్యరేఖకు దిగువన (బిపిఎల్) ఉన్న వర్గానికి చెందిన వారు, తమ పిల్లల విద్యా ఖర్చులను భరించలేని స్థితిలో ఉన్నారని, మానవతా దృక్పథంతో 2026-2027 విద్యా సంవత్సరానికి వైఎస్ఆర్ కడప జిల్లాలోని అక్రిడిటెడ్ జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీని విస్తరించాలని అభ్యర్థించారు. పై విషయాలను దృష్టిలో ఉంచుకుని, జిల్లాలోని గుర్తింపు పొందిన ప్రైవేట్, స్వయం సహాయక పాఠశాలల కరస్పాండెంట్లు/యాజమాన్యాలందరూ, జిల్లాలో దారిద్ర్యరేఖకు దిగువన (బీపీఎల్ ) ఉన్న గుర్తింపు పొందిన జర్నలిస్టుల పిల్లలకు 2026-2027 విద్యా సంవత్సరానికి, కేవలం మానవతా దృక్పథంతో, యాజమాన్యం యొక్క ఆర్థిక సామర్థ్యం మరియు విచక్షణకు లోబడి, ఎటువంటి మినహాయింపు లేకుండా ఫీజు రాయితీని అందించాలంటూ, ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఏ .పి .యూ డబ్ల్యు జె .), వైఎస్ఆర్ కడప జిల్లా కన్వీనర్ చేసిన అభ్యర్థనను పరిగణనలోకి తీసుకోవాలని ఆదేశించడమైనది. అందువల్ల, జిల్లాలోని డిప్యూటీ విద్యాధికారులు మరియు మండల విద్యాధికారులందరూ తమ తమ అధికార పరిధిలో, చెల్లుబాటు అయ్యే అక్రిడిటేషన్ కార్డులు కలిగి ఉండి, దారిద్ర్యరేఖకు దిగువన (బి పి ఎల్ ) ఉన్న వర్గానికి చెందిన గుర్తింపు పొందిన పాత్రికేయుల పిల్లలకు ఫీజు రాయితీ కల్పించడాన్ని పర్యవేక్షించాలని మరియు దానికి సంబంధించిన అనుగుణ్యతా నివేదికలను వై.ఎస్.ఆర్. కడప జిల్లా విద్యాధికారికి తప్పనిసరిగా సమర్పించాలని ఇందుమూలంగా ఆదేశించడమైనది.

## క్వారీలో చనిపోయిన మైనర్ల కుటుంబానికి అండగా నిలిచిన కడప ఎంపీ అవినాష్ రెడ్డి





**నంది పత్రిక ప్రతినీధి కడప** వైయస్ఆర్ జిల్లా చక్రాయపేట అక్రమ ఇసుక క్వారీలో పడి చనిపోయిన మైనర్ల కుటుంబానికి అండగా నిలిచిన ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డి క్వారీ కుంటలో పడి చనిపోయిన జయంత్ రెడ్డి, రాజవర్ధన్ రెడ్డి మృతదేహాలను పరిశీలించి.. బాధిత తల్లిదండ్రులకు పరామర్శనిన్న రాత్రి నుంచి పెన్నా నదిలోనే చిన్నారుల మృతదేహాలతో నిరసన వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు, గ్రామస్థులు ఇసుక దందా నడుపుతున్న టీడీపీ నేత బీటెక్ రవి అక్కడికి రావాలంటూ తల్లిదండ్రులు, గ్రామస్థులు డిమాండ్



# విద్యారంగ సమస్యల పై కదంతొక్కిన ఆర్ఎస్ఎఫ్...

**కార్పొరేట్, ప్రయివేట్ స్కూల్స్ ఫీజుల తో దోపిడీని ఆపాలి...**

**తల్లికి వందనం నిధులను వెంటనే విడుదల చేయాలి...**

**పెండింగ్ లో వున్న ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలి...**

**ధరలకు అనుగుణంగా సంక్షేమ హాస్టల్ మెస్ చార్జలను పెంచాలి..**

**పేద మధ్యతరగతి విద్యార్థులకు ఉన్నత చదువులను దూరం చేసే జీవో నెంబర్ 77 ను రద్దు చేయాలి..**

**కడప కలెక్టరేట్ వద్ద భారీగా ఆందోళనలు...**

**మహావీర్ సర్కిల్ నుండి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ...**

**రెవల్యూషనరీ స్టూడెంట్స్ ఫోరమ్ (ఆర్ఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు డి.యం.ఓబులేసు యాదవ్**




**నందిపత్రిక ప్రతినిధి, జూన్ 22, వైయస్సార్ కడప జిల్లా,** ఫీజుల దోపిడీని అరికట్టాలని, ఫీజుల బకాయిలను వెంటనే విడుదల చేయాలని, సంక్షేమ హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని రెవల్యూషనరీ స్టూడెంట్స్ ఫోరమ్ (ఆర్ఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు డి.యం.ఓబులేసు యాదవ్ డిమాండ్ చేయారు. సోమవారం కడప కలెక్టరేట్ వద్ద విద్యార్థులతో భారీగా ఆర్ఎస్ఎఫ్ ఆందోళన నిర్వహించారు. అంతకు ముందు మహావీర్ సర్కిల్ నుండి ర్యాలీ నిర్వహించారుఈ సందర్భంగా డి.యం. ఓబులేసు యాదవ్ మాట్లాడుతూ సంవత్సరాల నుండి విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండుల నుండి ఒకటే డిమాండ్ ప్రయివేట్ కార్పొరేట్ స్కూల్స్ తగ్గించాలని, కానీ యేటా స్కూల్ ఫీజులు పెంచుతూజునే వున్నారన్నారు. నారాయణ, చైతన్య, భాష్యం శ్రీధర్ రెడ్డి, జీవన్ జ్యోతి, ఎడిపై, విద్యా సంస్థల దోపిడీ లో ముందున్నయ్యన్నారు.విద్యార్థుల తల్లిదండ్రుల సంపాదనలో 70% పిల్లల చదువులకే ఖర్చు పెడుతున్నారన్నారు. ఒక్కో విద్యార్థికి లక్ష రూ. ఫీజు కట్టాల్సి వస్తుందన్నారు.. కలెక్టర్ గారు జిల్లాలోని కార్పొరేట్, ప్రయివేట్ స్కూల పైన చర్యలు తీసుకోవాలి, అవినీతి డిఈఓ షంసుద్దీన్ పై చర్యలు తీసువాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం నుండి ఇప్పటి వరకు డిగ్రీ, ఇంజనీరింగ్, పాలిటెక్నిక్, ఫార్మసీ తదితర విద్యార్థులకు 7 వేల కోట్ల రు. ఫీజు బకాయిలు పెండింగ్లో వున్నాయి, వెంటనే చెల్లించాలని ఆర్ఎస్ఎఫ్ డిమాండ్స్ చేస్తుందన్నారు. సంక్షేమ హాస్టల్ విద్యార్థులు హాస్టల్స్ లల్లో సరైన వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారు, హాస్టల్ మైంటెనెన్సు చార్జెస్, మెస్ చెస్ చార్జెస్ ను పెంచి, సమయానికి ఇవ్వాలి, అదేవిదంగా పేద మధ్యతరగతి విద్యార్థులు ఏంబిఏ, ఏంసిఏ, ఏం ఫార్మసీ లాంటి పీజీ కోర్సులు చదవాలి అంటే ఫీజులు ప్రభుత్వం నుండి రాకుండా వున్నా జిఓ నెంబర్ 77 ను రద్దు చేయాలి. ప్రభుత్వం పాఠశాలలకి, జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలల అభివృద్ధికి నిధులు ఇవ్వాలి, అధ్యాపక పోస్టులను భర్తి చేయని డిమాండ్స్ చేశారు. దీని పైన ప్రభుత్వం స్పందించ కుంటే రాష్ట్రం వ్యాప్తంగా విద్యారలతో తొందర్లో చలో విజయవాడ పిలుపునిచ్చి సెక్రటరియేట్ ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సి.వంశీ పి.రెడ్డి సాయి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శివ కేశవ,యోగి వేమన యూనివర్సిటీ పరిరక్షణ కమిటీ కన్వీనర్ అమృత్ కుమార్, రాష్ట్ర నాయకులు చిరంజీవి, నగర అధ్యక్షులు సాత్విక్, డాక్టర్ సుమన్ విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు




## పాణ్యం పేదలకు కొండంత అండ 'సీఎం రిలీఫ్ ఫండ్' : ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి



**నంది పత్రిక, కల్లూరు** ఆర్థిక ఇబ్బందుల్లో ఉండి, వైద్య ఖర్చులు భరించలేని పేద ప్రజలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (జవీ=ఖీ) కొండంత అండగా నిలుస్తోందని పాణ్యం శాసనసభ్యురాలు, టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షురాలు శ్రీమతి గౌరు చరిత రెడ్డి పేర్కొన్నారు.నియోజకవర్గానికి చెందిన 43 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ. 36,72,833/- (ముప్పై ఆరు లక్షల డెబ్బై రెండు వేల ఎనిమిది వందల ముప్పై మూడు రూపాయల) విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆమె నియోజకవర్గ కేంద్రంలో లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

**ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి మాట్లాడుతూ...**"వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక ఇబ్బందులు పడుతున్న అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. నిరుపేదల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోంది. నియోజకవర్గంలో లబ్ధిదారులందరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా నిరంతరం కృషి చేస్తాం." ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ఈ సందర్భంగా ప్రభుత్వానికి, ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

## నియోజకవర్గం లోని వీరపునాయుని పల్లె మండలంలో నీ మిట్టపల్లి గ్రామంలో సీతారాముల వారి నూతన భూమి పూజ కార్యక్రమం...



**నందిని ప్రతినిధి, జూన్ 22, వైయస్సార్ జిల్లా.** నియోజకవర్గంలోని వీరపు నాయన పల్లి గ్రామములో సీతారాముల వారి నూతన భూమి పూజ కార్యక్రమం పాల్గొన్న పుత్తా నర్సింహారెడ్డి, అనంత అనంతరం మండలంలోని మొయిళ్ళ చెరువు గ్రామంలో నూతన గంగమ్మ తల్లి భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న పుత్తా నరసింహారెడ్డి, ఈ కార్యక్రమంలో మండల నాయకులు కార్యకర్తలు, అధిక సంఖ్యలో పాల్గొన్నటువంటి ప్రజలు.

## అభివృద్ధి పేరిట వినాశనం -అడవుల నరికివేతతోనే వర్షాభావ పరిస్థితులు -ఇస్కఫ్

**ఇస్కఫ్ 85వ వార్షికోత్సవం.**

**నంద్యాల ప్రతినిధి. జూన్ 22 . (నంది పత్రిక ):**కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అభివృద్ధి పేరిట విచ్చలవిడిగా అడవులను నరికివేస్తూ పర్యావరణ వినాశనానికిఒడిగడుతున్నాయని భారత సాంస్కృతిక సహకార స్నేహ సంఘం (ఇస్కఫ్) నంద్యాల జిల్లా సమితి తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది.అడవుల అంతర్ధానం వల్లే రుతుపవనాల గమనం తప్పి, తీవ్ర వర్షాభావ పరిస్థితులు తలెత్తుతున్నాయని మండిపడింది.నంద్యాల పట్టణంలోని లీడర్స్ మోడల్ స్కూల్‌లో సోమవారం ఇస్కఫ్ 85వ వార్షికోత్సవ సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశానికి కోశాధికారి మురళీధర్ అధ్యక్షత వహించగా, జిల్లా గౌరవాధ్యక్షులు అబులైస్, అధ్యక్షులు షణ్ముఖ రావు, ప్రధాన కార్యదర్శి రియాజ్ లు ముఖ్య వక్తలుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ప్రకృతిని కాపాడాల్సిన ప్రభుత్వాలే ప్రాజెక్టుల పేరుతో అడవులను ధ్వంసం చేయడం వల్ల సకాలంలో వర్షాలు పడక రైతాంగం తీవ్రంగా నష్టపోతోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.మరోవైపు, ఇరాన్ - అమెరికా దేశాల మధ్య నెలకొన్న యుద్ధ వాతావరణం ప్రపంచవ్యాప్తంగా ఆహార సంక్షోభానికి దారితీస్తోందని వక్తలు పేర్కొన్నారు.అంతర్జాతీయ ఉద్రిక్తతల వల్ల దేశంలో నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయని, దీనివల్ల సామాన్య, మధ్యతరగతి ప్రజల ఆర్థిక స్థితిగతులు పూర్తిగా అస్తవ్యస్తంగా తయారయ్యాయని ధ్వజమెత్తారు. ప్రభుత్వాలు ఇప్పటికైనా కంటితుడుపు చర్యలు మానేసి, అడవుల రక్షణకు కఠినమైన చట్టాలు అమలు చేయాలని ఇస్కఫ్ డిమాండ్ చేసింది. రాబోయే తరాల మనుగడ కోసం ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా పర్యావరణ పరిరక్షణ ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమంలో కోశాధికారి మురళీధర్, కార్యవర్గ సభ్యులు రాజేశ్వరయ్య, లక్ష్మణ్, ఇస్కఫ్ నాయకులు సామెల్, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




## ఆత్మకూరులో 100 రోజుల ఉచిత షటిల్ శిక్షణా శిబిరం!

**ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి సహకారంతో ఏర్పాట్లు**

**జూన్ 25 నుంచి ఎన్టీఆర్ కేవీకే స్టేడియంలో ప్రారంభం**

**సద్వినియోగం చేసుకోవాలన్న స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ పస్పిల్ మున్నా**

**ఆత్మకూరు, జూన్ 22 నందిపత్రిక:** ఆత్మకూరు పట్టణంలోని క్రీడాకారులను ప్రోత్సహించేందుకు శ్రీశైలం నియోజకవర్గ ప్రియతమ శాసనసభ్యులు బుడ్డా రాజశేఖర్ రెడ్డి అన్న ప్రత్యేక సహకారంతో ఉచిత షటిల్ (బ్యాడ్మింటన్) శిక్షణా శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆత్మకూరు స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ పస్పిల్ మున్నా ఒక ప్రకటనలో తెలిపారు.స్థానిక ఎన్టీఆర్ కేవీకే ఇండోర్ స్టేడియంలో ఫ్లడ్‌లైట్ల వెలుతురులో ఈ శిక్షణ కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు. జూన్ 25వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ఈ శిక్షణా శిబిరం ప్రతిరోజూ సాయంత్రం 6:00 గంటల నుండి రాత్రి 7:30 గంటల వరకు జరుగుతుందని వెల్లడించారు.




**జాతీయ క్రీడాకారుడితో శిక్షణ** ఈ శిక్షణా శిబిరానికి కోచ్‌గా ఆత్మకూరు పట్టణానికే చెందిన ప్రముఖ జాతీయ షటిల్ క్రీడాకారుడు ఖాజా హుస్సేన్ వ్యవహరిస్తారని చైర్మన్ తెలిపారు. మొత్తం 100 రోజుల పాటు సుదీర్ఘంగా సాగే ఈ ఉచిత శిక్షణ ద్వారా పిల్లల్లో క్రీడా నైపుణ్యాలను పెంపొందించడం జరుగుతుందన్నారు.వయోపరిమితి: 8 సంవత్సరాల నుండి 16 సంవత్సరాల లోపు పిల్లలు.అర్హులు ఆత్మకూరు పట్టణం మరియు చుట్టుపక్కల పరిసర ప్రాంతాల విద్యార్థులు, క్రీడాకారులు. "ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి క్రీడల పట్ల ఎంతో మక్కువతో, మన ప్రాంత పిల్లల భవిష్యత్తు కోసం కల్పిస్తున్న ఈ సువర్ణ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి."అన్నారు.పస్పిల్ మున్నా, చైర్మన్, ఆత్మకూరు స్పోర్ట్స్ క్లబ్. ఈ కార్యక్రమంలో క్రీడా బాక్సింగ్ శిక్షకులు ఉపేంద్ర, తైక్వాండో శిక్షకులు స్వామన్న తదితరులు పాల్గొన్నారు.

## మిమ్మల్ని కొత్త కృష్ణ చైతన్య రెడ్డి గారి జన్మదిన సందర్భంగా...



**నంది ప్రతినిధి, జూన్ 22, వైయస్సార్ జిల్లా** ఎమ్మెల్యే కృష్ణ చైతన్య రెడ్డి జన్మదిన సందర్భంగా చింతకొమ్మదిన మండలం పాలుపల్లె గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు జ రిషిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో జనార్దన్ రెడ్డి బండలాగుడు పోటీలను అంతరం వారు ఏర్పాటు చేసిన బహుమతులు ఇచ్చు కార్యక్రమంలో నరసింహారెడ్డి మరియు నాయకులు పాల్గొన్నారు. కార్యకర్తలు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథిని మర్యాద పూర్వకంగా కలిసిన పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు.

**ఏలూరుబ్యూరో చీఫ్ జూన్ 22, నంది పత్రిక** బుట్టాయగూడెం ఐటిడిఏ సమావేశం మందిరంలో సోమవారం పోలవరం నియోజకవర్గం సమీక్ష సమావేశానికి వచ్చిన రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాలు శాఖ మంత్రి కొలుసు పార్థసారథికి, పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు పూలమొక్కను అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సిఈవో పి.జగదాంబ, ఆర్డీవో యం.వి. రమణ, స్పెషల్ డిప్యూటీ కలెక్టరు ఐ.కిషోరు, వివిధ శాఖలు జిల్లా, డివిజన్, మండల అధికారులు పాల్గొన్నారు..



# ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల దోపిడిని అరికట్టాలి.

**విద్యా వ్యాపారానికి గ్రీన్ సిగ్నల్ ఇస్తున్న స్థానిక మండల విద్యాశాఖ అధికారులు ప్రైవేట్ ,కార్పొరేట్ విద్యాసంస్థల విచలవిడి దోపిడీని అరికట్టాలి---ఎఐఎస్ఎఫ్.**

**బేతంచెర్ల జూన్ 22 ( నంది పత్రిక ).** అక్షరాలతో లక్షల రూపాయల వ్యాపారం చేస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల దోపిడీని అరికట్టాలని అఖిల భారత విద్యార్థి సమైక్య మరియు అఖిల భారత యువజన సమైఖ్య నాయకులు కలిసి బేతంచెర్ల మండల స్థాయి అధికారులకు పిర్యాదు చేశాయి.ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఉదయ్ కుమార్ మాట్లాడుతూ బేతంచెర్ల మండల వ్యాప్తంగా ప్రవేట్, కార్పోరేట్ విద్యా సంస్థలు విచ్చలవిడిగా ఫీజుల దోపిడీ చేస్తున్నప్పటికీ,బేతంచర్ల మండలంలో ఉన్నటువంటి విద్యాశాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తున్నారని వారు ఆరోపించారు. ప్రభుత్వ నిబంధనలుజి ఓ. నెం :1 విద్య హక్కు చట్టం (ఆర్ టి ఈ) ను ఉల్లంఘిస్తూ నిర్వహిస్తున్నప్పటికీ, విద్యాశాఖ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని వారు ప్రశ్నించారు. ప్రవేట్, కార్పోరేట్ విద్యాసంస్థలలో అక్షరాలతో లక్షల వ్యాపారం జరుగుతున్నప్పటికీ విద్యాశాఖ అధికారులు చూసి చూడనట్టు వ్యవహరించడం చాలా బాధాకరమని వారు అన్నారు. అడ్మిషన్ మొదలుకొని బుక్స్,యూనిఫాం, స్టేషనరీ,వ్యాన్ ఫీజులు ఇలా వివిధ రకాలుగా ఒక్కొక్క దానికి ఒక్కొక్క అమౌంట్ పెట్టి విద్యార్థుల నుంచి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తూ



విద్యా వ్యాపారం చేస్తున్నటువంటి ప్రవేట్,కార్పోరేట్ విద్యా సంస్థల పైన, మండల విద్యాశాఖ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో ప్రత్యక్ష ఆందోళన కార్యక్రమాలకు సిద్ధమవుతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్ మండల నాయకులు ఎల్లకృష్ణ, ఖదీర్, శివ, గౌరీ ఉదయ్, మధు శేఖర్, సాయి, విష్ణు, శేఖర్, తరుణ్, అబ్దుల్లా, మల్లికార్జున, దుర్గాప్రసాద్, విష్ణువర్ధన్. తదితరులు పాల్గొన్నారు.

# ఏపీ ఏఐఎంఎస్ - యాప్ ద్వారా ఎరువుల పంపిణీ

**-కృత్రిమ ఎరువుల కొరతకు దారులు సుగుమం.**

**-పాత విధానం లోనే ఎరువులు పంపిణీ చేయాలి**




**నంద్యాల ప్రతినిధి. జూన్ 22 . (నంది పత్రిక ):**పాత విధానం లోనే ఎరువులు పంపిణీ చేయాలని నంద్యాల జిల్లా కలెక్టర్ ను ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి. జి. సోమన్న జిల్లా రైతు సంఘం అధ్యక్షులు ఏ. సుబ్బారెడ్డి కోరారు.అనంతరం వారు మాట్లాడుతూ ఏపీ ఏ.ఐ ఎం.ఎస్.- యాప్ ద్వారా ఎరువుల పంపిణీ చేసే విధానాన్ని రద్దుచేసి,పాత పద్ధతిలోనే రైతులకు ఎరువులు అందించాలన్నారు. సాంకేతిక నిబంధనలతో రైతులకు నష్టం..కృత్రిమ మేధ యాప్ ఆధారంగా భూ నమోదు వివరాలు, పంట విస్తీర్ణం ప్రకారం మాత్రమే ఎరువులు కేటాయించడం వల్ల వేలాది మంది రైతులు నష్టపోయే ప్రమాదం ఉందని ఆయన పేర్కొన్నారు. భూ రికార్డుల్లో నమోదు కాని భూములు కలిగిన రైతులు, కౌలు గుర్తింపు పత్రాలు లేని కౌలు రైతులు, బంజరు, లంక, దేవాదాయ, సహకార సంఘాల భూములను సాగు చేస్తున్న పేద రైతులు ఎరువులకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

# బండి ఆత్మకూరులో మీ ఇంటికి మీ డాక్టర్





**బండి ఆత్మకూరు నంది పత్రిక జూన్ 22:** బండి ఆత్మకూరు లో సోమవారం మీ ఇంటికి మీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియ రెడ్ క్రాస్ చైర్మన్ హోదాలో, జిల్లాలో ఈ కార్యక్రమం కొనసాగుతూ ఉంది. ఈ సందర్భంగా వైద్య బృందం డాక్టర్ కమలాకర్, ఫార్మసిస్ట్ పావని నర్సు సుజిత, సుధాకర్ లతోపాటు, సచివాలయం 1 ఏఎన్ఎం పుష్పలత యాదవ్, ఆశా వర్కర్లు అరుణ, లక్ష్మీదేవి పాల్గొని ప్రజలకు వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా మీ ఇంటికి మీ డాక్టర్ కార్యక్రమంలో పాల్గొన్న వైద్యాధికారి కమలాకర్ మాట్లాడుతూ ఎవరైతే వైద్యం అందక మంచానికే పరిమితమై మందులు తెచ్చుకోలేని పరిస్థితులలో ఉన్నవారికి వైద్యం చేయడం ఈ ప్రాజెక్టు యొక్క ఉద్దేశం అని అన్నారు. ఎస్సీ ఎస్టీ ప్రాంతాలలో గర్భిణీ స్త్రీ గా ఉన్నవారికి వైద్య సేవలు అందని పక్షంలో వారి వద్దకు వెళ్లి సాధారణ చికిత్సలు చేయడం జరుగుతుందని అన్నారు. గర్భిణీ స్త్రీలలో రక్తం ఎంత శాతం లో ఉంది, గర్భిణీ స్త్రీలకు కానుపు సమయాల్లో ఇబ్బందులు తలెత్తినప్పుడు, అటువంటి వారిని గుర్తించి వారు ఇంట్లోనే కానుపు కాకుండా, ఆస్పత్రులలో కాన్పు అయ్యేలా వారిని ప్రోత్సహించడం జరుగుతుందని అన్నారు. క్షయ, కుష్టు వ్యాధికి గురైన వ్యక్తులు చికిత్స తీసుకుంటూ మధ్యలో చికిత్స మానుకున్న వ్యక్తులను గుర్తించి, అటువంటి వారిని తిరిగి చికిత్స పొందేలా వారిని ప్రోత్సహించడం జరుగుతుందని అన్నారు. 0-6 వయసు కలిగిన పిల్లలలో వ్యాధి నిరోధక శక్తి ఏ మేరకు ఉందో అన్న విషయాన్ని గుర్తించి, వారికి కూడా చికిత్స చేయడం జరుగుతుందని పేర్కొన్నారు.

దీర్ఘకాలికంగా రక్త పోటు, షుగర్ వ్యాధులకు గురైన వారిని గుర్తించి, వారికి కూడా మీ ఇంటికి మీ డాక్టర్ కార్యక్రమంలో చికిత్సలు చేయడం జరుగుతుందని అన్నారు. వెనుకబడిన ప్రాంతాలలో ఆర్థిక స్తోమత లేని వారు, వయసు పైబడిన వారు, ఆసుపత్రికి వెళ్లలేని వారందరినీ గుర్తించి వారికి కూడా ఈ కార్యక్రమం ద్వారా చికిత్స చేయడం జరుగుతుందని వైద్యాధికారి కమలాకర్ పేర్కొన్నారు. బండి ఆత్మకూరులో నిర్వహించిన మీ ఇంటికి మీ డాక్టర్ కార్యక్రమంలో ప్రజలు కార్యక్రమాన్ని చక్కగా వినియోగించుకున్నారని, అందరినీ పరీక్షించి ఉచితంగా మాత్రలను పంపిణీ చేయడం జరిగిందని వైద్యాధికారి కమలాకర్ వివరించారు.

# మైదుకూరు డివిజన్లోని సబ్ స్టేషన్ లను ప్రైవేటీకరణ ను రద్దు చేయాలి.



**కడప నంది పత్రిక ప్రతినిధి** ఈరోజు మైదుకూరు డివిజన్ ఆఫీసు నందు యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు బి.నాయబ్ రసూల్ బండి రామ్మోహన్ మరియు 1104 యూనియన్ నాయకులు సుభాష్ చంద్ర ,కేశవరెడ్డి లు డివిజన్లోని మ్యానింగ్ సబ్ స్టేషన్ లను ప్రైవేటీకరణ చేయకూడదని ఒక సంయుక్త ప్రకటనలో తెలియజేశారు. ముఖ్యంగా మైదుకూరు డివిజన్ పరిధిలో ఏడు సబ్స్టేషన్ల ను ప్రైవేటీకరణ చేసే అంశం పైన మైదుకూరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగినది. డిపార్ట్మెంటల్ యాక్సిడెంట్లు మెడికల్ సంబంధించిన వ్యక్తుల కొరకు డివిజన్ మొత్తము 7 సబ్ స్టేషన్లను ఎప్పటినుంచో లైన్మెన్లు పనిచేయు చున్నారు. ట్రైపాడ్ అగ్రిమెంట్ ప్రకారము జీవో నెంబర్ 35 ప్రకారం మేనింగ్ సబ్ స్టేషన్ లో అలాగే ఉంచాలని 17.10.25 యాజమాన్యం మరియు జేఏసీ నాయకులకు పిఆర్సి సందర్భంగా ఒప్పందం కూడా జరిగినది. మన గౌరవనీయులు తిరుపతి సీఎం డి గారు మ్యానింగ్ సబ్ స్టేషన్ లో అలాగే ఉంచమని ఒక ఆర్డర్ కూడా ఇవ్వడం జరిగినది. అయితే ప్రస్తుతము ఏమైందో తెలియదు గానీ ఈ సబ్ స్టేషన్ లన్ని ప్రైవేటీకరణ చేయాలని ఉన్నతాధికారులు చేస్తున్న ప్రయత్నాలు నిలిపివేయాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యునైటెడ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు రామలింగారెడ్డి,సుధాకర్ రెడ్డి, దశరథ 1104 నాయకులు భాష, గంగా మహేశ్వర్ రెడ్డి ,శీను, శ్రీహరి, బ్రహ్మయ్య, ఓబులేసు, శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.

# శింగనపల్లె లో రైతన్న మీకోసం



**అవుకుజూన్ 22 (నందిపత్రిక )** అవుకు మండల పరిధిలోని శింగనపల్లె గ్రామం లో మండల వ్యవసాయ అధికారి కలిమున్నిసా ఆధ్వర్యంలో సోమవారం రైతన్న మీకోసం కార్యక్రమం జరిగింది .ఈ కార్యక్రమం లో కోవెలకుంట్ల సహాయ వ్యవసాయ సంచాలకులు సుధాకర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఏడిఏ మాట్లాడుతూ అవుకు మండలం లో 8947 రైతులకు గాను అన్నదాత సుఖీభవ పథకం కింద 447.35 లక్షల రూపాయలు రైతుల ఖాతాలో ప్రభుత్వం జమ చేస్తున్నట్లు తెలియజేశారు. అలాగే ప్రతి రైతు కూడా ఏ ఏ పి ఏ ఐ ఎం ఎస్ 2.0 యాప్ ను ఆండ్రాయిడ్ మొబైల్ లో డౌన్లోడ్ చేసుకోవాలి అని తెలియ జేశారు.అలాగే మండల వ్యవసాయ అధికారి కలిమున్నిసా మాట్లాడుతూఏ పి ఏ ఐ ఎం ఎస్ 2.0 యాప్ ద్వారా పంటలు మరియు విస్తీర్ణం బట్టి యూరియా మరియు డిఏపి ఎంత వస్తుందో రైతులు వారి మొబైల్ లో చూసుకొని దుకాణం ఎంచుకొని ఓటీపీ ద్వారా ఎరువులు కొనుగోలు చేయ వచ్చు అని తెలియజేశారు. ప్రస్తుతం ఎల్ నినో వర్షాభావ పరిస్థితులు ఉన్నందువల రైతులు వరి కి బదులు ప్రత్యామ్నాయ ఆరు తడి పంటలు వేసుకోవాలి అని సూచించారు.అలాగే మండలం లోని అన్ని రైతు సేవ కేంద్రాల్లో త్వరలో యూరియా, డిఏపి అందుబాటు లోకి వస్తుందని తెలియజేశారు.ఈ కార్యక్రమం లో కోవెలకుంట్ల వ్యవసాయ సహాయ సంచాలకులు సుధాకర్ ,మండల వ్యవసాయ అధికారి కలిమున్నిసా గ్రామ ఉద్యానవన సహాయకుడు తిరుపతయ్య, గ్రామ నాయకులు సాంబశివ రెడ్డి,రైతులు పాల్గొన్నారు.

## యూఏఈకి బ్రహ్మోస్ క్షిపణులు.. చర్చలు జరుపుతున్న భారత్!

భారత్ తన ప్రతిష్ఠాత్మక బ్రహ్మోస్ సూపర్‌సానిక్ క్రూయిజ్ క్షిపణి మరియు ఆకాశ్‌తీర్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థను యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)కు విక్రయించే దిశగా చర్చలు జరుపుతోంది. పశ్చిమాసియాలో నెలకొన్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలో తమ రక్షణ సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేసుకునేందుకు యూఏఈ ఆసక్తి కనబరుస్తున్న తరుణంలో ఈ చర్చలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి.

# రైతులు పథకాలు ఉపయోగించుకోండి.. ఏవో

**చాగలమర్రి జూన్ 22 నంది పత్రిక** కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అందించే పథకాలను ఉపయోగించుకోవాలని తెలియజేస్తూ సోమవారం డి వనిపెంట, ముత్యాలపాడు గ్రామాలలో చాగలమర్రి వ్యవసాయ శాఖ మండల అధికారి రంగ నేతాజీ రైతులను చైతన్యం చేస్తూ కరపత్రాలను ప్రదర్శించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతన్న మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, ఉద్యానవన సహాయకులు, పశుసంవర్ధక శాఖ సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఇంటింటికి వెళ్లి పథకాలను వివరించారు. అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్, సబ్సిడీతో బిందు, తుంపర సేద్య పరికరాలు, వ్యవసాయ యాంత్రికరణ, ఏపీ ఏఐఎంఎస్ ద్వారా ఎరువుల పంపిణీ, పశువులకు భీమా సౌకర్యం లాంటి పథకాలు రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వీ ఆర్ ఓ చంద్ర నాయక్, గ్రామ ఉద్యాన సహాయకురాలు ఉమా, దేవేంద్ర, మనీషా తదితర రైతులు పాల్గొన్నారు.




# చౌడేశ్వరి అమ్మవారి దేవస్థానంకు విరాళం

**బనగానపల్లె జూన్ 22నందిపత్రిక** నందవరం శ్రీ చౌడేశ్వరి అమ్మవారి దేవస్థానం అభివృద్ధి కి నంద్యాల వాస్తవ్యులు జొన్నలగడ్డ నాగరాజు వారి ధర్మపత్ని లక్ష్మీదేవి మరియు వారి కుటుంబ సభ్యులు సోమవారం ఆలయ అభివృద్ధి కొరకు 25,116/- రూ చందాను అభివృద్ధి కమిటీ చైర్మన్ పి.వి.కుమార్ రెడ్డి ,ఆలయ కమిటీ చైర్మన్ పి.వి. నాగార్జున రెడ్డి సమక్షంలో ఆలయ అర్చక వేదపండితులకు అందచేశారు.



# నగరపాలక సంస్థకు 33 వినతులు.

**డిప్యూటీ కమిషనర్ అమరయ్య.**



**తిరుపతి బ్యూరో చీఫ్ జూన్ 22 నంది పత్రిక** నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 33 వినతులు వచ్చాయని కమిషనర్ అమరయ్య తెలిపారు. సోమవారం తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయంకు నేరుగా వచ్చి 23మంది వినతులు సమర్పించగా, 10 మంది ఫోన్ ద్వారా తమ సమస్యలు తెలిపారు. సంజీవయ్య నగర్ లో తన స్థలంలో అక్రమ నిర్మాణం చేస్తున్నారు పరిశీలించాలని, చంద్రశేఖర్ కాలనిలో సెల్ టవర్ ఏర్పాటు చేయకుండా చూడాలని, మునిసిపల్ కూరగాయల మార్కెట్ వద్ద అనదికారిక వసూళ్లు అరికట్టాలని, భవానీ నగర్ నందు దుర్వాసన వస్తున్న డ్రైనేజి కాలువ శుభ్రం చేయాలని, బైరాగి పట్టేడ ఆర్చి వద్ద పౌల్ట్రీ వలన ఇబ్బందులు ఉన్నాయి పరిశీలించాలని, భూగర్భ డ్రైనేజి సమస్య పరిష్కరించాలని, సప్తగిరి నగర్, సుందరయ్య నగర్ నందు వాటర్ ప్లాంట్లు ఎక్కువగా ఉండడం వలన ఇబ్బందిగా ఉందని, లక్ష్మీపురం స్మశాన వాటిక లో సెక్యూరిటీ గార్డ్ నియమించాలని, ఈట్ స్ట్రీట్ నందు మరుగుదొడ్లకు మోటారు ఏర్పాటు చేయాలని, టిడిఆర్ బాండ్లు ఇప్పించాలని, ఎస్.వి నగర్ నందు డెంటల్ హాస్పిటల్ రోడ్డును ఆక్రమించి నిర్మిస్తున్నారు పరిశీలించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవిన్యూ అధికారులు సేతుమాదవ్, రవి, ఉద్యానవన శాఖాధికారి హరికృష్ణ, వెటర్నరీ ఆఫీసర్ గుణశేఖర్, డి.ఈ.లు, తదితరులు ఉన్నారు.



# ప్రభుత్వకార్యాలయాలలో
# ఈ- ఆఫీస్ వినియోగం తప్పనిసరి...





**కొన్ని శాఖలు ఇంకనూ భౌతిక ఫైల్స్ వినియోగించడం పై ఆగ్రహం వ్యక్తం చేసిన జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి...**

**అర్జీదారులతో మాట్లాడి వారి సమస్య కుపరిష్కారం సంతృప్తి స్థాయి లో నాణ్యమైన పరిష్కారం అందించండి..!**

**ఈ నెల 26 న శుక్రవారం బద్వేల్ నియోజకవర్గం లో ఒక నెల- ఒక నియోజక వర్గం -నాలుగు పర్యటనలు కార్యక్రమ నిర్వహణ**

**బద్వేల్ నియోజకవర్గం లో గతంలో జరిగినమూడు పర్యటన లలో అందిన అర్జీల పరిష్కారానికి తీసుకున్న చర్యలను సవివరంగా వివరించేందుకు అధికారులు సన్నద్ధం కండి**

**జూలై నెలలో రాజంపేట నియోజకవర్గం లో ఒక నెల- ఒక నియోజకవర్గం- నాలుగు పర్యటనల కార్యక్రమ నిర్వహణ..**

**జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి...**

**వై ఎస్ ఆర్ కడప, బ్యూరో చీ ఫ్ జూన్ 22 నంది పత్రిక** ప్రభుత్వ కార్యాలయాలలో ఈ- ఆఫీస్ వినియోగం తప్పనిసరి అని భౌతిక ఫైల్స్ వినియోగంపై అసంతృప్తి వ్యక్తం చేశారు జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి..సోమవారం సభా భవన్ లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి, జేసి డాక్టర్ నిధి మీనా, డిఆర్ఓ మల్లికార్జునుడు తదితరులు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు.ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా ప్రజల నుండి అర్జీలను జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి స్వీకరణ అనంతరం జిల్లా అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ... ప్రభుత్వ కార్యాలయాలలో పారదర్శకత కు ఈ-ఆఫీసు ఫైల్స్ తప్పనిసరి అని ప్రభుత్వం నుండి ఆదేశాలు ఉన్నాయని తరచూ సమావేశాల్లో ఆదేశాలు ఇవ్వడం జరిగిందని అయినప్పటికీ కొన్ని శాఖల్లో భౌతిక ఫైల్స్ ఎందుకు నడుపుతున్నారంటూ... ఆగ్రహం వ్యక్తం చేశారు జిల్లా కలెక్టర్

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా అందిన అర్జీల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు అర్జీ దారులతో స్వయంగా మాట్లాడి వారి సమస్య పరిష్కారానికి సంతృప్తి స్థాయిలో బాధ్యతాయుతం గా త్వరితగతిన నాణ్యమైన పరిష్కారాన్ని అందించాలన్నారు.ఈ వేదిక ద్వారా అందే అర్జీల పరిష్కారంలో అధికారులు అలసత్వం వీడి ప్రత్యేక శ్రద్ధ పెట్టి పనిచేయాలని,అర్జీలకు అర్జీదారులు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం అందించాలన్నారు. పిజిఆర్ఎస్ లో రీ ఓపెన్ అయిన అర్జీలను మరింత నాణ్యతతో పరిష్కరించాలని, జిల్లా అధికారులకు అందిన అర్జీలను పరిష్కరించేందుకు సమయం కేటాయించి సమీక్ష చేయాలన్నారు. ప్రజల వ్యయ ప్రయాసలను దృష్టిలో ఉంచుకుని క్షేత్ర స్థాయిలోనే ప్రజల సమస్యలను స్థానికంగానే గుర్తించి మండల స్థాయిలోనే పరిష్కరించేలా జిల్లా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. అలాగే అర్జీలు బియాండ్ ఎస్ఎల్ఏ లేకుండా చూడాలన్నారు.రాష్ట్ర ప్రభుత్వం రెవిన్యూ సమస్యల పరిష్కారానికి వినూత్నంగా చేపట్టిన "ఒక నెల- ఒక నియోజక వర్గం -నాలుగు పర్యటనలు" కార్యక్రమంలో భాగంగా... జూన్ 5న బద్వేల్ నియోజక వర్గం లో మొదట ఈ కార్యక్రమాన్నిప్రారంభించామని, జూన్ 5 నుండి బద్వేల్ నియోజక వర్గంలో మూడు పర్యటనలు పూర్తి అయ్యిఈ నెల 26 న శుక్రవారం "ఒక నెల- ఒక నియోజక వర్గం -నాలుగు పర్యటనలు" కార్యక్రమ నిర్వహణలో భాగంగా గత మూడు పర్యటనల్లో అందిన అర్జీల పరిష్కారానికి సంబంధిత అధికారులు తీసుకున్న చర్యలను సవివరంగా వివరించేందుకు అధికారులు సన్నద్ధం కావాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.. జూలై నెలలో రాజంపేట నియోజకవర్గం లో "ఒక నెల- ఒక నియోజకవర్గం- నాలుగు పర్యటనలు"కార్యక్రమ నిర్వహణ ఏర్పాట్లు చేయాలని రాజంపేట సబ్ కలెక్టర్ భావన ను జిల్లా కలెక్టర్ ఆదేశించారు.. ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.వి. సుబ్బారెడ్డి.. జిల్లాలోని వి.ఎం.పల్లె మండలంలోని పలు గ్రామాల రైతులు నకిలీ మొక్కజొన్న విత్తనాల వాడకం ద్వారా తీవ్రంగా నష్టపోయామని,నష్టపోయిన రైతులను ఆదుకోవాలని జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం సమర్పించారు.ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సర్ ప్రక్రియలో భాగంగా పదిమంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చి ఉన్న తప్పులను సరిచేయాలని అర్జీ సమర్పించారు. కడప పట్టణం శంకరా పురం కు చెందిన జింక శివ ప్రసాద్.. చిన్నచౌక్ పొలంలోని సర్వే నెంబర్ : 40/ 1 భూమిలో సర్వే చేయించి హద్దులు చూపాలని కోరుతూ రెవెన్యూ క్లినిక్ లో అర్జీ సమర్పించారు.

శ్రీకాకుళం హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన ఓ. ప్రకాశం.. కలసపాడు మండలం చెన్నారెడ్డి పల్లెలోని సర్వే నెంబర్ : 64లో తనకు చెందిన భూమిని తన అక్క కొడుకు పి.రవి ఆక్రమించు కున్నాడని.. తన భూమిని తనకు అందేలా చేసి నయం చేయాలని వినతిపత్రం సమర్పించారు.మైదుకూరు మండలం యల్లంపల్లెకు చెందిన గోవిందు నాగేశ్వర రెడ్డి.. వికలాంగుడినైన తనకు.. ప్రభుత్వం నుండి వికలాంగ పెన్షన్ సదుపాయం కల్పించాలని కోరుతూ.. జిల్లా కలెక్టర్ కు అర్జీని సమర్పించారు.జమ్మలమడుగు మండలం కు చెందిన జి. వెంకట రామిరెడ్డి అనే వ్యక్తి తన భూ సమస్యను పరిష్కరించాలని అర్జీ సమర్పించారు. ఈ కార్యక్రమంలో డి ఆర్ డి ఏ పిడి రాజ్యలక్ష్మి,డిపిఓవెంకటసుబ్బయ్య, జిల్లా పర్యాటక శాఖ అధికారి సురేష్ కుమార్, ఎస్ఎస్ఏ ఏపిసి అనురాధ,డిప్యూటీ కలెక్టర్ లు శివరామిరెడ్డి, జాన్ ఎర్విన్, రంగస్వామి,వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## దళిత కాలనీ నీటి సమస్యలను పరిష్కరించాలి

**- సమస్యలను తీర్చేది అధికారుల, నాయకుల**

**- మాల మహానాడు, ఎమ్మార్పీఎస్ నాయకులు**



**కొత్తపల్లి – నంది పత్రిక :** దుద్యాల గ్రామంలోని దళిత కాలనీలైన మాల, మాదిగ పేటలకు ఉన్న మంచినీటి సమస్య ను పరిష్కరించాలని మాల మహానాడు తాలుక నాయకుడు పాతకోట రమేష్, ఎమ్మార్పీఎస్ నాయకుడు సుదర్శనం డిమాండ్ చేశారు. సోమవారం దుద్యాల గ్రామంలోని సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి అనూష కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళిత కాలనీలలో వారం రోజుల నుంచి మంచినీటి సమస్య ఉన్న పట్టించుకోవడంలేదన్నారు. పంచాయతీ కార్యదర్శికి సమస్యను తెలిపితే నాయకులు అడగండి అన్నారు. కాలనీవాసులు టిడిపి నాయకుల దగ్గరికి వెళితే దుద్యాల గ్రామాన్ని నాయకులు రెండుగా పంచుకున్నాము ఆ ఏరియా అభివృద్ధి పనులు , సమస్యల గురించి మాకు కాదు అని ఒక నాయకుడు, ఇంకొక నాయకుడేమో నాకు ఇచ్చిన ఏరియాలో నేను సస్యశ్యామలంగా సమస్యలు తీరుస్తున్నాని ఒకరి మీద ఒకరు చెప్పు కొంటున్నారే తప్ప సమస్యను పరిష్కరిస్తామని అటు అధికారులు, ఇటు నాయకులు ఎవరూ చెప్పడం లేదని విమర్శించారు. మా కాలనీలను ఏ నాయకుడు పంచుకున్నాడో ఎమ్మెల్యే జయ సూర్య నే చెప్పాలని ప్రశ్నించారు. అధికారులేమో నాయకులకు చెప్పమని చెబుతూ చేతులు దులుపుకుంటున్నారు అని అన్నారు. ఓసి కాలనీలకు వెళ్లే బోరు మోటర్లకేమో 24 గంటల విద్యుత్ కనెక్షన్ ఇచ్చారు కానీ దళితుల కాలనీలకు వెళ్లే బోర్లాకి ఏమో అరకొర కరెంటు ఉండే లైన్ కు ఇచ్చి ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోయారు. అలాగే దళిత కాలనీలో ఉన్న చేతి పంపు కూడా రిపేర్ అయి నెల రోజులు అవుతున్న దాన్ని కూడా రిపేరు చేయించలేదన్నారు. అధికారులు, నాయకులు దళితులని వివక్షత చూపకుండా ఓసి కాలనీలకు వెళ్లే బోర్లకు ఇచ్చిన 24 గంటల కరెంటు కనెక్షన్ ను దళిత కాలనీలకు వెళ్లే బోర్లకు కూడా ఇవ్వాల్సిందిగా అర్జీ ఇచ్చామన్నారు.ఈ కార్యక్రమంలో దళిత కాలని వాసులు మద్దెల భాస్కర్. దారా లోకేష్ చంద్రశేఖర్ జయరాజు పాల్గొన్నారు.

## రైతులు వరి పంట సాగు వద్దు..
## పప్పు ధాన్యాల సాగు చేయండి.



**నంద్యాల సిటీ బ్యూరో జూన్ 20 ( నంది పత్రిక )** నంద్యాల మండలంలోని రైతులు వర్షాభావ పరిస్థితుల్లో వరి సాగు కంటే పప్పు ధాన్యాలు సాగు చేయాలని వ్యవసాయ ఉపసంచాలకులు గంగాధర రావు,వ్యవసాయ అధికారి ప్రసాద రావు లు పేర్కొన్నారు. నంద్యాల మండలం లోని రాయమల్పురం, పులిమద్ది మరియు భీమవరం గ్రామాలలో జరిగిన రైతన్న మీకోసం కార్యక్రమంలో వ్యవసాయ ఉపసంచాలకులు గంగాధరరావు , మండల వ్యవసాయ అధికారి ప్రసాదరావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా గంగాధరరావు మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామంలో రైతు సేవా సిబ్బంది ప్రతి రైతు ఇంటికి వెళ్లి ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వ్యవసాయంలో చేపట్టవలసిన యాజమాన్య పద్ధతుల గురించి వివరించడం జరిగిందని తెలిపారు. అలాగే ఈ ఖరీఫ్ సీజన్ లో పంటలపై ఎల్లినో ప్రభావం ఉంటుందని, వర్షాలు తక్కువగా కురిసే అవకాశం ఉన్నందున రైతులు తక్కువ నీటితో సాగు చేయగల పంటలను వేసుకోవాలని, వరి పంట సాగు తగ్గించి పప్పు ధాన్యాలు సాగు చేయాలని రైతులకు అవగాహన కల్పించడం జరిగిందని తెలిపారు. మండల వ్యవసాయ అధికారి ప్రసాద రావు మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, సూక్ష్మ నీటి పద్ధతులు అవలంబించుట వలన తక్కువ నీటితో పంటలు సాగు చేసుకోవచ్చునని , వరికి ప్రత్యామ్నాయంగా పప్పు ధాన్యాలు సాగు చేసుకోవాలని రైతులకు సూచించారు.అదే విధంగా యూరియా మరియు డి. ఎ.పి ఎరువులను ఏపీ ఎయిమ్స్ ఆప్ ద్వారా పంపిణీ చేసే విధానాన్ని రైతులకు వివరించారు. , ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ విశ్వనాథ రెడ్డి , రైతు సేవా సిబ్బంది తేజస్విని, రాము నాయక్, లలిత, ఆయా గ్రామాల రైతులు పాల్గొనటం జరిగినది

## రోజా కుంట లోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర కళ్యాణ మండపం అభివృద్ధికి
## 2 లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందించిన గోళ్ళ రాజేష్..





**దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించిన సుదర్శన యాగంలో పాల్గొన్న గోళ్ళ రాజేష్..**

**నంద్యాల సిటీ బ్యూరో జూన్ 22 ( నంది పత్రిక )** పట్టణంలోని స్థానిక రోజాకుంటలో ఏర్పాటుచేసిన శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర కళ్యాణమండపం నందు కళ్యాణమండపం అధ్యక్షులు మేడం సుబ్బగురుమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన సుదర్శన యాగం సందర్భంగా భారత దేశ ప్రజలందరూ సుభిక్షంగా సుఖసంతోషాలతో ఉండాలని ఉద్దేశంతో నిర్వహించిన సుదర్శనయాగం నందు నంద్యాల వాసి ప్రముఖ వ్యాపారవేత్త, సామాజికవేత్త గోళ్ళ రాజేష్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా దేవస్థాన అధ్యక్షుడు కమిటీ సభ్యులకు గోళ్ళ రాజేష్ ఇచ్చిన మాట ప్రకారం శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర కళ్యాణమండపం అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా అధ్యక్షులు మేడం సుబ్బ గురుమూర్తి మరియు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో రెండు లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందించారు గోళ్ళ రాజేష్ ప్రసన్న వెంకటేశ్వర స్వామి,ఆలయంతో పాటు శ్రీ వేంకటేశ్వర కళ్యాణ మండపం అభివృద్ధికి అన్ని విధాల తోడ్పాటు అందిచేందుకు గోళ్ళ రాజేష్ తనవంతు భాద్యతగా రోజా కుంటలో వెలసిన శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవాలయం తో పాటు శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర కళ్యాణ మండపం అభివృద్ధిలో తన సయంగా ఎల్లప్పుడు తోడ్పాటును అందిస్తానని ఈ సందర్భంగా గోళ్ళ రాజేష్ కమిటీ పెద్దలకు హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు మేడం శుబ్బ గురుమూర్తి, ఉపాధ్యక్షులు

గొల్ల వెంకటలక్ష్మి, సెక్రటరీలు జీలా శైలజ, ఇటికాల చంద్రమౌళీశ్వర గుప్తా, అమరేష్,వెంకట సాయి కృష్ణ,వెన్నుపూస సురేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## పురుషుల్లో మద్యపానం, మహిళల్లో స్మోకింగ్..
## ఆరోగ్య సర్వేలో ఆందోళనకర విషయాలు

దేశంలో ప్రజారోగ్య ముఖచిత్రంపై జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-6 (ఎన్ఎఫ్‌హెచ్ఎస్-6, 2023-24) ఆందోళనకర గణాంకాలను వెల్లడించింది. దేశవ్యాప్తంగా పురుషుల్లో మద్యపానం, పలు రాష్ట్రాల్లో మహిళల్లో పొగాకు వినియోగం పెరిగినట్లు ఈ సర్వే స్పష్టం చేసింది. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సహా పలు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో పురుషుల మద్యం వినియోగం పెరగడం గమనార్హం. జాతీయ స్థాయిలో 15 ఏళ్లు పైబడిన పురుషుల్లో మద్యపాన అలవాటు ఉన్నవారి సంఖ్య 18.7 శాతం నుంచి 18.9 శాతానికి స్వల్పంగా పెరిగింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, బీహార్, కేరళ, పంజాబ్, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో ఈ పెరుగుదల స్పష్టంగా కనిపించింది. మద్యపాన నిషేధం అమల్లో ఉన్న బీహార్‌లో సైతం పురుషుల మద్యం వినియోగం 15.4 శాతం నుంచి 16.5 శాతానికి పెరగడం గమనార్హం. ఆంధ్రప్రదేశ్‌లో ఈ శాతం 23.1 నుంచి 23.3కు, తెలంగాణలో 43.4 నుంచి 43.9 శాతానికి చేరింది. దేశవ్యాప్తంగా మహిళల్లో మద్యపానం అలవాటు 1.3 శాతం నుంచి 1.1 శాతానికి తగ్గింది. అయితే ఆంధ్రప్రదేశ్‌లో (0.5 నుంచి 0.6 శాతం), తెలంగాణలో (6.7 నుంచి 7.1 శాతం) మహిళా మద్యపాన ప్రియుల సంఖ్య పెరిగింది.

## ప్రకృతి వ్యవసాయంపై రైతులు మగ్గు చూపాలి

**- ఎ వో అమ్మిరున్నిసా బేగం**

**కొత్తపల్లి – నంది పత్రిక :** భూమి ఆరోగ్యంగా , ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు ముగ్గు చూపాలని మండల వ్యవసాయ అధికారిని అమ్మిరున్నిసా బేగం తెలిపారు సోమవారం మండల కేంద్రంలో రైతన్న మీకోసం కార్యక్రమం నిర్వహించి, రైతన్నలకు రైతన్న మీకోసం కరపత్రాలు పంపిణీ చేశారు అనంతరం మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయపై ముగ్గు చూపడం వల్ల మంచి ఆరోగ్యం ఉంటుందన్నారు పంచ సూత్రాలతో రైతుకి వ్యవసాయం గిట్టుబాటుగా ఉంటుందన్నారు వివిధ పంటల దిగుబడి, ధరలు , సమస్యలను అడిగి తెలుసుకున్నారు ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ లింగస్వామి గౌడ్, క్లస్టర్ ఇంచార్జి నరపు రెడ్డి, సొసైటీ చైర్మన్ నాగేశ్వరావు, అమర్నాథ్,

రైతు సేవ సిబ్బంది ప్రజా ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.



# బండి ఆత్మకూరు ఎత్తిపోతల పథకం నిర్వహణకు గ్రహణం



**బండి ఆత్మకూరు నంది పత్రిక జూన్ 22:** బండి ఆత్మకూరులోని ఎత్తిపోతల పథకానికి సంబంధించి న నిర్వహణకు గ్రహణం పట్టింది. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ఆరంభ దశలో ఉండటంతో రైతులు ఎత్తిపోతల పథకం కింద డ్రై సోయింగ్ విధానంలో వరి పంటలను సాగు చేయాలని సంసిద్ధులుగా ఉన్నప్పటికీ, పథకం నిర్వహణ మాత్రం ముందుకు సాగడం లేదు. ప్రభుత్వాలు అధికారంలో ఉన్నప్పుడు తమకు సంబంధించిన వ్యక్తులను నియమించుకొని ఎత్తిపోతల పథకాన్ని నిర్వహించడం సర్వసాధారణంగా జరుగుతూ ఉంది. 2019లో వైఎస్ఆర్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు బండి ఆత్మకూరు కు చెందిన మాజీ సర్పంచ్, ప్రస్తుత వైఎస్ఆర్ పార్టీ మహిళా విభాగానికి సంబంధించిన జిల్లా అధ్యక్షురాలు సుజాతమ్మ ఎత్తిపోతల పథకాన్ని నిర్వహిస్తూ వచ్చారు. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి, సుజాతమ్మను ఎత్తిపోతల పథకం నిర్వహణ నుంచి తొలగించే ప్రయత్నాలు జరిగాయి. ఈ ప్రయత్నంలో రెండేళ్ల కాలం గడిచిపోయింది. కొద్ది నెలల క్రితమే పథకం నిర్వహణ నుంచి సుజాతమ్మను తొలగించి అందుకు సంబంధించిన తాళాలను ఎత్తిపోతల అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలో తెలుగుదేశం పార్టీకి చెందిన ముగ్గురు వ్యక్తులకు ఎత్తిపోతల పథకానికి సంబంధించి నిర్వహణను అప్పగించే ప్రయత్నాలు చేసి, తాళాలు అప్పగించారు. నిబంధనల ప్రకారం అయితే ఎత్తిపోతల పథకాన్ని నిర్వహించాలంటే, పథకం పరిధిలో నిర్వహించే వ్యక్తులు ఆయకట్టు పరిధిలో ఉండాలి. ఐదు మంది సభ్యులతో కూడిన ఈ కమిటీలో అన్ని కులాల వారికి ప్రాధాన్యం కల్పించాలన్న నిబంధనలు ఉన్నాయి. కొత్తగా పథకం నిర్వహణకు ఎంపిక చేసిన ముగ్గురు వ్యక్తులకు ఈ పథకం పరిధిలో ఎలాంటి ఆయకట్టు లేదు. దీనితో పథకం ఎలా నిర్వహించాలని అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఆయకట్టు పరిధిలో ఉన్న కొందరు తెలుగుదేశం పార్టీ నాయకులను ఎత్తిపోతల పథకం అధికారులు సంప్రదించినప్పటికీ, పథకాన్ని తాము నిర్వహించలేమని చేతులెత్తేశారు. అదీ కాక ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో ఎత్తిపోతల పథకానికి సంబంధించిన ట్రాన్స్ఫార్మర్ లోని కాపర్ వైర్ ను, అందులో ఉన్న ఆయిల్ ను గుర్తు తెలియని వ్యక్తులు అపరించుకొని వెళ్లారు. ఈ విషయంపై ఎస్ఐ జగన్మోహన్ పోలీస్ సిబ్బందితో కలిసి ఎత్తిపోతల పథకం వద్దకు వచ్చి ట్రాన్స్ఫార్మర్ వద్ద చోరీకి గురైన ప్రదేశాన్ని పరిశీలించారు. అప్పట్లో పంట చేతికొచ్చే సమయంలో ట్రాన్స్ఫార్మర్ లోని కాపర్ వైర్ అపహరణకు గురి కావడంతో రైతులు ఆందోళన చెందారు. పంట చేతికొచ్చే సమయంలో ట్రాన్స్ఫార్మర్ పని చేయకపోవడంతో అన్నదాతలు కలవరపాటుకు గురయ్యారు. దీంతో ఇతర ప్రాంతాల నుండి ట్రాన్స్ఫార్మర్ తెచ్చి రైతులకు పంట పొలాలను కాపాడే పరిస్థితులను కల్పించారు.

తర్వాత ట్రాన్స్ఫార్మర్ను అధికారులు తీసుకుని వెళ్లారు. రెండు రోజుల క్రితం ఎత్తిపోతల పథకానికి సంబంధించిన అధికారులు రైతులతో ఒక సమావేశాన్ని నిర్వహించారు. అయితే కమిటీగా ఏర్పడేందుకు ఆయకట్టు రైతులు ఎవరూ ముందుకు రాలేదు. దీనికి ఓ ప్రధాన కారణం కూడా ఉంది. ప్రస్తుతం ఎత్తిపోతల పథకాన్ని పునరుద్ధరించాలంటే ట్రాన్స్ఫార్మర్ మోటారు ఖర్చులకు మూడు లక్షల రూపాయల దాకా ఖర్చు చేయాల్సి ఉంది. దీని దృష్టిలో పెట్టుకొని పథకం నిర్వహణకు రైతులు ఎవరు ముందుకు రాకపోవడంతో ఎత్తిపోతల అధికారులు దిక్కుతోచని పరిస్థితులలో ఉండిపోయారు. ప్రస్తుతం ఎత్తిపోతల పథకం ఎవరు



నిర్వహించాలన్నది ప్రశ్నార్థకంగా మారింది. ప్రస్తుతం అధికారుల పరిస్థితి మాత్రం ఎంకి పెళ్లి సుబ్బి చావుకి వచ్చినట్లుగా ఉండటం కొసమెరుపు.



## పాఠశాలలపై కంచి పరమేశ్వర రెడ్డి వరాల జల్లు



**మద్రిపాడు జూన్ 22నంది పత్రిక :** మద్రిపాడు మండలం లోని ప్రాథమిక తరగతుల విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ కార్యక్రమంలో భాగంగా కంప సముద్రం,చిలకపాడు,నందవరం గ్రామాల లోని పాఠశాలలకు విచ్చేసిన శ్రీ సాంబశివాయ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రి నిత్యాన్నదాత కంచి పరమేశ్వర్ రెడ్డి ఆయా పాఠశాలలపై వరాల జల్లు కురిపించారు.కంపసముద్రం ఉన్నత పాఠశాలలో వాటర్ ప్లాంట్ మరియు కూలింగ్ మిషన్ ఏర్పాటుకు,చిలకపాడు ఉన్నత పాఠశాలలో స్టేజ్ పైన స్లాబ్ నిర్మాణానికి,వాటర్ ప్లాంట్ మరియు కూలింగ్ మిషన్ ఏర్పాటుకు,దూర ప్రాంతాల నుంచి పాఠశాలకు వెళ్లే విద్యార్థులకు రవాణా ఖర్చులు చెల్లించుటకు,నందవరం ఉన్నత పాఠశాల నందు కంప్యూటర్ డెస్క్ టాప్,వాటర్ ప్లాంట్ మరియు కూలింగ్ మిషన్ ఏర్పాటుకు హామీ ఇచ్చారు.అంతేకాకుండా తన సొంత గ్రామమయిన నందవరంలో పేదవారి అంత్యక్రియల ఖర్చులకు పదివేల రూపాయలు వంతున ఆర్థిక సహాయం అందజేస్తానని తెలియజేశారు.సేవా కార్యక్రమాల ద్వారా అందరి మనసుల్లో గొప్ప స్థానాన్ని సంపాదించుకున్న దాత కంచి పరమేశ్వర్ రెడ్డికి ఆయా గ్రామాల్లోని పాఠశాలలలో విద్యార్థులు పూలవర్షం కురిపిస్తూ ఘన స్వాగతం పలికారు.మండల అధికారులు మరియు గ్రామస్తులతో కలిసి విద్యార్థులకు నోటు పుస్తకాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులే దేశానికి భవిష్యత్తు అని,విద్యార్థుల చదువుకు చేయూత అందిస్తే దేశానికి సేవ చేసినట్లేనని,విద్యార్థులు విలువతో కూడిన విద్య నేర్చుకొని ఉన్నత స్థాయికి చేరి,సమాజానికి తమ వంతు సహాయం చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో తహసిల్దార్ అనిల్ కుమార్,మండల విద్యాశాఖ అధికారులు తిరుపతయ్య,ధనలక్ష్మి,ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సుబ్బారెడ్డి,డాక్టర్ మారుతి కేశవరెడ్డి,వేణుగోపాల్,శ్రీ సాంబశివా చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు నరసింహారెడ్డి,రాంపల్లి ప్రసాద్ రెడ్డి,మహేశ్వరరెడ్డి,ఈశ్వర్,రాజేంద్ర కుమార్,శివరామిరెడ్డి,సుధాకర్ రెడ్డి,కంప సముద్రం గ్రామానికి చెందిన కాంతారెడ్డి,రాజారెడ్డి,చిలకపాడు గ్రామానికి చెందిన జీవి రమణారెడ్డి,మధుసూదన్ రెడ్డి,నందవరం గ్రామానికి చెందిన శ్రీనివాసులు నాయుడు,నూనె హజరత్ యాదవ్,ఆయా పాఠశాల ఉపాధ్యాయులు,తల్లిదండ్రులు,గ్రామస్తులు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## జొన్నగిరిలో సీఎం చంద్రబాబు పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన కర్నూలు జిల్లా టీడీపీ అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ



**కర్నూలు సిటీ నందిపత్రిక** జూన్ 24వ తేదీన కర్నూలు జిల్లా జొన్నగిరిలో జియో గోల్డ్ మైనింగ్ ప్రాజెక్టు పర్యటనకు విచ్చేయనున్న ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు బహిరంగ సభ ఏర్పాట్లను కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటన విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి సభా ప్రాంగణం, హెలిప్యాడ్ (హెలికాప్టర్ ల్యాండింగ్ స్థలం), వాహన పార్కింగ్ ప్రాంతాలు, ప్రజలకు కల్పించాల్సిన సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లపై ఆమె సమగ్రంగా సమీక్ష నిర్వహించారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటన జొన్నగిరి ప్రాంత అభివృద్ధికి నూతన దిశానిర్దేశం చేస్తుందని, జియో గోల్డ్ మైనింగ్ ప్రాజెక్టు ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని గుడిసె ఆది కృష్ణమ్మ పేర్కొన్నారు. సీఎం పర్యటనను విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని సభను విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## విద్యుత్ కాంట్రాక్ట్ మరియు ఔట్సోర్సింగ్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలి

### సి ఐ టి యు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు



**కర్నూలు సిటీ నందిపత్రిక** విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు మరియు ఔట్సోర్సింగ్ ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని సి.ఐ.టి.యు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.డి. అంజిబాబు సి.ఐ.టి.యు జిల్లా ఉపాధ్యక్షులు జే దివాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఆంధ్రప్రదేశ్ విద్యుత్ ట్రేడ్ యూనియన్ స్ట్రగుల్ కమిటీ పిలుపులో భాగంగా డిఆర్ఓ కి వినతి పత్రం అందజేశారు రెగ్యులర్ ఉద్యోగులకు పే రివిజన్ కమిటీనివెంటనేవేయాలని,పెండింగ్ లో ఉన్న డిఏలను వెంటనే రిలీజ్ చేయాలని, అరియర్స్ ను ఒకే విడతలో చెల్లించాలని కోరారు జేఎల్ఎం గ్రేడ్ 2, ఎనర్జీ అసిస్టెంట్ ల నుండి జేఎల్ఎం గా కన్వర్షన్ అయిన ఉద్యోగులకు మూడు డిస్కములలో ఒకే పద్ధతిని పాటించి వెంటనే అసిస్టెంట్ లైన్మెన్లుగా పదోన్నతులు కల్పించాలని కోరారు వేతనాల్లో వ్యత్యాసాలను సవరించాలని సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కనీస వేతనం 48 వేల రూపాయలు ఇవ్వాలని కోరారు.హమాలీ కార్మికులకు పిసిరేట్ విధానాన్ని రద్దుచేసి కనీస వేతనాలు అమలు చేయాలని పని భద్రత కల్పించాలని మీటర్ రీడర్స్ కు పని భద్రత కల్పించాలని కోరారు. కాంట్రాక్ట్ కార్మికులకు రిటైర్మెంట్ బెనిఫిట్ గ్రాట్యూటీ 10 లక్షలు చెల్లించాలని కోరారు ఆంధ్రప్రదేశ్ విద్యుత్ ట్రేడ్ యూనియన్ స్ట్రగుల్ కమిటీ వజ్రం లో విడతల వారి ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నట్లు వారు తెలియజేశారు విద్యుత్తు రంగంలో పనిచేస్తున్న ఉద్యోగులు కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు.

## అర్జీలను నిర్దేశిత గడువులోపు పరిష్కరించాలి

### పిజిఆర్యస్‌కు 17 ఫిర్యాదుల వెల్లువ

### నగరపాలక అదనపు కమిషనర్ ఆర్ జీ వి కృష్ణ

**కర్నూల్ సిటీ నంది పత్రిక** ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చే అర్జీలను నిర్దేశిత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ ఆర్జివి కృష్ణ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక ఎస్బిఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో పిజిఆర్యస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ కాలనీలకు సంబంధించి 17 ఫిర్యాదులు రాగా, వాటి పరిష్కారానికి చట్ట పరిధిలో చర్యలు తీసుకుంటామని అదనపు కమిషనర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, మేనేజర్ జునైద్, కార్యదర్శి నాగరాజు, ఎంఈ మనోహర్ రెడ్డి, ఆర్వో స్వర్ణలత, పట్టణ ప్రణాళిక అధికారి అంజాద్ బాష, టిడ్కో అధికారి పెంచలయ్య, పాల్గొన్నారు.



# శ్రీశైలం దేవస్థానంలో హుండీల లెక్కింపు







**శ్రీశైలం జూన్ 22(నంది పత్రిక)** జరిగిన హుండీల లెక్కింపు ద్వారా దేవస్థానానికి రూ. 5,45,55,035 /-లు నగదు రాబడిగా లభించింది. కాగా ఈ హుండీల రాబడిని భక్తులు గత 27 రోజులలో (26.05.2026 నుండి 21.06.2026 వరకు) సమర్పించడం జరిగింది. అలాగే ఈ హుండీలో 127 గ్రాముల 500 మిల్లీగ్రాముల బంగారు, 3 కేజీల 680 గ్రాముల వెండి లభించాయి.అదేవిధంగా 392 – యుఎస్ఏ డాలర్లు, 10,105 యు.ఏ.ఇ దిర్హమ్స్, 17 – సౌది రియాల్స్, 38– సింగపూర్ డాలర్లు, 5 ఇంగ్లాండు పౌండ్స్ , 18 మలేషియా రింగిట్స్ , 160 ఆస్ట్రేలియా డాలర్లు, 40 యూరోస్, 10 కెనడా డాలర్లు, 11 కత్తారు రియాల్స్, 3 ఓమన్ రియాల్స్, 100 – ఓమన్ బైసాలుమొదలైనవి ఈ హుండీల లెక్కింపులో లభించాయి.

పటిష్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య సీసీ కెమెరాల నిఘాతో ఈ లెక్కింపును చేపట్టడం జరిగింది. ఈ హుండీల లెక్కింపును కార్యనిర్వహణాధికారి శ్రీ యం. శ్రీనివాసరావు పర్యవేక్షించారు. హుండీల లెక్కింపును ధర్మకర్తల మండలి సభ్యులు శ్రీమతి జి. లక్ష్మేశ్వరి, శ్రీమతి జి. గంగమ్మ, శ్రీమతి కె. కాంతివర్ధిని, శ్రీ చిలువేరు కాశీనాథ్, శ్రీమతి ఉప్పుటూరి. సుబ్బలక్ష్మి, శ్రీమతి పి.యు. శివమ్మ, శ్రీమతి జి.శ్రీదేవి, ప్రత్యేక ఆహ్వానితులు శ్రీ బుగ్గన చంద్రమౌళీశ్వరరెడ్డి, వాయుగండ్ల వెంకటేశ్వర్లు హుండీల లెక్కింపును పరిశీలించారు.

అదేవిధంగా హుండీల లెక్కింపులో పలువిభాగాల యూనిట్ అధికారులు, పర్యవేక్షకులు, దేవస్థానం సిబ్బంది శివసేవకులు పాల్గొన్నారు.



## విజయవంతంగా ముగిసిన ఉమ్మడి కర్నూలు జిల్లా స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు



**నంద్యాల ప్రతినిధి. జూన్ 22 . (నంది పత్రిక ):**నంద్యాలలోని నంది పైప్స్ బ్యాడ్మింటన్ అకాడమీలో గత రెండు రోజులుగా నిర్వహించిన ఉమ్మడి కర్నూలు జిల్లా స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు విజయవంతంగా ముగిశాయి.అండర్–11, అండర్–13, అండర్–15 మరియు అండర్–17 బాల, బాలికల విభాగాల్లో నిర్వహించిన ఈ పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో క్రీడాకారులు పాల్గొన్నారు.బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నంది గ్రూప్ అధినేత శ్రీకాంత్ రెడ్డి, సుజల, 3 టౌన్ సీఐ వేణుగోపాల్, ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు వంశీధర్, డా. జనార్ధన్ రెడ్డి హాజరై విజేతలకు బహుమతులు అందజేసి అభినందించారు.ఈ సందర్భంగా వంశీధర్ మాట్లాడుతూ, ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా సుమారు 300 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారని తెలిపారు. ఈ పోటీల్లో విజయం సాధించిన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీలలో ఉమ్మడి కర్నూలు జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులు శేషిరెడ్డి, సంజీవరెడ్డి, కోచ్ నాగార్జున రెడ్డి, క్రీడాభిమానులు, తల్లిదండ్రులు మరియు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. పోటీలను విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులను అతిథులు ప్రత్యేకంగా అభినందించారు.



# డీఎస్సీ 2025 మెరిట్ లిస్టును, క్యాటగిరి వైజ్ కటాఫ్ మార్కులను బయట పెట్టాలి






## బీఎస్పీ కర్నూలు జిల్లా ఇంచార్జి గాడి అరుణ్ కుమార్

**కర్నూల్ సిటీ నంది పత్రిక** బహుజన్ సమాజ్ పార్టీ కర్నూలు అసెంబ్లీ అధ్యక్షులు మధుకర్ ఆద్వర్యంలో "డీఎస్సీ 2025 మెరిట్ లిస్టును, క్యాటగిరి వైజ్ కటాఫ్ మార్కులను" బయట పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని బీఎస్పీ డిమాండ్ చేస్తూ కర్నూలు కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా అనంతరం వినతి పత్రాన్ని డీఆర్ఓ కి అందచేశారు. బీఎస్పీ కర్నూలు జిల్లా ఇంచార్జి గాడి అరుణ్ కుమార్ మాట్లాడుతూ "డీఎస్సీ 2025 మెరిట్ లిస్టును, క్యాటగిరి వైజ్ కటాఫ్ మార్కులను" బయట పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని బీఎస్పీ డిమాండ్ చేస్తున్నది. డీఎస్సీ అంటే డిస్ట్రిక్ట్ సెలక్షన్ కమిటీ. ఘనత వహించిన గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గతంలో 13 డీఎస్సీలను ఎలాంటి లోటుపాటులు లేకుండా నిక్కచ్చిగా నిర్వహించామని చెప్పారు. నిజమే దీన్ని మేము ఎవ్వరము కాదనలేదు. కాని ఆ 13 డీఎస్సీల మెరిట్ లిస్టులను అప్పుడు బయట పెట్టారు కదా! మరి ఇప్పుడు ఎందుకు డీఎస్సీ 2025 మెరిట్ లిస్టును బయట పెట్టలేదు. ఇందుకు ప్రధాన కారణం ఎకనామికల్ వీకర్ సెక్సన్ (ఇ.డబ్ల్యు.ఎస్). ఇ.డబ్ల్యు.ఎస్. అంటే ఆర్ధికంగా వెనకబడిన ఓసీ కులాలకు రిజర్వేషన్ కల్పించేది. మరి ఓసీల జనాభా ఎంత శాతం ఉందని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏనాడైనా బయట పెట్టినాయా? పోనీ ఓసీలు ఆర్ధికంగా ఎంత శాతం జనాభా వెనుకబడి ఉన్నారు అనే విషయంపై లెక్కలు ఉన్నాయా? అంటే అవి ఏవి లేవు. కాని 10శాతం రిజర్వేషన్ అమలు చేస్తున్నారు. ఇప్పుడు ఈ 10శాతం ఇ.డబ్ల్యు.ఎస్. పేరుతో డీఎస్సీ 2025లో అమలు చేయుట వలన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ అభ్యర్థుల మార్కులు కంటే ఓసీ అభ్యర్థులకు తక్కువ మార్కులకే టీచర్ ఉద్యోగాలు వచ్చినాయి. అందువలన డీఎస్సీ 2025 మెరిట్ లిస్టును, క్యాటగిరి వైజ్ కటాఫ్ మార్కులను బయట పెట్టలేదు. ఈ మెరిట్ లిస్టును బయట పెట్టితే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ అభ్యర్థుల మార్కులు ఎక్కువగా ఉన్నా, తక్కువ మార్కులు వచ్చిన ఓసీ అభ్యర్థులకు ఏ విధంగా టీచర్ ఉద్యోగాలు వస్తాయినే ప్రశ్న ఉత్పన్నమౌతుంది. అప్పుడు చంద్రబాబు ప్రభుత్వం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు మోసం, దగా చేసిందనే ఆలోచన కలుగుతుందనే దుర్మార్గమైన ఆలోచనతోనే డీఎస్సీ 2025 మెరిట్ లిస్టును, క్యాటగిరి వైజ్ కటాఫ్ మార్కులను బయట పెట్టలేదు. టిడిపి అంటే బీసీల పార్టీ – బీసీల పార్టీ అంటే టిడిపి అని చెప్పుకొనే చంద్రబాబు , తమిళనాడు రాష్ట్రంలో ఇ.డబ్ల్యు.ఎస్.ను అమలు చేయక పోయినా ఈ రాష్ట్రంలో ఎందుకు అమలు చేస్తున్నారు అంటే న్యాయంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు రావాల్సిన ఉద్యోగాలను కమ్మ, రెడ్డి కులాల తోపాటు ఇతర ఓసీ కులాలకు అక్రమ మార్గంలో దోచి పెట్టేందుకే. నిజానికి ఇ.డబ్ల్యు.ఎస్.ను రాష్ట్రంలో మొదట అమలు చేసింది మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి . ఇక్కడ , చంద్రబాబు ఇద్దరు కూడా తమ ఓసీ కులాల అభ్యర్థులకు దొంగ చాటుగా ఉద్యోగాలను కల్పించేందుకే ఇ.డబ్ల్యు.ఎస్.ను అమలు చేస్తున్నారు.దాదాపు 9నెలలు తర్వాత డీఎస్సీ 2025లో అక్రమాలు, అవకతవకలపై సీబీఐతో విచారణ జరపాలని "అత్త సచ్చిన ఆరు నెలలకు అల్లుడు నిట్రాయి పట్టుకొని నిగిడి నిగిడి ఏడ్చిన" చందంగా వైసిపి అధినేత జగన్ ఇప్పుడు డిమాండ్ చేస్తున్నారు. డీఎస్సీ 2025 నియమాక ప్రక్రియ 2025 అక్టోబరులోనే ముగిసిందని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. మరి అప్పుడు వెంటనే ఎందుకు మెరిట్ లిస్టును బయట పెట్టాలని, జరిగిన అక్రమాలు, అవకతవకలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించలేదు. అప్పుడు ఎందుకు జగన్ ప్రశ్నించలేదు అంటే ఇ.డబ్ల్యు.ఎస్.ను చంద్రబాబు ప్రభుత్వం అమలు చేసినందున తక్కువ మార్కులు ఉన్న ఓసీలకు టీచర్ ఉద్యోగాలు వచ్చి, ఎక్కువ మార్కులు ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు ఉద్యోగాలు రాలేదు. కనుక అప్పుడు ప్రశ్నిస్తే ఓసీల నుంచి తనకు తీవ్ర వ్యతిరేకత వస్తుందని భావించి వారు(ఓసీలు) అందరూ టీచర్ ఉద్యోగాలోకి చేరిపోయి కొన్ని నెలలు జీతాలు తీసుకొన్న అనంతరం వారి ఉద్యోగాలకు ఎలాంటి ఇబ్బంది ఉండదనే అభిప్రాయానికి వచ్చిన అనంతరం దాదాపు 9నెలలు తరువాత తన రాజకీయ లబ్దికోసం ఇప్పుడు డీఎస్సీలో అక్రమాలు, అవకతవకలపై భారీ అవినీతి జరిగిందని ప్రశ్నిస్తున్నాడు తప్ప నిరుద్యోగుల మీద సూది మొనంత కూడా జగన్ కి ప్రేమ లేదు. ఇందుకు విద్యాశాఖ ఏమి చెబుతున్నది అంటే హారిజాంటల్ రిజర్వేషన్ అమలు తీరును అర్థం చేసుకోవాలని లేదంటే క్రిమినల్ కేసులు పెడతామని బెదిరిస్తున్నది. కాని ఈ సందర్భంలో బీఎస్పీ కూడా ఏమి అంటున్నదంటే వైసిపి డిమాండ్ ను స్వాగతిస్తూ "నీరు కట్టేవాడు తన మడికి నీరు పెట్టుకోకుండా యండ పెట్టుకొంటాడా!" అనే తరహాలో అధికారంలో ఉన్న చంద్రబాబు తన అనునాయులకు, డబ్బును దోచుకోవడానికి కొన్ని టీచర్ ఉద్యోగాలను జగన్ చెప్పిన విధంగా అమ్ముకొని ఉండవచ్చు. కనుక సీబీఐతో విచారణ జరిపి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల కంటే తక్కువ మార్కులు వచ్చిన ఓసీ అభ్యర్థులకు ఇచ్చిన ఉద్యోగాలను రద్దు పరిచి, వీటిని ఎక్కువ మార్కులు వచ్చిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు ఇవ్వాలని బీఎస్పీ డిమాండ్ చేస్తున్నది. ముఖ్యంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు అర్థం చేసుకోకుండా ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న అధికార, ప్రతిపక్ష పార్టీలకు ఓట్లు వేస్తున్నంత కాలం ఇ.డబ్ల్యు.ఎస్.ను అమలు చేస్తూనే ఉంటారు. కేవలం ఒక టీచర్ ఉద్యోగాలకే కాదు రాష్ట్రంలో ఉన్న అన్ని రకాల ఉద్యోగాల భర్తీలో కూడా ఇ.డబ్ల్యు.ఎస్.ను అమలు చేస్తూనే ఉంటారు. కనుక బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ మహాశయుల్లారా! ఇప్పటికైనా వైసిపి, టిడిపి పార్టీలకు ఓట్లు వేసే కార్యక్రమాన్ని బందు చేసి బీఎస్పీకి ఓట్లు వేసుకొంటే తమిళనాడు రాష్ట్రంలో ఇ.డబ్ల్యు.ఎస్.ను అమలు చేయని విధంగా ఈ రాష్ట్రంలో కూడా అమలు చేయని పరిస్థితిని బీఎస్పీ తీసుకువస్తుందని మనవి చేస్తున్నాం.ఈ కార్యక్రమంలో కర్నూలు జిల్లా ఇన్చార్జిలు వనమన్న, గాడి అరుణ్ కుమార్, జిల్లా అధ్యక్షులు సామేలు ఉపాధ్యక్షులు బోయ రవికుమార్ కార్యదర్శి సుంకన్న కర్నూల్ అసెంబ్లీ అధ్యక్షులు మధుకర్ ఎమ్మిగనూరు అధ్యక్షులు బంగారప్ప బిఎస్ఎఫ్ కన్వీనర్ హనుమన్న, కోశాధికారులు సలీం భాష, సాల్మన్, కర్ణ, మధు, రఫిక్ విజయ్ పరమేష్ మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ఎస్ ఐ ఆర్ సహాయ సేవా కేంద్రం



**కర్నూల్ సిటీ నంది పత్రిక** కర్నూలు జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ఎస్ ఐ ఆర్ ఓటరు సందేహాలు నివృత్తి చేయడానికి సేవా కేంద్రము ఏర్పాటు చేయడమైనదని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు న్యాయవాది క్రాంతి నాయుడు బోయ తెలియజేశారు. సోమవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సేవా కేంద్రం పోస్టర్ను ఆవిష్కరించి, సేవా కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం క్రాంతి నాయుడు మాట్లాడుతూ ఎస్ఐఆర్ మీద చాలామందికి అపోహలు ఉన్నాయని వాటిని నివృత్తి చేయడానికి వారికి ఎలాంటి ఫారాలు జత చేయాలి అని వీటన్నింటిపై వారి సమస్యలు పరిష్కరించేందుకు జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో సేవా కేంద్రం ఏర్పాటు చేయడమైనదని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సేవాకేంద్రం ప్రతిరోజు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు పనిచేస్తుందని ప్రతిరోజు ఇద్దరు కమిటీ సభ్యులు ఒకరు అనుబంధం విభాగపు జిల్లా చైర్మన్, మరోకరు డిసిసి కమిటీ ఉపాధ్యక్షులు లేదా ప్రధాన కార్యదర్శి ఉంటారని వారితో పాటు టెక్నికల్ సిబ్బంది కూడా సేవా కేంద్రంలో అందుబాటులో ఉంటారని ఎవరైనా ఓటుకు సంబంధించిన సందేహాలను, సమస్యలను పరిష్కరించుకోవచ్చని, అలాగే జిల్లా కాంగ్రెస్ కమిటీ తరపున రెండు ఫోన్ నెంబర్లను ఇస్తున్నామని మీరు ఫోన్ ద్వారా మా ప్రతినిధులతో సంప్రదించి మీ సమస్యను పరిష్కరించుకోవచ్చని కర్నూలు జిల్లా కాంగ్రెస్ కమిటీ తరఫున కోరుచున్నామని క్రాంతి నాయుడు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఎం సుధాకర్ బాబు, కోడుమూరు కోఆర్డినేటర్ అనంతరత్నం మాదిగ, ఐఎన్టియుసి జిల్లా అధ్యక్షులు బి బతుకన్న, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు ఎన్ని బజారన్న, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు మీసాల సుమలత, రాష్ట్ర ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి మల్లికార్జున యాదవ్, డిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి రియాజుద్దీన్, కాంగ్రెస్ నాయకులు షేక్ మాలిక్ భాష, యు శేషయ్య, ఐఎన్టీయూసీ సిటీ అధ్యక్షులు ఆర్ ప్రతాప్, మహిళా కాంగ్రెస్ అక్తర్ బి, తహేరబి, ముంతాజ్, షబానా, జాఫర్ బి, లతీఫ్ బి, మొదలగు మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## పారిశుద్ధ్య పనులను ముమ్మరం చేయాలి

### నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు




**కర్నూల్ సిటీ నంది పత్రిక** కర్నూలు నగరంలోని ప్రధాన రహదారుల్లో పారిశుద్ధ్య పనులను మరింత ముమ్మరం చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు ఆదేశించారు. సోమవారం ఆయన 5వ శానిటేషన్ డివిజన్‌లో మస్టర్‌ను తనిఖీ చేసి, సిబ్బంది హాజరు మరియు పనితీరును పరిశీలించారు.అనంతరం ప్రభుత్వ అతిథి గృహం పరిసరాలు, రాజ్ విహార్, బుధవారపేట, మద్దూర్ నగర్, చెక్‌పోస్ట్ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లకు పలు సూచనలు చేశారు. డివైడర్లు, ప్రధాన రహదారుల ఇరువైపులా ప్రత్యేకంగా శు భ్రత చర్యలు చేపట్టి నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు.అనంతరం కొండారెడ్డి బురుజు వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌ను సందర్శించి అక్కడి ఏర్పాట్లను పరిశీలించారు. ప్రజలకు మరింత సౌకర్యవంతంగా ఉండేలా బయట వరండాలో కూడా భోజనాలు చేసే విధంగా అదనపు టేబుళ్లను ఏర్పాటు చేయించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ సూపర్వైజర్ రమేష్ బాబు, ఇన్‌స్పెక్టర్లు అనిల్ కుమార్, జిలానీ, హుస్సేన్, లోకేష్, ఫరూక్ తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థుల స్వరం కర్నూలు జిల్లా వేదికగా

## విద్యా వ్యవస్థను బలోపేతం చేయడానికి చర్చా వేదిక విద్యార్థుల సమస్యలు విద్యా రంగ సవాళ్లపై కర్నూలు జిల్లా స్థాయి సమావేశం

## విద్యార్థుల హక్కుల పరిరక్షణకు కాంగ్రెస్ గెలుపు




**కర్నూల్ సిటీ నంది పత్రిక** అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సూచన మేరకు ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైయస్ షర్మిలా రెడ్డి ఆదేశాల మేరకు దేశవ్యాప్తంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు, విద్యా రంగంలో నెలకొన్న సవాళ్లు, విద్య హక్కుల పరిరక్షణ మరియు యువత భవిష్యత్తుపై చర్చించేందుకు 2026 జూన్ 25వ తేదీ ఉదయం 10:00 గంటలకు కర్నూలు జెడ్పీ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి సంప్రదింపుల సమావేశం నిర్వహించబడుతుందనీ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు న్యాయవాది క్రాంతి నాయుడు బోయ పత్రిక ప్రకటన విడుదల చేశారు. సోమవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుండి ప్రకటన విడుదల చేస్తూ క్రాంతి నాయుడు మాట్లాడుతూ విద్యార్థులు, యువజన ప్రతినిధులు, విద్యావేత్తలు, సామాజిక కార్యకర్తలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొని విద్యా రంగానికి సంబంధించిన సమస్యలపై తమ అభిప్రాయాలు, సూచనలు తెలియజేయనున్నారు. విద్యను అందరికీ అందుబాటులో ఉంచడం, ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయడం, విద్యార్థుల హక్కులను పరిరక్షించడం మరియు విద్యా రంగంలో అవసరమైన సంస్కరణలపై సమగ్ర చర్చ జరగనుంది. "విద్యను కాపాడుదాం విద్యార్థుల భవిష్యత్తును నిర్మిద్దాం" అనే లక్ష్యంతో నిర్వహిస్తున్న ఈ సమావేశానికి జిల్లాలోని విద్యార్థులు, యువత, విద్యావేత్తలు మరియు ప్రజాసంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ విజ్ఞప్తి చేస్తోందనీ వివరాలకు జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం సెల్ నెంబర్ 85208 88388 సంప్రదించవలెనని క్రాంతి నాయుడు తెలియజేశారు.

## భారతీయుడికి అరుదైన గౌరవం.. వాట్సాప్ సీఈవోగా కునాల్ షా

టెక్ ప్రపంచంలో ఒక ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. ప్రపంచవ్యాప్తంగా అత్యధిక ఆదరణ పొందిన మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ వాట్సాప్ నూతన గ్లోబల్ హెడ్‌గా, సీఈఓగా భారతీయ ఫిన్‌టెక్ స్టార్టప్ క్రెడ్ (క్రెడ్) వ్యవస్థాపకుడు కునాల్ షాను నియమిస్తున్నట్లు 'మెటా' ప్రకటించింది. అదే సమయంలో క్రెడ్ సంస్థలో సుమారు 900 మిలియన్ డాలర్ల (దాదాపు రూ. 8,550 కోట్లు) మేర భారీ పెట్టుబడి పెట్టుబడులు పెడుతున్నట్లు వెల్లడించింది.

# స్కూల్ బస్సులు కండిషన్‌లో లేకపోతే భారీ జరిమానా!

**- అనుమతులు లేని ప్రైవేట్ స్కూల్ బస్సుకు 16 వేల ఫైన్**

**- విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటే సహించేది లేదు: ఎంవీఐ సత్యనారాయణ రెడ్డి**

**- వెలుగోడులో ముమ్మరంగా వాహనాల తనిఖీలు**

**వెలుగోడు, జూన్ 22 (నందిపత్రిక):** ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు తమ స్కూల్ బస్సులను ఖచ్చితంగా ఫిట్‌నెస్ (కండిషన్) లో ఉంచుకోవాలని, రవాణా శాఖ నిబంధనల ప్రకారం అన్ని అనుమతులు కలిగి ఉండాలని ఆత్మకూరు మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ రెడ్డి హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే భారీ జరిమానాలతో పాటు కఠిన చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు.

**పోలీస్ స్టేషన్ వద్ద ముమ్మర తనిఖీలు** సోమవారం సాయంత్రం వెలుగోడు పట్టణంలోని స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలో రవాణా శాఖ, పోలీస్ శాఖ సంయుక్తంగా తనిఖీలు చేపట్టాయి. ఈ తనిఖీల్లో భాగంగా పట్టణంలోని వివిధ ప్రైవేట్ పాఠశాలలకు చెందిన స్కూల్ బస్సులను, ఇతర రవాణా వాహనాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు.

**అనుమతులు లేని స్కూల్ బస్సుకు రూ.16,000 జరిమానా!** తనిఖీల్లో భాగంగా ఒక ప్రైవేట్ పాఠశాలకు చెందిన స్కూల్ బస్సును ఆపి రికార్డులను పరిశీలించగా, దానికి ఎలాంటి ప్రభుత్వ అనుమతులు (పర్మిట్లు, ఫిట్‌నెస్) లేవని తేలింది. విద్యార్థుల భద్రతను గాలికొదిలేసి నడుపుతున్న సదరు స్కూల్ బస్సుకు ఎంవీఐ సత్యనారాయణ రెడ్డి రూ. 16,000 జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్కూల్ యాజమాన్యాలు కేవలం లాభాల కోసమే కాకుండా, విద్యార్థుల ప్రాణాలకు బాధ్యత వహించాలని, ఫిట్‌నెస్ లేని వాహనాలతో విద్యార్థుల జీవితాలతో ఆడుకోవద్దని తీవ్రంగా హెచ్చరించారు.



**లైసెన్స్ లేని వాహనదారులకూ వాత!**

స్కూల్ బస్సులతో పాటు రోడ్డుపై వెళ్తున్న ఇతర వాహనాలను కూడా అధికారులు తనిఖీ చేశారు. డ్రైవింగ్ లైసెన్స్, సరైన పత్రాలు లేని పలువురు వాహనదారులకు స్పాట్‌లోనే జరిమానాలు విధించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో వెలుగోడు సబ్ ఇన్స్పెక్టర్ సురేష్, పోలీస్ సిబ్బంది మరియు రవాణా శాఖ అధికారులు పాల్గొన్నారు.

# విచారణ జరిపి చట్టపరంగా న్యాయం చేస్తాం

**ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమానికి 121 ఫిర్యాదులు.**

**కర్నూల్ డిఎస్పి రాఘవేంద్ర**

కర్నూల్ కొత్తపేటలోని కర్నూల్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ ప్రక్కన ఉన్న ఎస్పీ క్యాంపు కార్యాలయంలో కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ ఆదేశాల మేరకు కర్నూలు డిఎస్పీ రాఘవేంద్ర సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం కు వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాది దారులతో మాట్లాడి వారి యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఈ రోజు మొత్తం 121 ఫిర్యాదులు వచ్చాయి.

**వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని ...**

1) కర్నూలు గవర్నమెంట్ హాస్పిటల్ లో నెలకు రూ. 38 వేల జీతంతో స్టాప్ నర్స్ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి కర్నూలు ఫోరెన్సిక్ డిపార్ట్ మెంట్ లో పని చేసే ఎర్రవల్లి వేణు రూ. 5 లక్షల 50 వేలు తీసుకొని మోసం చేశాడని కర్నూలు, శ్రీరామ్ నగర్ కు చెందిన సుప్రియ చేశారు.

2) పొలం ఆక్రమించుకోవాలని కొట్టి గాయపరిచిన వారి పై చర్యలు తీసుకోవాలని దేవనకొండ మండలం, తెర్నెకల్లు గ్రామానికి గిడ్డమ్మ ఫిర్యాదు చేశారు.



3) 10 మందికి రైల్వేశాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి మోసం చేసిన శ్రీధర్ పై చర్యలు తీసుకోవాలని కర్నూలు, కల్లూరు కు చెందిన గొవిందు ఫిర్యాదు చేశారు.

4) ఇల్లు కట్టించి ఇస్తామని చెప్పి కల్లూరు మండలం ముజఫర్ నగర్ కు చెందిన మహబూబ్ రూ. 8 లక్షలు తీసుకొని ఇంటి నిర్మాణం పూర్తి చేయకుండానే మోసం చేశాడని కర్నూలు, స్వామిరెడ్డి నగర్ కు చెందిన రామేశ్వరమ్మ ఫిర్యాదు చేశారు.

5) కర్నూలు గవర్నమెంట్ హాస్పిటల్ లో సూపర్ వైజర్ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి రూ. ఒక లక్ష 60 వేలు తీసుకోని మోసం చేసిన మహిళ పై చర్యలు తీసుకోవాలని గూడురు మండలం, నాగాలాపురం కు చెందిన మద్దిలేటి ఫిర్యాదు చేశారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటి పై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఈ సంధర్భంగా కర్నూలు డిఎస్పీ శ్రీ రాఘవేంద్ర హామీ ఇచ్చారు. ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో కర్నూలు డిఎస్పీ తో పాటు సీఐలు శివశంకర్, పార్థసారథి, రామకృష్ణ , ప్రవీణ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

# పేకాట స్థావరంపై పోలీసుల దాడి..

**ఆరుగురు అరెస్ట్**



**రుద్రవరం ప్రతినిధి జూన్ 22 (నంది పత్రిక):** ఆళ్లగడ్డ సబ్ డివిజన్, రుద్రవరం పోలీస్ స్టేషన్ పరిధిలోని చందలూరు గ్రామ పొలిమేరల్లో, నక్కలదిన్నె వెళ్లే రహదారి పక్కన ఉన్న సెల్ టవర్ సమీపంలోని కంప చెట్ల పొదల్లో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో మే 31 న ఎస్ఐ జయప్ప మరియు ఆయన సిబ్బంది ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. ఈ తనిఖీల్లో నిందితుల వద్ద నుండి రెండు ద్విచక్ర వాహనాలతో పాటు రూ. 20,500 నగదును పోలీసులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఈ ఘటనకు సంబంధించి పరారీలో ఉన్న ఆరుగురు నిందితులను సోమవారం పోలీసులు అదుపులోకి తీసుకుని, వారిని ఆళ్లగడ్డ స్పెషల్ జుడీషియల్ మెజిస్ట్రేట్ రవికుమార్ ఎదుట హాజరుపరిచారు. ఈ కేసును విచారించిన మెజిస్ట్రేట్, నిందితులు ఆరుగురికి చెరో రూ. 200 జరిమానా విధిస్తూ, అందులో ఒకరికి మూడు రోజుల పాటు జైలు శిక్ష ఖరారు చేస్తూ తీర్పు వెలువరించారు.

# వెలుగోడులో 'రైతన్న మీకోసం' ఇంటింటి ప్రచారం!

**- గండిపేటలో రైతులకు ప్రభుత్వ పథకాలపై అవగాహన.**

**వెలుగోడు, జూన్ 22 నందిపత్రిక:** రైతుల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు శ్రీశైలం నియోజకవర్గ శాసనసభ్యులు బుడ్డా రాజశేఖరరెడ్డి ఆదేశాల మేరకు వెలుగోడులో 'రైతన్న మీకోసం' కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈరోజు వెలుగోడు పట్టణంలోని గండిపేట పరిధిలో తెలుగుదేశం పార్టీ నాయకులు, వ్యవసాయ శాఖ అధికారులు సంయుక్తంగా ఇంటింటి ప్రచారం చేపట్టారు.

**రైతు గడప వద్దకు పథకాలు..** ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ మండలాధికారి స్వాతి మరియు సిబ్బందితో కలిసి తెదేపా నాయకులు ప్రతి రైతు ఇంటికి వెళ్లారు. వ్యవసాయ రంగంలో ప్రభుత్వం తీసుకొస్తున్న మార్పులను, రైతులకు అందుతున్న రాయితీలు, సబ్సిడీలను వివరించారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని నాయకులు హామీ ఇచ్చారు.



**రైతు సంక్షేమమే మా లక్ష్యం!**

"రైతు రాజు కావాలన్నదే ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి గారి ఆకాంక్ష. అందుకోసమే అగ్రికల్చర్ సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ, ప్రతి రైతుకూ ప్రభుత్వ సాయం అందేలా ఈ 'రైతన్న మీకోసం' ఇంటింటి ప్రచారాన్ని నిర్వహిస్తున్నాం" అని తెదేపా నాయకులు ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా మండల అధ్యక్షుడు అబ్దుల్ కలాం,పట్టణ అధ్యక్షుడు మోమిన్ రసూల్,క్లస్టర్ ఇంచార్జ్ ఖలీల్ ఖాన్ మండ్ల శంకర్ రెడ్డి, ఆసర్ వజీర్, శాలు భాష, అజ్మతుల్లా,వ్యవసాయ శాఖ మండలాధికారి స్వాతి,వ్యవసాయ శాఖ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అట్టహాసంగా మాలల ఆత్మీయ సమ్మేళనం దళిత హక్కుల కోసం పోరాటం మరింత ఉధృతం: నల్లి రాజేష్

**కడప జిల్లా అధ్యక్షుడు జక్కుల కిరణ్ ఆధ్వర్యంలో భారీ సభ**

**దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా, ఉపవర్గీకరణపై గళమెత్తిన మాల మహానాడు**



**పోరుమామిళ్ల,జూన్ 22 (నంది పత్రిక )**బద్వేల్ నియోజకవర్గ పరిధిలోని ఏడు మండలాల మాలలతో పోరుమామిళ్ల పట్టణంలోని చిత్త విజయ ప్రతాప్ రెడ్డి గార్డెన్‌లో మాల మహానాడు కడప జిల్లా అధ్యక్షుడు జక్కుల కిరణ్ ఆధ్వర్యంలో "మాలల ఆత్మీయ సమ్మేళనం" అట్టహాసంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నల్లి రాజేష్ హాజరయ్యారు.ముందుగా స్థానిక అంబేద్కర్ సర్కిల్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన అనంతరం సభా ప్రాంగణానికి చేరుకున్నారు. అనంతరం మాల మహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి మోటపోతుల విజయరాజు అధ్యక్షతన సభ నిర్వహించబడింది.ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు నల్లి రాజేష్ మాట్లాడుతూ దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించడం, ఎస్సీ ఉపవర్గీకరణ అమలు, రాష్ట్రవ్యాప్తంగా మాలలపై జరుగుతున్న దాడులపై తీవ్రంగా స్పందిస్తూ జాతికి బలమైన సందేశాన్ని అందించారు. దళితుల హక్కుల సాధన కోసం పోరాటం మరింత బలపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మీడియా ప్రతినిధి ముత్యాల జార్జ్, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి గుండె నగేష్ బాబు, రాష్ట్ర ఉపాధ్యక్షులు గూడెంచెరువు సంపత్ కుమార్, సుంకర రాజేష్, సరేళ రఘు, పోరుమామిళ్ల జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



# కోడుమూరులో ఘనంగా పీర్ల పండుగ పీర్లను దర్శించుకున్న కూడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి , కోడుమూరు వైఎస్ఆర్సిపి ఇంచార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్



**కర్నూలు సిటీ నందిపత్రిక** కోడుమూరు పట్టణ కేంద్రంలోని పీర్ల సావడిలో పీర్ల పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన హాజరత్ ఖాజా గరీబ్ నవాజ్ పీర్లను కుడా మాజీ చైర్మన్, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు కోట్ల హర్షవర్ధన్ రెడ్డి కోడుమూరు నియోజకవర్గ వైయస్సార్సీపీ ఇంచార్జి డాక్టర్ ఆదిమూలపు సతీష్ దర్శించుకున్నారు.ఈ సందర్భంగా పీర్ల భక్త బృందం బ్యాండ్ మేళం, ఊరేగింపుతో నాయకులను ఘనంగా స్వాగతించి పీర్ల సావడికి తీసుకువెళ్లారు. అనంతరం నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రజలందరికీ శాంతి, సౌభాగ్యం, ఆయురారోగ్యాలు కలగాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, సతీష్ మాట్లాడుతూ, పీర్ల పండుగ సామరస్యానికి, మత సౌహార్దానికి ప్రతీక అని అన్నారు. అన్ని వర్గాల ప్రజలు ఐకమత్యంతో పండుగలను జరుపుకోవడం ఆనందదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి రఘునాథ్ రెడ్డి, జిల్లా రైతు విభాగం ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, మండల కన్వీనర్ రమేష్ నాయుడు, కోడుమూరు నియోజకవర్గం సాంస్కృతిక విభాగం అధ్యక్షులు ప్రవీణ్ కుమార్, మక్బూల్, శాషా, షేక్షా, కోడుమూరు మండల యూత్ వింగ్ అధ్యక్షుడు సాయి ముఖేష్, హారుణ్, లింగమయ్య, విష్ణు దాసు, వైయస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, ముస్లిం సోదరులు, పీర్ల భక్తులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# హమాలీలకు సొంత ఖర్చుతో దుస్తుల పంపిణీ

**హమాలీలతో 30 ఏళ్లుగా ఆత్మీయ అనుబంధం**

**తల్లిదండ్రుల జ్ఞాపకార్థం హమాలీలకు దుస్తులు పంపిణీ చేసిన బీసి రాజారెడ్డి**



**బనగానపల్లె జూన్ 22నందిపత్రిక** బనగానపల్లె పట్టణంలోని హమాలీలతో తనకి 30 ఏళ్లుగా ఎంతో ఆత్మీయ అనుబంధం ఉందని బనగానపల్లె మాజీ సర్పంచ్ బిసి రాజారెడ్డి అన్నారు. తల్లిదండ్రులు కీ.శే.బిసి గుర్రెడ్డి, బిసి లక్ష్మమ్మ దంపతుల జ్ఞాపకార్థం కిరాణా మర్చంట్ అసోసియేషన్ హమాలీలకు సోమవారం బిసి రాజారెడ్డి సొంత నిధులతో ఉచితంగా దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా బిసి రాజారెడ్డి మాట్లాడుతూ... హమాలీ సోదరులు తమ రెక్కల కష్టంతో కుటుంబాలను పోషిస్తూ నిజాయితీగా జీవిస్తుంటారన్నారు. అలాంటి వారి కష్టాన్ని ప్రతిఒక్కరూ గుర్తించాలన్నారు. తనకు వ్యక్తిగతంగా హమాలీలతో ఉన్న అనుబంధంతో గత 6 ఏళ్ల నుంచి ఉచితంగా దుస్తులు పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ ఏడాది కూడా 60 మంది హమాలీలకు రూ. 90 వేలు విలువచేసే దుస్తులను అందజేశామన్నారు. ప్రముఖ అరవింద్ కంపెనీకి చెందిన పాయింట్, షర్టు జతను హమాలి సోదరులకు అందజేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. బనగానపల్లె పట్టణంలోని వ్యాపారులకు, వినియోగదారులకు హమాలీలు అనుసంధానకర్తలుగా ఉంటూ ప్రతినిత్యం ఎండనక, వాననక కష్టపడుతుండడం గర్వకారణం అన్నారు. హమాలీల కుటుంబాలకు తాను ఎల్లవేళలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో హమాలి యూనియన్ నాయకులు మద్దిలేటి, మహబూబ్ బాషా , బషీర్ అహమ్మద్, కరిముల్లా హమాలీ సోదరులు పాల్గొన్నారు.

# హెచ్ కొట్టాలలో రైతన్న మీ కోసం కార్యక్రమం.



**బేతంచెర్ల జూన్ 22 ( నందిపత్రిక ).** బేతంచెర్ల మండలం హనుమంత రాయుని కొట్టాల ( హెచ్. కొట్టాల ) గ్రామములో బేతంచెర్ల మండల వ్యవసాయ అధికారి విజయ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం రైతన్న మీకోసం కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా ఎ.ఓ. మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్లో వివిధ రకాల పంటలను సాగు చేయుటకు, రైతులు తీసుకోవలసిన అనేక జాగ్రత్తలను, పంటలపై,రైతులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరించడం జరిగింది. ప్రస్తుత జూన్ నెల 22 వ తేదీనుండి 27 వ తేదీవరకు పంటల సాగుపై మండలంలోని గ్రామాల రైతులకు,పంటలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగునని తెలిపారు.

# మైదుకూరు డివిజన్లోని సబ్ స్టేషన్ లను ప్రైవేటీకరణ ను రద్దు చేయాలి.

**కడప నంది పత్రిక ప్రతినిధి** ఈరోజు మైదుకూరు డివిజన్ ఆఫీసు నందు యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు బి.నాయబ్ రసూల్ బండి రామ్మోహన్ మరియు 1104 యూనియన్ నాయకులు సుభాష్ చంద్ర ,కేశవరెడ్డి లు డివిజన్లోని మ్యానింగ్ సబ్ స్టేషన్ లను ప్రైవేటీకరణ చేయకూడదని ఒక సంయుక్త ప్రకటనలో తెలియజేశారు. ముఖ్యంగా మైదుకూరు డివిజన్ పరిధిలో ఏడు సబ్స్టేషన్ల ను ప్రైవేటీకరణ చేసే అంశం పైన మైదుకూరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగినది. డిపార్ట్మెంటల్ యాక్సిడెంట్లు మెడికల్ సంబంధించిన వ్యక్తుల కొరకు డివిజన్ మొత్తము 7 సబ్ స్టేషన్లను ఎప్పటినుంచో లైన్మెన్లు పనిచేయు చున్నారు. ట్రైపాడ్ అగ్రిమెంట్ ప్రకారము జీవో నెంబర్ 35 ప్రకారం మేనింగ్ సబ్ స్టేషన్ లో అలాగే ఉంచాలని 17.10.25 యాజమాన్యం మరియు జేఏసీ నాయకులకు పిఆర్సి సందర్భంగా ఒప్పందం కూడా జరిగినది. మన గౌరవనీయులు తిరుపతి సీఎం డి గారు మ్యానింగ్ సబ్ స్టేషన్ లో అలాగే ఉంచమని ఒక ఆర్డర్ కూడా ఇవ్వడం జరిగినది. అయితే ప్రస్తుతము ఏమైందో తెలియదు గానీ ఈ సబ్ స్టేషన్ లన్ని ప్రైవేటీకరణ చేయాలని ఉన్నతాధికారులు చేస్తున్న ప్రయత్నాలు నిలిపివేయాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యునైటెడ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు రామలింగారెడ్డి,సుధాకర్ రెడ్డి, దశరథ 1104 నాయకులు భాష, గంగా మహేశ్వర్ రెడ్డి ,శీను, శ్రీహరి, బ్రహ్మయ్య, ఓబులేసు, శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.



# పి జి ఆర్ యస్ ఫిర్యాదులను అత్యధిక ప్రాధాన్యత తో నిర్ణీత గడువు లోగా చట్ట పరిధిలో పరిష్కరించాలి జిల్లా ఎస్పీ శ్రీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐ.పి.ఎస్

**కడప నంది పత్రిక ప్రతినిధి** వై.ఎస్.ఆర్ కడప జిల్లా పోలీస్ కార్యాలయంలో "ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక" కార్యక్రమంలో జిల్లా ఎస్.పి శ్రీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐ.పి.ఎస్ పాల్గొని, జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుండి వివిధ సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఫిర్యాదు దారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. మొత్తం 144 ఫిర్యాదులు ా+=ా కు వచ్చాయి. ా+=ా కార్యక్రమానికి విచ్చేసిన వృద్ధులు, దివ్యాంగుల వద్దకే జిల్లా ఎస్పీ గారు వెళ్లి ఫిర్యాదు లను స్వీకరించారు. చట్ట పరిధిలో న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించి, వాటిని పరిశీలించి సంబంధిత పోలీస్ అధికారులతో ప్రత్యక్షంగా ఫోన్లో మాట్లాడారు. చట్టపరమైన పరిమితులలో నిర్ణీత గడువులోపు వాటిని పరిష్కరించాలంటూ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. బాధితులకు న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. చట్ట పరిధిలో న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. పోలీస్ శాఖ ద్వారా పరిష్కారం అయ్యే ప్రతి ఫిర్యాదును ప్రజలు స్వేచ్ఛగా మా దృష్టికి తీసుకురావాలని కోరుతున్నాం. ప్రజల నుండి అందిన సదరు ఫిర్యాదులను నిర్ణీత సమయంలో చట్ట పరిధిలో పరిష్కరిస్తాం.ఈ కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రజలు తమ వినతులను విన్నవించుకున్నారు. వాటిపై సంబంధిత పోలీస్ అధికారులతో జిల్లా ఎస్.పి నేరుగా మాట్లాడి సమస్యను చట్టపరిధిలో పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమం లో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్ ) శ్రీ కె. ప్రకాష్ బాబు స్పెషల్ బ్రాంచ్ డి. ఎస్పీ శ్రీ ఎన్. సుధాకర్, పలువురు పోలీస్ అధికారులు పాల్గొన్నారు.



# నాలుగేళ్ల చిన్నారిని లాక్కెళ్లిన చిరుత.. ప్రాణాలకు తెగించి కాపాడిన తండ్రి!

ఫాదర్స్ డే వేళ, ఓ తండ్రి తన కుమార్తె ప్రాణాలను కాపాడేందుకు అసాధారణ సాహసం చేశాడు. నాలుగేళ్ల చిన్నారిని నోట కరుచుకుని వెళుతున్న చిరుతపులితో ప్రాణాలకు తెగించి పోరాడి, బిడ్డను సురక్షితంగా విడిపించుకున్నాడు. ఆ తర్వాత చీకట్లో ప్రమాదవశాత్తు ఓ బావిలో పడిపోయినప్పటికీ, కుమార్తె నీటిలో మునిగిపోకుండా తన తలపై ఉంచుకుని రక్షించుకున్నాడు. మహారాష్ట్రలోని అహిల్యానగర్ జిల్లాలో మొన్న రాత్రి జరిగిన ఈ ఘటన ప్రస్తుతం సర్వత్రా చర్చనీయాంశమైంది.

printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com

# పోలియో రహిత సమాజ పరిరక్షణకు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు తప్పనిసరి

### జూన్ 28 నుంచి పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి
### డయేరియా, డెంగ్యూ, మలేరియా నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలి
### జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి

**నంద్యాల బ్యూరో, జూన్ 22(నంది పత్రిక):–** దేశంలో పోలియో వ్యాధి పూర్తిగా నిర్మూలన సాధించినప్పటికీ, పొరుగు దేశాల్లో ఇంకా పోలియో కేసులు నమోదవుతున్న నేపథ్యంలో భవిష్యత్తులో వ్యాధి తిరిగి వ్యాపించకుండా అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో ప్రజా సమస్యల స్వీకరణ అనంతరం పల్స్ పోలియో కార్యక్రమం, డయేరియా నివారణ చర్యలు, వర్షాకాలంలో తలెత్తే అంటువ్యాధుల నియంత్రణపై అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ డిఆర్ఓ రామునాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 28న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని జిల్లాలో వంద శాతం విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆమె ఆదేశించారు. దాదాపు మూడు దశాబ్దాలుగా దేశవ్యాప్తంగా పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ప్రస్తుతం దేశం పోలియో రహితంగా ఉన్నప్పటికీ ఆఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్, నైజీరియా వంటి దేశాల్లో ఇంకా పోలియో కేసులు నమోదవుతున్నందున ప్రతి సంవత్సరం ప్రత్యేక రక్షణ చర్యగా పోలియో చుక్కల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జూన్ 28వ తేదీ ఆదివారం మొదటి రోజు పోలియో బూత్‌ల ద్వారా పిల్లలకు పోలియో చుక్కలు వేయనున్నామని, అదే రోజున 90 నుంచి 95 శాతం మంది పిల్లలను కవర్ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని పేర్కొన్నారు. అనంతరం జూన్ 29, 30 తేదీలలో ఇంటింటికీ తిరిగి మిగిలిపోయిన పిల్లలకు పోలియో చుక్కలు అందజేస్తామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో జననం నుండి ఐదేళ్లలోపు వయస్సు కలిగిన ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు అందేలా సమగ్ర ప్రణాళిక రూపొందించినట్లు కలెక్టర్ వెల్లడించారు. కార్యక్రమం కోసం దాదాపు మూడు లక్షల వ్యాక్సిన్ డోసులను సిద్ధం చేసి అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు పంపిణీ చేస్తున్నామని, వ్యాక్సిన్ నాణ్యత దెబ్బతినకుండా కోల్డ్ చైన్ వ్యవస్థను పటిష్టంగా నిర్వహిస్తున్నామని తెలిపారు.




కార్యక్రమం విజయవంతం కోసం మెడికల్ ఆఫీసర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ సిబ్బంది, సూపర్‌వైజర్లతో మండల, గ్రామ స్థాయిల్లో సమావేశాలు నిర్వహించి తగిన మార్గదర్శకాలు జారీ చేసినట్లు తెలిపారు. విద్య, ఐసీడీఎస్, పంచాయతీరాజ్, డ్వామా, డీఆర్డీఏ తదితర శాఖలను భాగస్వామ్యం చేసి వంద శాతం లక్ష్య సాధనకు కృషి చేయాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా 1320 పోలియో బూత్‌లు, 44 ట్రాన్సిట్ పాయింట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దాదాపు 4 వేల మంది సిబ్బందికి శిక్షణ అందించామని, వలస కూలీలు నివసించే ప్రాంతాలు, ఇటుక బట్టీలు, నిర్మాణ ప్రదేశాలు, ఫ్యాక్టరీలు, పట్టణ మురికివాడలను ప్రత్యేకంగా గుర్తించి అక్కడ పిల్లలు ఎవరూ మిస్ కాకుండా మొబైల్ బృందాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. బస్ స్టాండ్లు, రైల్వే స్టేషన్లు వంటి రద్దీ ప్రాంతాల్లో ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రయాణికుల పిల్లలకు కూడా పోలియో చుక్కలు అందించాలని అధికారులను ఆదేశించారు. పాఠశాలల నోటీస్ బోర్డులు, గ్రామ సభలు, ప్రచార కార్యక్రమాల ద్వారా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. పోలియో కార్యక్రమంలో నమోదయ్యే వివరాలను వెంటనే యాప్‌లో నమోదు చేస్తూ రియల్ టైమ్ డేటా అప్డేషన్ చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పని చేయడమే కాకుండా రికార్డులను కూడా సకాలంలో నవీకరించడం ద్వారా ఖచ్చితమైన కవరేజ్ శాతం తెలుసుకోవచ్చని, మిగిలిన పిల్లలను ప్రత్యేక మాప్–అప్ రౌండ్ల ద్వారా కవర్ చేయవచ్చని తెలిపారు. డయేరియా, డెంగ్యూ, మలేరియా నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలి. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని డయేరియా నియంత్రణ చర్యలను మరింత ముమ్మరం చేయాలని కలెక్టర్ సూచించారు. ఐదేళ్లలోపు పిల్లల్లో డైరియా వల్ల ఎలాంటి మరణాలు సంభవించకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ, ఓఆర్ఎస్ కార్నర్ల ఏర్పాటు, ఇంటి వద్దే ఓఆర్ఎస్ ద్రావణం తయారీపై ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. డీహైడ్రేషన్ లక్షణాలు కనిపించిన వెంటనే పిల్లలకు ఓఆర్ఎస్ అందించి అవసరమైతే ఆసుపత్రులకు తరలించాలని సూచించారు. తాగునీటి పైప్‌లైన్లలో లీకేజీలు, డ్రైనేజీ సమస్యలను వెంటనే గుర్తించి సరిచేయాలని, కలుషిత నీటి వల్ల వ్యాధులు వ్యాపించకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, బహిరంగ మలవిసర్జన నివారణకు చర్యలు చేపట్టాలని సూచించారు. వర్షాల కారణంగా దోమల ఉధృతి పెరిగే అవకాశం ఉన్నందున మలేరియా, డెంగ్యూ వ్యాధుల నివారణకు విస్తృత ప్రచారం నిర్వహించాలని తెలిపారు. అవసరమైన చోట ఫాగింగ్, యాంటీ లార్వల్ స్ప్రేయింగ్ చేపట్టి దోమల పెరుగుదలను అరికట్టాలని ఆదేశించారు. అదేవిధంగా కలుషితమైన లేదా నిల్వ ఉంచిన ఆహార పదార్థాల వినియోగం వల్ల వాంతులు, విరేచనాలు వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రజలు తాజా ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలని, ఆహార భద్రతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. జిల్లాలో పోలియో, డయేరియా, డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధుల నియంత్రణలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రజారోగ్య పరిరక్షణకు కట్టుబడి ఉండాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. అదేవిధంగా కలుషితమైన లేదా నిల్వ ఉంచిన ఆహార పదార్థాల వినియోగం వల్ల వాంతులు, విరేచనాలు వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రజలు తాజా ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలని, ఆహార భద్రతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. జిల్లాలో పోలియో, డయేరియా, డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధుల నియంత్రణలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రజారోగ్య పరిరక్షణకు కట్టుబడి ఉండాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. అనంతరం పోలియో నివారణ గోడపత్రికను కలెక్టర్, జాయింట్ కలెక్టర్, డిఆర్ఓ సంబంధిత వైద్య అధికారులు ఆవిష్కరించారు.

# శరవేగంగా సాగుతున్న సర్ సర్వే.



**చాగలమర్రి జూన్ 22 నంది పత్రిక** ప్రత్యేక ఓటర్ సవరణ జాబితా కార్యక్రమం మండలంలో శరవేగంగా సాగుతోంది. సోమవారం సర్ సర్వేలో భాగంగా చింతలచెరువు రోడ్డు సమీపంలో ఉన్న ఓటర్ల వివరాలను జాబితాలో పరిశీలించి సవరించడం జరుగుతోంది. ఈ సందర్భంగా తహసిల్దార్ మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో ఓటు ఉండి స్థానికంగా నివాసం లేని వారిని, చనిపోయిన ఓటర్లను, తప్పుడుగా నమోదైన ఓటర్ ను తొలగించేందుకు ఓటర్ జాబితా ఇంటింటికి వెళ్లి పరిశీలిస్తున్నామన్నారు. ఈ సర్వేలో వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# సిద్ధవటంబిభాకరాపేట వంతెన ప్రమాదకరం....

### తక్షణమే మరమ్మత్తులు చేపట్టాలి..
### బిజీ వై ఎం రాష్ట్ర కార్యదర్శి బొమ్మన విజయ్...





**నందిని ప్రతినిధి, జూన్ 22, వైయస్సార్ కడప జిల్లా.** బద్వేల్ మరియు కడప ప్రధాన రహదారిలోని సిద్ధవటం మరియు భాకరాపేట మధ్య ఉన్న వంతెన అత్యంత ప్రమాదకరంగా మారిందని, పెద్ద ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించి తక్షణమే మరమ్మత్తులు చేపట్టాలని బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి డిమాండ్ చేశారు. ఆయన సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అధికారుల దృష్టికి లేక ద్వారా సమస్యను తీసుకెళ్లారు. ప్రతిరోజు వేలాది వాహనాలు, ప్రయాణికులు రాకపోకలు సాగించి ఈ ముఖ్యమైన రహదారిపై ఉన్న వంతల నిర్మాణం ప్రస్తుతం చాలా నాశరికంగా తయారిందని ఆందోళన వ్యక్తపరిచారు. వంతెన పూర్తిగా బలపడి ఏ క్షణంలోనైనా కూలిపోయే స్థితికి చేరికొందును పేర్కొన్నారు. రక్షణ గోడలు లేవు, వంతెనగ ఇరువైపులా ఎటు పోయి ఎటువంటి స్టీల్ రాడ్లు లేదు, రక్షణ కంచె గాని లేదు, సేఫ్టీ వాల్స్ లేవు, దీనివల్ల రాత్రి సమయాల్లో ప్రయాణించే వాహనదారులు తీవ్రభయాందోళన మధ్య ప్రయాణిస్తున్నారు. స్వల్ప అజాగ్రత్త జరిగిన వాహనాలు కింద పడిపోయే ప్రమాదం పొంచి ఉంది. రక్షణ గోళం లేవు వంతెనగ ఇరువైపులా ఎటువంటి సేఫ్టీ బాక్స్ లేదు రక్షణ కంచ గాని దీని వల్ల రాత్రి సమయాల్లో ప్రయాణించే వాహనదారులు తీవ్ర భయాందోళన మధ్య ప్రయాణిస్తున్నారు స్వల్ప అజాగ్రత్త జరిగిన వాహనాల కింద పడిపోయే ప్రమాదం పొంచి ఉంది. కూలిపోయే స్థితిలో వంతెన నాచరికం వల్ల పగుళ్లు వచ్చి ముందు మరమత్తులు చేయకపోవడం వంతెన పూర్తిస్థాయిలో కూలిపోయి బద్వేల్ కడప మధ్య రవాణా వ్యవస్థ పూర్తిగా స్తంభించిపోయే అవకాశం ఉంది పెద్ద ప్రమాదం జరిగి ప్రాణనాస్తం సంభవించిన తర్వాత స్పందించడం కంటే ముందస్తు చర్యగా రోడ్లు మరియు భవనాల శాఖ అధికారులు యుద్ధ ప్రాతిపదిక న స్పందించాలని డిమాండ్ చేశారు. గోడల నిర్మించారని కోరారు ప్రజాప్రయోజనాలు దృష్టిలో ఉంచుకొని జిల్లా కలెక్టర్ ఈ సమస్యపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి పనులు తొందరగా ప్రారంభమయ్యేలా చూడాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో జనతా వారధి ప్రతినిధి లక్ష్మణ్ రావు, బీజేవైఎం నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# జిల్లా ఉత్తమ విధానాలపై ప్రత్యేక బుక్‌లెట్‌ను సిద్ధం చేయండి

### రెండేళ్ల అభివృద్ధి ప్రస్థానాన్ని ఒకే బుక్‌లెట్‌లో ఆవిష్కరించాలి
### శాఖల సమన్వయంతో నాణ్యమైన సక్సెస్ స్టోరీలను రూపొందించాలి
### జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి

**నంద్యాల బ్యూరో, జూన్ 22(నంది పత్రిక):–** గత రెండేళ్ల కాలంలో జిల్లాలో వివిధ శాఖలు అమలు చేసిన ఉత్తమ విధానాలు, వినూత్న కార్యక్రమాలు, ప్రజలకు అందించిన మెరుగైన సేవలను సమగ్రంగా ప్రతిబింబించేలా ఉత్తమ కథనాలతో ప్రత్యేక బుక్‌లెట్‌ను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి శాఖ తమ పరిధిలో అమలు చేసిన ఉత్తమ విధానాలు, సక్సెస్ స్టోరీలను సంక్షిప్తంగా, ప్రభావవంతంగా రూపొందించాలని తెలిపారు. ఒక్కో అంశం ఒకటి లేదా రెండు పేజీలకు మించకుండా ఉండాలని, అందులో జిల్లా పరిస్థితి, ఎదురైన సమస్యలు, వాటి పరిష్కారానికి అనుసరించిన వ్యూహాలు, అమలు విధానం, సాధించిన ఫలితాలు స్పష్టంగా



పొందుపరచాలని సూచించారు. ప్రతి కథనానికి ఆకర్షణీయమైన శీర్షికతో పాటు నాణ్యమైన హెచ్‌డీ ఫోటోలను జతచేయాలని కలెక్టర్ తెలిపారు. బుక్‌లెట్ తయారీ బాధ్యతలను పీడీ డీఆర్‌డీఏ, పీడీ మెప్మా ఆధ్వర్యంలో నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. వ్యవసాయం, ఉద్యానవనం, సూక్ష్మ నీటిపారుదల, పశుసంవర్ధక, మత్స్యశాఖలకు సంబంధించిన ఉత్తమ విధానాలను సమన్వయం చేయాలని, మహిళా నర్సరీలు, కొత్త పంటల ప్రవేశపెట్టడం వంటి విజయగాథలను పొందుపరచాలని సూచించారు. భూగర్భజల శాఖ చేపట్టిన డిఫంక్ట్ బోర్‌వెల్ రీఛార్జ్ కార్యక్రమంతో పాటు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ఉత్తమ విధానాలను సేకరించాలని, అలాగే పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి, హౌసింగ్ తదితర ఇంజినీరింగ్ శాఖలు తమ వినూత్న కార్యక్రమాల కథనాలను సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఎక్సైజ్, కమర్షియల్ టాక్సెస్, రిజిస్ట్రేషన్స్, మైనింగ్, లీగల్ మెట్రాలజీ వంటి ఆదాయ వనరుల శాఖల వివరాలను జిల్లా రిజిస్ట్రార్ సమన్వయం చేయాలని, పరిశ్రమలు, ఫ్యాక్టరీలు, ఏపీఐఐసీకి సంబంధించిన వివరాలను కాలుష్య నియంత్రణ మండలి ద్వారా సేకరించాలని సూచించారు. మున్సిపాలిటీల్లో అమలవుతున్న స్వచ్ఛత కార్యక్రమాలు, స్వచ్ఛ భారత్ ఆధారిత ఉత్తమ విధానాలను మున్సిపల్ కమిషనర్లు సమన్వయం చేయాలని, పోలీసు శాఖ అమలు చేసిన వినూత్న కార్యక్రమాలను కూడా బుక్‌లెట్‌లో పొందుపరచాలని తెలిపారు. పర్యాటకం, గ్రీన్ ఎనర్జీ, దేవాదాయ శాఖలకు సంబంధించిన విశిష్ట కార్యక్రమాలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. కలెక్టరేట్ తరఫున జిల్లా హెచ్‌ఆర్‌డీ, పీజీఆర్ఎస్, ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌కు సంబంధించిన మూడు ప్రధాన ఉత్తమ కథనాలను ప్రత్యేకంగా రూపొందించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఉద్యోగుల నైపుణ్యాభివృద్ధి, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ బలోపేతం, సిఎస్ఆర్ నిధులతో స్టార్టప్‌ల కోసం అభివృద్ధి చేస్తున్న ఎక్స్‌పీరియన్స్ సెంటర్ వంటి అంశాలను ఇందులో పొందుపరుస్తామని కలెక్టర్ వెల్లడించారు. జిల్లాలో అమలైన ఉత్తమ విధానాలు రాష్ట్ర స్థాయిలో ఆదర్శంగా నిలిచేలా నాణ్యమైన డాక్యుమెంటేషన్ సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

# వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ గా డా.సిహెచ్ శ్యామరాజ్ నాయక్ బాధ్యతలు



**మహానంది,జూన్ 22 (నంది పత్రిక ):–** మహానందిలోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ గా డా. సిహెచ్.శ్యామ్ రాజునాయక్ బాధ్యతలు స్వీకరించారు. ఈయన అంతకుముందు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానము లాంగ్ ఫారం గుంటూరు నందు ప్రధాన శాస్త్రవేత్తగా, ఫిజియాలజీ విభాగంలో పనిచేస్తూ పదోన్నతి పై మహానంది వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ గా బాధ్యతలు స్వీకరించినట్లు తెలిపారు. 2006 వరకు సహాయ ఆచార్యులుగా బాధ్యతలు నిర్వహించి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విద్యాలయాలలో వివిధ హోదాలలో పని చేసినట్లు తెలిపారు. అనంతరం ఆయన సిబ్బందిని అనుసరించి మాట్లాడుతూ మనందరం కలిసికట్టుగా కళాశాల అభివృద్ధికి తోడ్పడి ముందుకు సాగాలని, ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. అనంతరం కళాశాల అధ్యాపకులు తదితరులు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలియజేశారు.



# జూలై 1లోపు జలధార – జలహారతి పెండింగ్ పనులు పూర్తి చేయాలి

### పనుల నాణ్యత, నివేదికల ఖచ్చితత్వంపై ప్రత్యేక దృష్టి సారించాలి
### జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

**నంద్యాల బ్యూరో, జూన్ 22(నంది పత్రిక):–** జలధార–జలహారతి కార్యక్రమం కింద చేపట్టిన పనులను జూలై 1వ తేదీకి ముందుగానే పూర్తి చేసి లక్ష్యాలను సాధించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జలధార–జలహారతి కార్యక్రమ పురోగతి, పెండింగ్ పనులు, థర్డ్ పార్టీ వెరిఫికేషన్, సక్సెస్ స్టోరీల తయారీ తదితర అంశాలపై ఎంపీడీఓలు, డ్వామా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో జలధార–జలహారతి కింద మొత్తం 2,103 పనులు మంజూరు కాగా, ఇప్పటివరకు 1,587 పనులు పూర్తయ్యాయని, ఇంకా 516 పనులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. జూలై మొదటి వారంలో వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో మిగిలిన పనులను అత్యవసరంగా పూర్తి చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. జల్ సంచయ్ – జల్ భాగీదారి కార్యక్రమం కింద ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా చేపట్టిన వాటర్ కన్జర్వేషన్ నిర్మాణాలపై కేంద్ర జల కమిషన్ బృందం థర్డ్ పార్టీ వెరిఫికేషన్ నిర్వహిస్తోందని తెలిపారు. ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన ఫోటోలు, క్షేత్రస్థాయిలో ఉన్న నిర్మాణాలకు సరిపోతున్నాయా లేదా అన్న విషయాన్ని అధికారులు పరిశీలిస్తున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఇంటెలిజెన్స్ విభాగంతో పాటు ప్రత్యేక థర్డ్ పార్టీ బృందాలు కూడా పనులను నిశితంగా పరిశీలిస్తున్నాయని పేర్కొన్నారు. పనులను త్వరగా పూర్తి చేయాలనే ఉద్దేశంతో నాణ్యతను విస్మరించి, క్షేత్రస్థాయిలో పూర్తి కాకముందే ఆన్‌లైన్‌లో 'కంప్లీట్'గా నమోదు చేయవద్దని హెచ్చరించారు. క్షేత్రస్థాయి నివేదికలు, ఆన్‌లైన్ డేటా మధ్య ఎలాంటి వ్యత్యాసాలు ఉండకూడదని స్పష్టం చేశారు. పెండింగ్ పనుల పరంగా రుద్రవరం మండలం 52 పనులతో మొదటి స్థానంలో ఉండగా, డోన్ మండలంలో 46, కొలిమిగుండ్ల మండలంలో 43 పనులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఆత్మకూరు మండలంలో 37, సిరివెళ్లలో 28, బేతంచెర్లలో 24, ఔకులో 27, జూపాడు బంగ్లాలో 15, ఆళ్లగడ్డలో 32, బండి ఆత్మకూరులో 19, నందికొట్కూరులో 13, కోయిలకుంట్లలో 14, మహానందిలో 10, కొత్తపల్లిలో 9, ఉయ్యాలవాడలో 14, చాగలమర్రిలో 10, నంద్యాల రూరల్‌లో 18, గోస్పాడులో 15, పాణ్యంలో 26, మిత్తూరులో 5, గడివేములలో 7, ప్యాపిలిలో 18, బనగానపల్లెలో 18, దొర్నిపాడులో 5, వెలుగోడులో 7, పగిడ్యాలలో 2, సంజామలలో 7, పాములపాడులో 1 చొప్పున పనులు పెండింగులో ఉన్నందున సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. జలధార కార్యక్రమానికి సంబంధించిన సక్సెస్ స్టోరీలను రూపొందించే సమయంలో కేవలం పనుల వివరాలు మాత్రమే కాకుండా, వాటి వల్ల సాధించిన స్పష్టమైన ఫలితాలను కూడా పొందుపరచాలన్నారు. ముఖ్యంగా చెరువుల అభివృద్ధి ద్వారా ఆయకట్టు స్థిరీకరణ లేదా విస్తరణ ఎంత మేరకు జరిగిందో వివరించాలన్నారు. అలాగే చెరువుల సామర్థ్యం పెరగడం వల్ల భూగర్భ జలమట్టంలో వచ్చిన మెరుగుదల, రైతులకు కలిగిన ప్రయోజనాలను నమోదు చేయాలని సూచించారు. పూడికతీత, మరమ్మతులు, స్లూయిస్ లీకేజీల నివారణ వంటి చర్యల ద్వారా నీటి నిల్వ సామర్థ్యం ఎంత పెరిగిందో స్పష్టంగా పేర్కొనాలన్నారు.



# ప్రజా అర్జీలు బియాండ్ ఎస్ఎల్ఏకు వెళ్లకుండా సత్వరమే పరిష్కరించాలి

## పీజీఆర్ఎస్‌లో 349 ప్రజా దరఖాస్తుల స్వీకరణ

### జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

**నంద్యాల బ్యూరో, జూన్ 22(నంది పత్రిక):-** రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో, ప్రజల నుంచి అందుతున్న అర్జీలను నాణ్యతతో, నిర్దేశిత గడువులోపు పరిష్కరించి బియాండ్ ఎస్ఎల్ఏ లోకి వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం అనంతరం వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, డీఆర్వో రాము నాయక్, పీజీఆర్ఎస్ నోడల్ అధికారి ఉమామహేశ్వరి, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజా పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, సమస్యలకు పరిష్కారం అందించాలని సూచించారు. ఇప్పటికే పరిష్కరించినప్పటికీ తిరిగి రీఓపెన్ అయిన 96 దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి, సంబంధిత శాఖలు నాణ్యమైన పరిష్కార చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే ముఖ్యమంత్రి స్థాయిలో నిర్వహిస్తున్న ప్రజా పరిష్కార వేదికకు సంబంధించిన నాలుగు అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి తగిన ఎండార్స్‌మెంట్‌తో త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు.



**రెవెన్యూ క్లినిక్‌ల ద్వారా 177 అర్జీల స్వీకరణ** భూ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రెవెన్యూ క్లినిక్‌లు ప్రజలకు మరింత చేరువగా సేవలు అందిస్తున్నాయని కలెక్టర్ తెలిపారు. క్షేత్రస్థాయిలో సమస్యలను పరిశీలించి వేగవంతంగా పరిష్కరించే అవకాశాన్ని ఈ క్లినిక్‌లు కల్పిస్తున్నాయని పేర్కొన్నారు. జిల్లాలో నిర్వహించిన రెవెన్యూ క్లినిక్‌ల ద్వారా మొత్తం 177 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. వీటిలో రెవెన్యూ, గ్రామ/వార్డు సచివాలయ సేవలకు సంబంధించినవి 2, అడంగల్ సవరణలకు సంబంధించినవి 15, చుక్కల భూముల క్రమబద్ధీకరణ మరియు 22-ఏ భూములకు సంబంధించినవి 11, అసైన్డ్ భూములు మరియు భూ ఆక్రమణలకు సంబంధించినవి 33, రెవెన్యూ కోర్టు విచారణలు, ఆర్ఓఆర్ అంశాలకు సంబంధించినవి 67, సర్వే మరియు రీ-సర్వేలకు సంబంధించినవి 41, దేవాదాయ మరియు వక్ఫ్ భూములకు సంబంధించినవి 8 దరఖాస్తులు ఉన్నట్లు వివరించారు.

**పీజీఆర్ఎస్‌లో స్వీకరించిన కొన్ని ముఖ్య అర్జీలు** 1)డోన్ మండలం: తెలుగు రాజమ్మ అనే మహిళ తనకు వారసత్వంగా వచ్చిన సర్వే నంబర్ 460లోని నాలుగు ఎకరాల భూమిని తామే సాగు చేసుకుంటున్నప్పటికీ, రెవెన్యూ రికార్డుల్లో ఇతరుల పేర్లు నమోదు చేసి ఇబ్బందులకు గురిచేస్తున్నారని పేర్కొంటూ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

2)బండి ఆత్మకూరు మండలం: పెద్ద దేవలాపురం గ్రామ ఎస్సీ కాలనీలోని 80 సెంట్ల భూమిలో 30 సెంట్ల భూమిని కొందరు ఆక్రమించి సాగు చేస్తున్నారని, ఆ భూమిని తిరిగి స్వాధీనం చేసి న్యాయం చేయాలని గ్రామస్థులు కలెక్టర్‌ను కోరారు.

3)సిరివెళ్ల మండలం: గోవిందపల్లె గ్రామానికి చెందిన సుబ్రమణ్యం, గ్రామ పొలిమేరలోని సర్వే నంబర్ 378లో తనకు 2.14 ఎకరాల భూమి ఉండగా, ఆన్‌లైన్ రికార్డుల్లో 2.06 ఎకరాలు మాత్రమే నమోదయ్యాయని, మిగిలిన భూమిని కూడా రికార్డుల్లో నమోదు చేయాలని విజ్ఞప్తి చేస్తూ కలెక్టర్‌కు దరఖాస్తు సమర్పించారు.

# మహానంది మండలంలో ఈదురుగాలితో కూడిన భారీ వర్షం

### నంద్యాల - గిద్దలూరు రహదారిపై స్తంభించిన రాకపోకలు



**మహానంది జూన్ 22 (నంది పత్రిక):-** మహానంది మండలం తిమ్మాపురం గ్రామంలో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. గత వారం రోజులుగా ఉక్కపోతతో అల్లాడిన ప్రజలకు ఈ వర్షం ఊరటం ఇచ్చింది. ఒకింత ఉపశమనం పొందారు. రైతన్నలకు ఈ వాన కురవడంతో పొలం పనులకు ఒకింట ఉపయోగం అని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తిమ్మాపురం గ్రామంతో పాటు మహానంది, బుక్కాపురం, తమ్మడపల్లె పలు గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. బోయలకుంట్ల మెట్ట వద్ద నంద్యాల-గిద్దలూరు ప్రధాన రహదారిపై రాకపోకలు స్తంభించాయి. ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షంతో రహదారిపై భారీ వృక్షం అడ్డంగా కూలింది. దీంతో 2 కిలోమీటర్ల వరకు గంట పాటు వాహనాల రాకపోకలు స్తంభించాయి. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మహానంది రోడ్డు విభాగం సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టి ట్రాఫిక్ ను పునరుద్ధించారు.



# ఎస్ఐఆర్ ప్రక్రియను పటిష్టంగా పూర్తి చేయాలి

## యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలి

### జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

**నంద్యాల బ్యూరో, జూన్ 22(నంది పత్రిక):-** ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను నాణ్యతా ప్రమాణాలతో పటిష్టంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్లో నిర్వహించిన ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమం అనంతరం ఎస్ఐఆర్, యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే పురోగతిపై జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, జిల్లా రెవెన్యూ అధికారి రాము నాయక్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా సమగ్ర సవరణ ప్రక్రియ అత్యంత కీలకమైందని పేర్కొన్నారు. ప్రతి అర్హుడైన ఓటరు పేరు జాబితాలో నమోదయ్యేలా, అర్హత లేని పేర్లు తొలగించేలా బూత్ స్థాయిలో క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలనలు నిర్వహించాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎటువంటి నిర్లక్ష్యం లేకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధతో పనిచేయాలని ఆదేశించారు. బూత్ లెవల్ అధికారులకు (బీఎల్ఓలు) ఎలాంటి ఇతర విధులు కేటాయించకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. బీఎల్ఓలకు అత్యవసర పరిస్థితుల్లో సెలవుల మంజూరుకు సంబంధించి స్పష్టమైన విధానాన్ని పాటించాలని సూచించారు. ఒక రోజు సెలవు అవసరమైతే ఎంపీడీవో, రెండు రోజుల సెలవులకు అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి (ఏఈఆర్ఓ), మూడు రోజులకుపైగా సెలవులు అవసరమైతే ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి (ఈఆర్ఓ) అనుమతి తప్పనిసరిగా పొందాలని కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా బీఎల్ఓలుగా పనిచేస్తున్న ఉద్యోగులు బదిలీ అయినా, పదవీ విరమణ చేసినా లేదా ఇతర కారణాల వల్ల విధులు నిర్వర్తించలేని పరిస్థితి ఏర్పడినా, వారిని వెంటనే రిలీవ్ చేసి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేను వేగవంతం చేయాలి. యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేకు సంబంధించిన ప్రాథమిక వివరాలను ఈ నెల 18వ తేదీన ప్రచురించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. అనంతరం జూన్ 19వ తేదీ నుంచి ప్రజల అభ్యంతరాలు, సూచనలు, సవరణల కోసం ఓపెన్ ఫోరమ్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రత్యేకంగా కుల వివరాలకు సంబంధించిన సవరణలు, అభ్యంతరాలు, ఫిర్యాదులను జూన్ 19వ తేదీ నుంచి 26వ తేదీ వరకు స్వీకరిస్తున్నామని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకుని తమ కుటుంబ వివరాలు, సామాజిక వర్గ సమాచారం, ఇతర అంశాల్లో ఏవైనా పొరపాట్లు ఉంటే సరిదిద్దుకునేందుకు ముందుకు రావాలని కోరారు. సర్వే ప్రక్రియను నిర్దేశిత గడువులోపు పూర్తి చేయడంతో పాటు, అందిన ప్రతి దరఖాస్తును పారదర్శకంగా పరిశీలించి అర్హత మేరకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సహాయ సహకారాలు అందించాలని సూచించారు.




# భూమా కుటుంబం పై విమర్శలు మానుకోవాలి

## టిడిపి మండల కన్వీనర్ శీలం హరికుమార్ రెడ్డి




**ఆళ్లగడ్డ ప్రతినిధి జూన్ 22 నంది పత్రిక** వైసిపి జిల్లా పార్టీ అధికార ప్రతినిధి కేశవరెడ్డి నాగార్జున రెడ్డి చేసిన వ్యాఖ్యలను, ఆళ్లగడ్డ మండల కన్వీనర్ శీలం హరికుమార్ రెడ్డి, ఖండించారు. సోమవారం నాడు పట్టణంలోని టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ భూమా కుటుంబం పై విమర్శలు చేసే స్థాయి బైరెడ్డి సిద్ధారెడ్డికి లేదని పేర్కొన్నారు ఆళ్లగడ్డలో జరిగిన అభివృద్ధిపై ఎప్పుడైనా బహిరంగ చర్చకు సిద్ధమన్నారు ఆరోపణలకు ఆధారాలతో రావాలని ఆయన సవాలు విసిరారు భూమా కుటుంబం అధికారంలో ఉన్న ప్రతిపక్షంలో ఉన్న ప్రజల వెంట ఉండి వారి సమస్యలు తెలుసుకుని తీర్చే వారే భూమా కుటుంబం అన్నారు గతంలో నందికొట్కూరులోని మాజీ ఎమ్మెల్యే ఆర్థర్ ఎంత ఇబ్బంది పడ్డాడో ప్రజలందరికీ తెలుసునని వారన్నారు నందికొట్కూరులో మీరు చేసిన దందాలు ఆడుదాం ఆంధ్ర స్కామ్ లో మీరు ఎంత తిన్నారో ప్రజలందరికీ తెలుసు అని మీ సొంత పెదనాన్న బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి నీ గురించి ఎన్నోసార్లు మీడియా సమావేశంలో అసభ్య పదజాలములతో మాట్లాడారు సమాజంలో అందరికీ తెలుసని వారన్నారు. ఈ కార్యక్రమంలో విష్ణువర్ధన్ హర్షవర్ధన్ రెడ్డి నెట్ల భాస్కర్ పాల్గొన్నారు

# జర్నలిస్టుల బస్ పాస్ నిబంధనలకు విరుద్ధంగా ఎ పి ఎస్ ఆర్ టి సి అధిక వసూళ్లు

### చెల్లింపు నిబంధనల ఉల్లంఘన, పరిపాలనా నిర్లక్ష్యం, అమలు కాని సంక్షేమ హామీలపై ఎ పి జె యు విచారం

**మచిలీపట్నం, బ్యూరో చీఫ్ జూన్ 22 నంది పత్రిక** ఆంధ్రప్రదేశ్‌లో జర్నలిస్టుల వర్గంలో అసంతృప్తి పెరుగుతోంది. ఎ పి ఎస్ ఆర్ టి సి తమ సొంత రాయితీ చార్జీల విధానాన్ని ఉల్లంఘిస్తూ గుర్తింపు పొందిన జర్నలిస్టుల నుండి అధికంగా చార్జీలు వసూలు చేస్తోందని తీవ్రమైన ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆల్ ఇండియా న్యూస్ పేపర్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (ఏ ఐ ఎన్ ఈ ఎఫ్ ) జాతీయ ఉపాధ్యక్షులు మరియు ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్స్ ఫర్ ప్రింట్ అండ్ ఎలెక్ట్రానిక్ మీడియా (ఎపి జే యు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చలాది పూర్ణచంద్రరావు మరియు ఎ పి సి ఆర్ డి ఎ అమరావతి రీజన్ ప్రాంత అధ్యక్షుడు పొక్కులూరి సుబ్బారావు నేడు ఇక్కడ ఒక సంయుక్త ప్రకటనలో జర్నలిస్టుల సమస్యలను వివరించారు.

కొందరు పాత్రికేయుల ప్రకారం, అధికారిక నిబంధనల ప్రకారం బస్ పాస్ ఉన్న వారికి నిర్దిష్ట జిల్లాల బయట ప్రయాణించినప్పుడు కేవలం ఒకటి బై మూడవ వంతు (1/3) చార్జీ మాత్రమే వసూలు చేయాలి. అయితే ప్రస్తుత పరిస్థితిలో కండక్టర్లు రెండు బై మూడవ వంతు (2/3) చార్జీ వసూలు చేస్తున్నారని తెలుస్తోంది. దీనికి కారణంగా సాఫ్ట్‌వేర్‌లో కనిపించే చార్జీలు మార్పులకు అవకాశం లేకుండా ఉండటం అని కండక్టర్లు చెబుతున్నారు. మాకు లభించాల్సిన రాయితీకి రెట్టింపు చెల్లించాల్సి వస్తోంది," అని తమ యూనియన్ కి చెందిన సీనియర్ జర్నలిస్టు సభ్యుడు ఆవేదన వ్యక్తం చేశారు. కండక్టర్లు కూడా తమ నిస్సహాయతను వ్యక్తం చేస్తూ, టికెట్ యంత్రాల్లో చూపించే చార్జీలు రెండు బై మూడు వంతుగానే ఉన్నాయని చెబుతున్నారు. "వ్యవస్థలోనే లోపం ఉంటే న్యాయం



ఎక్కడ దొరుకుతుంది?" కనుక వెంటనే సరి చెయ్యాలని కోరారు. ఇళ్ల స్థలాలు, రిటైర్డ్ జర్నలిస్ట్ పెన్షన్లు, రైల్వే కనెక్షన్ పాస్‌లు, టోల్ ఛార్జీల రద్దు కూడా నెరవేరని హామీలు గానే ఉన్నాయి. ఒక్క రవాణా రాయితీకే పరిమితం కాకుండా, జర్నలిస్టుల సంక్షేమంపై ప్రభుత్వము దృష్టి పెట్టాలని వారు కోరారు. పదవీ విరమణ చేసిన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, పెన్షన్లు ఇస్తామని ఏనాడో చేసిన ప్రభుత్వ హామీలు ఇప్పటికీ నెరవేరలేదు. అలాగే అదనంగా, కోవిడ్-19 సమయంలో నిలిపివేసిన రైల్వే రాయితీ పాస్‌లు ఇప్పటికీ పునరుద్ధరించలేదు. తేలికపాటి కారణాలతో వాటిని కొనసాగించకపోవడం జర్నలిస్టుల్లో అసంతృప్తిని పెంచుతోందన్నారు

**జర్నలిజం ప్రమాదాలతో కూడిన వృత్తి**

జర్నలిజం ఒక సవాళ్లతో కూడిన, ప్రమాదకరమైన వృత్తి. దీంట్లో ఎక్కువ గంటల పని, ఫీల్డ్‌లో రాత్రనక పగలనక పని, వ్యక్తిగత త్యాగం అవసరం. ముఖ్యంగా చిన్న మీడియా సంస్థల్లో పని చేసే వారికి వేతనాలు తక్కువగా ఉంటాయి. వారికి ప్రభుత్వం చేయూత కల్పించాలి.

"జర్నలిస్టులు కేవలం పరిశీలకులు మాత్రమే కాదు, ప్రజాస్వామ్యానికి బలమైన స్తంభాలు," అనేది తెలియంది కాదని పూర్ణచంద్ర రావు, సుబ్బా రావు అన్నారు. "వారి సమస్యలను పట్టించుకోకపోవడం "స్వేచ్ఛా పత్రికా వ్యవస్థ"నే బలహీనపరుస్తుంది."

పైన పేర్కొన్న సమస్యలపై ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని చార్జీల లోపాలను సరిచేయాలని, పరిపాలనా మార్పులకు అనుగుణంగా విధానాలను నవీకరించాలని, పెండింగ్‌లో ఉన్న సంక్షేమ హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

ఈ సమస్యల పై ప్రభుత్వం స్పందించాలని వారు ఈ ప్రకటనలో కోరారు.



# ప్రజా సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కృషి

**సిరివెళ్ల (నంది పత్రిక),** సిరివెళ్ల మండల పరిధిలోని కోటపాడు గ్రామంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ప్రజా సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని నంద్యాల పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షురాలు కల్లూరి శకుంతలమ్మ పేర్కొన్నారు. నంద్యాల జిల్లా పరిధిలోని సిరివెళ్ల మండలం కోటపాడు గ్రామంలో నంద్యాల జిల్లా పార్లమెంటు ఉపాధ్యక్షురాలు కల్లూరి శకుంతలమ్మ సొంత నిధులు వెచ్చించి బీసీ, ఎస్సీ ఎస్టీ, ముస్లిం మైనారిటీ కాలనీలలోని డ్రైనేజీ కాలువలలో అపరిశుభ్రత, ముళ్ళపొదలు, మురుగునీరు తదితర వ్యర్థాలను జెసిబి యంత్రం ద్వారా తొలగించేలా చర్యలు తీసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, రైతు సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని కూటమి ప్రభుత్వం ప్రతి రైతు ఖాతాలో అన్నదాత సుఖీభవ పథకంలో భాగంగా 7000 వేల రూపాయలు జమ చేసింది అన్నారు. జిల్లా పరిధిలోని గ్రామాల్లో ఉన్నటువంటి ప్రధాన సమస్యలను గుర్తించి విడతల వారీగా పరిష్కారానికి కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది అన్నారు. ఈ కార్యక్రమంలో శేష ఓబుల్ రెడ్డి, బూసి రెడ్డి పాల్గొన్నారు.



# పోలియో రహిత సమాజ పరిరక్షణకు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు తప్పనిసరి

**జూన్ 28 నుంచి పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి**

**డయేరియా, డెంగ్యూ, మలేరియా నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలి**

**జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి**

**నంద్యాల బ్యూరో, జూన్ 22(నంది పత్రిక):-** దేశంలో పోలియో వ్యాధి పూర్తిగా నిర్మూలన సాధించినప్పటికీ, పొరుగు దేశాల్లో ఇంకా పోలియో కేసులు నమోదవుతున్న నేపథ్యంలో భవిష్యత్తులో వ్యాధి తిరిగి వ్యాపించకుండా అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో ప్రజా సమస్యల స్వీకరణ అనంతరం పల్స్ పోలియో కార్యక్రమం, డయేరియా నివారణ చర్యలు, వర్షాకాలంలో తలెత్తే అంటువ్యాధుల నియంత్రణపై అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ డిఆర్ఓ రామునాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 28న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని జిల్లాలో వంద శాతం విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆమె ఆదేశించారు. దాదాపు మూడు దశాబ్దాలుగా దేశవ్యాప్తంగా పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ప్రస్తుతం దేశం పోలియో రహితంగా ఉన్నప్పటికీ ఆఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్, నైజీరియా వంటి దేశాల్లో ఇంకా పోలియో కేసులు నమోదవుతున్నందున ప్రతి సంవత్సరం ప్రత్యేక రక్షణ చర్యగా పోలియో చుక్కల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జూన్ 28వ తేదీ ఆదివారం మొదటి రోజు పోలియో బూత్‌ల ద్వారా పిల్లలకు పోలియో చుక్కలు వేయనున్నామని, అదే రోజున 90 నుంచి 95 శాతం మంది పిల్లలను కవర్ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని పేర్కొన్నారు. అనంతరం జూన్ 29, 30 తేదీలలో ఇంటింటికీ తిరిగి మిగిలిపోయిన పిల్లలకు పోలియో చుక్కలు అందజేస్తామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో జననం నుండి ఐదేళ్లలోపు వయస్సు కలిగిన ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు అందేలా సమగ్ర ప్రణాళిక రూపొందించినట్లు కలెక్టర్ వెల్లడించారు. కార్యక్రమం కోసం దాదాపు మూడు లక్షల వ్యాక్సిన్ డోసులను సిద్ధం చేసి అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు పంపిణీ చేస్తున్నామని, వ్యాక్సిన్ నాణ్యత దెబ్బతినకుండా కోల్డ్ చైన్ వ్యవస్థను పటిష్టంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమం విజయవంతం కోసం మెడికల్ ఆఫీసర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ సిబ్బంది, సూపర్‌వైజర్లతో మండల, గ్రామ స్థాయిల్లో సమావేశాలు నిర్వహించి తగిన మార్గదర్శకాలు జారీ చేసినట్లు తెలిపారు. విద్య, ఐసీడీఎస్, పంచాయతీరాజ్, డ్వామా, డీఆర్డీఏ తదితర శాఖలను భాగస్వామ్యం చేసి వంద శాతం లక్ష్య సాధనకు కృషి చేయాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా 1320 పోలియో బూత్‌లు, 44 ట్రాన్సిట్ పాయింట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దాదాపు 4 వేల మంది సిబ్బందికి శిక్షణ అందించామని, వలస కూలీలు నివసించే ప్రాంతాలు, ఇటుక బట్టీలు, నిర్మాణ ప్రదేశాలు, ఫ్యాక్టరీలు, పట్టణ మురికివాడలను ప్రత్యేకంగా గుర్తించి అక్కడ పిల్లలు ఎవరూ మిస్ కాకుండా మొబైల్ బృందాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. బస్ స్టాండ్లు, రైల్వే స్టేషన్లు వంటి రద్దీ ప్రాంతాల్లో ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రయాణికుల పిల్లలకు కూడా పోలియో చుక్కలు అందించాలని అధికారులను ఆదేశించారు. పాఠశాలల నోటీస్ బోర్డులు, గ్రామ సభలు, ప్రచార కార్యక్రమాల ద్వారా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. పోలియో కార్యక్రమంలో నమోదయ్యే వివరాలను వెంటనే యాప్‌లో నమోదు చేస్తూ రియల్ టైమ్ డేటా అప్డేషన్ చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పని చేయడమే కాకుండా రికార్డులను కూడా సకాలంలో నవీకరించడం ద్వారా ఖచ్చితమైన కవరేజ్ శాతం తెలుసుకోవచ్చని, మిగిలిన పిల్లలను ప్రత్యేక మాప్-అప్ రౌండ్ల ద్వారా కవర్ చేయవచ్చని తెలిపారు. డయేరియా, డెంగ్యూ, మలేరియా నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలి. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని డయేరియా నియంత్రణ చర్యలను మరింత ముమ్మరం చేయాలని కలెక్టర్ సూచించారు. ఐదేళ్లలోపు పిల్లల్లో డైరియా వల్ల ఎలాంటి మరణాలు సంభవించకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ, ఓఆర్ఎస్ కార్నర్ల ఏర్పాటు, ఇంటి వద్దే ఓఆర్ఎస్ ద్రావణం తయారీపై ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. డీహైడ్రేషన్ లక్షణాలు కనిపించిన వెంటనే పిల్లలకు ఓఆర్ఎస్ అందించి అవసరమైతే ఆసుపత్రులకు తరలించాలని సూచించారు. తాగునీటి పైప్‌లైన్లలో లీకేజీలు, డ్రైనేజీ సమస్యలను వెంటనే గుర్తించి సరిచేయాలని, కలుషిత నీటి వల్ల వ్యాధులు వ్యాపించకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని



కలెక్టర్ ఆదేశించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, బహిరంగ మలవిసర్జన నివారణకు చర్యలు చేపట్టాలని సూచించారు. వర్షాల కారణంగా దోమల ఉధృతి పెరిగే అవకాశం ఉన్నందున మలేరియా, డెంగ్యూ వ్యాధుల నివారణకు విస్తృత ప్రచారం నిర్వహించాలని తెలిపారు. అవసరమైన చోట ఫాగింగ్, యాంటీ లార్వల్ స్ప్రేయింగ్ చేపట్టి దోమల పెరుగుదలను అరికట్టాలని ఆదేశించారు. అదేవిధంగా కలుషితమైన లేదా నిల్వ ఉంచిన ఆహార పదార్థాల వినియోగం వల్ల వాంతులు, విరేచనాలు వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రజలు తాజా ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలని, ఆహార భద్రతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. జిల్లాలో పోలియో, డయేరియా, డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధుల నియంత్రణలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రజారోగ్య పరిరక్షణకు కట్టుబడి ఉండాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. అదేవిధంగా కలుషితమైన లేదా నిల్వ ఉంచిన ఆహార పదార్థాల వినియోగం వల్ల వాంతులు, విరేచనాలు వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రజలు తాజా ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలని, ఆహార భద్రతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. జిల్లాలో పోలియో, డయేరియా, డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధుల నియంత్రణలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రజారోగ్య పరిరక్షణకు కట్టుబడి ఉండాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. అనంతరం పోలియో నివారణ గోడపత్రికను కలెక్టర్, జాయింట్ కలెక్టర్, డిఆర్ఓ సంబంధిత వైద్య అధికారులు ఆవిష్కరించారు.

# పిజిఆర్ఎస్ అర్జీలు నిర్ణీత సమయంలోగా పరిష్కరించాలి

**ప్రజల సంతృప్తి స్థాయి పెరిగేలా నాణ్యమైన పరిష్కారం చూపాలి-జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి**

**పిజిఆర్ఎస్ లో అందిన అర్జీలు 307**



**ఏలూరు, బ్యూరో చీఫ్ జూన్, 22 నంది పత్రిక** ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుండి అందిన అర్జీలను నిర్దేశించిన సమయంలోగా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్ లోని గోదావరి సమావేశ హాలులో సోమవారం జిల్లా స్థాయి ప్రజాసమస్యలు పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లాస్థాయి అధికారులతో జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి నిర్వహించారు. జిల్లా కలెక్టర్ వారితో పాటు జాయింట్ కలెక్టర్ యు.జె. అభిషేక్ గౌడ, ఇంచార్జ్ డిఆర్ఓ ఎల్. దేవకీదేవి, ఏలూరు ఆర్డిఓ కె. లక్ష్మీప్రసన్న, ఎస్సీ కార్పొరేషన్ ఇడి యం.ముక్కంటిలు అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి మాట్లాడుతూ పిజిఆర్ఎస్ లో అందిన ప్రతీ అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి నాణ్యతతో సకాలంలో పరిష్కరించాలన్నారు. ప్రజల సంతృప్తి స్థాయి పెరిగేలా నాణ్యమైన పరిష్కార చర్యలు తీసుకోవాలన్నారు. సోమవారం పిజిఆర్ఎస్, రెవిన్యూ క్లినిక్ లలో 307 అర్జీలు అందాయన్నారు. అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తీసుకుంటానని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు. ప్రజల నుండి అందిన అర్జీలకు సంబంధించి సంబంధిత అధికారులతో మాట్లాడి వాటిని వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు.

**అందిన అర్జీలలో కొన్ని..** కామవరపుకోట మండలం రావికంపాడు గ్రామానికి చెందిన సిహెచ్. మార్తమ్మ తమ పొలములోనికి ఉన్న దారిని సరిహద్దు రైతు రైతు ఆక్రమించుకుని దారిలేకుండా చేశారని, తమకు న్యాయం చేయాలనీ కోరారు. ఏలూరు కు చెందిన ఎం. లక్ష్మి తనకు అన్నదాతా సుఖీభవ పథకం మంజూరు చేయాలనీ కోరారు. చింతలపూడి మండలం పనుపెడ కు చెందిన పింగుల యేసేబు తన దరఖాస్తులో తన పొలంలో కొంతభాగాన్ని సరిహద్దు రైతు ఆక్రమించాడని తనకు న్యాయం చేయాలనీ కోరారు. లింగపాలెం మండలం యడవల్లికి చెందిన కూచిపూడి కుమారి తన దరఖాస్తులో తన ఇంటిస్థలంను సరిహద్దుదారుడు ఆక్రమించాడని తనకు న్యాయం చేయాలనీ కోరారు. టి.నర్సాపురం మండలం బంధముచెర్ల కు చెందిన అనుమోలు నరసింహారావు తన దరఖాస్తులో తన భూమిలోనికి వెళ్లే దారిని సరిహద్దు దారులు ఆక్రమించారని తనకు న్యాయం చేయాలనీ కోరారు. పెదవేగి మండలం రామసింగవరం నకు చెందిన కొలికిపము గంగమ్మ తన దరఖాస్తులో తనకు 6 సెంట్ల స్థలంలో చర్చి కలదని, ఆ స్థలం కొలతవేసి పట్టా మంజూరు చేయవలసిందిగా కోరారు. ముసునూరు మండలం రమణక్కపేటకు చెందిన షేక్ శ్రావణి తనకు ట్రాన్సజెండర్ పెన్షన్ మంజూరు చేయవలసిందిగా కోరారు. సదరు దరఖాస్తులను పరిశీలించి నిర్ణీత సమయంలోగా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశించారు. కార్యకమంలో వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ ఎన్.వి. నాంచారయ్య, కలెక్టరేట్ లోని వివిధ సెక్షన్ల సూపరింటెండెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్‌లో అందిన ఫిర్యాదులకు నాణ్యమైన, శాశ్వత పరిష్కారం చూపాలి






**పీజీఆర్ఎస్‌లో 127, రెవెన్యూ క్లినిక్‌లో 49 దరఖాస్తుల స్వీకరణ**

**జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి**

**భీమవరం బ్యూరో చీఫ్ జూన్ 22 నంది పత్రిక** ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్‌లలో అందుతున్న ప్రతి ఫిర్యాదును అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి నాణ్యమైన, శాశ్వత పరిష్కారం చూపాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జాయింట్ కలెక్టర్‌తోపాటు జిల్లా రెవెన్యూ అధికారి బి.శివన్నారాయణ రెడ్డి, డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ ఏ.అప్పారావు, జిల్లా పంచాయతీ అధికారి వై.దోసిరెడ్డి, కలెక్టరేట్ పరిపాలనాధికారి ఎన్.వెంకటేశ్వరరావు, తదితర అధికారులు పాల్గొని జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల నుంచి అందిన ప్రతి అర్జీని నిర్దేశిత గడువులో పరిష్కరించి ముగింపు చేయాలని సూచించారు. ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి సమస్యల తీవ్రత, వాస్తవ పరిస్థితులను తెలుసుకోవాలని, సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యానికి తావులేకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఒకే సమస్యపై ప్రజలు మళ్లీ మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన పరిస్థితి రాకుండా శాశ్వత పరిష్కారాలపై అధికారులు దృష్టి సారించాలని ఆదేశించారు. ఈ రోజు నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మొత్తం 127 దరఖాస్తులు, అలాగే రెవెన్యూ క్లినిక్‌లో 49 దరఖాస్తులు స్వీకరించబడ్డాయి. అందిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులకు పంపించి తక్షణ చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. ఇరగవరం మండలం ఐనంపూడి గ్రామం రైతు బేతి రెడ్డి శ్రీనివాసరెడ్డి తనకు ఉన్న 0.58 సెంట్ల వ్యవసాయ భూమిలో 0.50 సెంట్ల భూమి మాత్రమే ఆన్‌లైన్‌లో నమోదైందని, మిగిలిన భూమిని కూడా ఆన్‌లైన్ లో చేర్చి అడంగల్ జారీ చేయాలని కోరుతూ వినతి సమర్పించారు. ఆకివీడు మండలం, చిన్నకాపవరం గ్రామం (రామాయగూడెం) ఏలీషారావు, గ్రామస్తులు తమ ప్రాంతానికి త్రాగునీరు సరఫరా సక్రమంగా జరగడం లేదని, గ్రామంలోని ఓవర్ హెడ్ ట్యాంక్ నుంచి సుమారు 2.5 కిలోమీటర్ల మేర వేసిన పైపులు దెబ్బతినడంతో త్రాగునీటి సమస్య తీవ్రంగా మారిందని, తక్షణ చర్యలు తీసుకుని త్రాగునీటి సరఫరా పునరుద్ధరించాలని కోరారు. పాలకొల్లు మండలం, శివదేవుని చిక్కాల గ్రామం ఎన్.మోహనరావు తన ఇంటికి వెళ్లే దారి స్థలాన్ని పక్కవారు ఆక్రమించి ఇల్లు నిర్మించుకున్నారని, దీనివల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని, సంబంధిత అధికారులు విచారణ చేసి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. భీమవరం మండలం, కొవ్వాడ గ్రామం పి.రవికుమార్ వర్మ తమ వ్యవసాయ భూముల్లోకి ఏపీ క్యూఏ ప్రైవేట్ లిమిటెడ్ ఫ్యాక్టరీ నుంచి వ్యర్థ జలాలు విడుదల అవుతున్నాయని, దీనివల్ల నల్లటి ధూళి, దుర్వాసన వ్యాపించి పర్యావరణ కాలుష్యంతో పాటు ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని ఫిర్యాదు చేశారు. సమస్యను పరిశీలించి పరిష్కరించాలని కోరారు ఆచంట మండలం, పెనుమంచిలి గ్రామం దివ్యాంగురాలు కె.రత్నకుమారి తనకు పిత్రార్జితంగా వచ్చిన 10 సెంట్ల భూమిని ఆన్‌లైన్ చేసి పాస్‌బుక్ జారీ చేయాలని పలుమార్లు కోరినా న్యాయం జరగలేదని, తమ సమస్యను పరిశీలించి పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. భీమవరం, హౌసింగ్ బోర్డ్ కాలనీ బి.మురళీకృష్ణ తనకు ఎటువంటి జీవనాధారం లేదని, పలుమార్లు తెల్ల రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసినప్పటికీ మంజూరు కాలేదని, అర్హతను పరిశీలించి తెల్ల రేషన్ కార్డు మంజూరు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సేవలు అందేలా చర్యలు కొనసాగుతాయని అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, వయో వృద్ధుల ట్రిబ్యునల్ మెంబర్ మేళం దుర్గాప్రసాద్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ, ప్రజారోగ్య పరిరక్షణలకు ఎస్టీపీలు, ఎఫ్ఎస్టిపిలు ఏర్పాటుకు అవసరమైన స్థలాలను త్వరితగతిన సేకరించాలి

**మున్సిపాలిటీల్లో మురుగునీటి శుద్ధి, పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి**

**జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి**

**భీమవరం బ్యూరో చీఫ్ జూన్ 22 నంది పత్రిక** పట్టణ ప్రాంతాల్లో పర్యావరణ పరిరక్షణ, ప్రజారోగ్య సంరక్షణ, భూగర్భ జలాల కాలుష్య నివారణకు సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్స్( ఎస్ టి పి లు), ఫీకల్ స్లడ్జ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్స్ (ఎఫ్ ఎస్ టి పి లు) ఏర్పాటుకు అవసరమైన స్థలాలను త్వరితగతిన సేకరించి పనులు ప్రారంభించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ ఛాంబర్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మున్సిపల్ కమిషనర్లు, మున్సిపల్ ఇంజనీర్లు, డిస్ట్రిక్ట్ ఎన్విరాన్‌మెంటల్ అండ్ పబ్లిక్ హెల్త్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన ఎస్టీపీలు, ఎఫ్ఎస్టిపిలు ఏర్పాటు పురోగతిపై సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, పట్టణ ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణను మరింత మెరుగుపరచడానికి మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం, డిఇపిహెచ్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని మురుగునీటి శుద్ధి, ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. భీమవరం, నరసాపురం, తాడేపల్లిగూడెం, తణుకు, పాలకొల్లు మున్సిపాలిటీలలో డంపింగ్ యార్డులు, ఎస్టీపీలు, ఎఫ్ఎస్టిపిలు ఏర్పాటుకు అవసరమైన స్థలాల సేకరణను వేగవంతం చేసి, ప్రాజెక్టు పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లో చెత్తను బహిరంగ ప్రదేశాల్లో విచక్షణారహితంగా పడవేయడం వల్ల అంటువ్యాధులు వ్యాప్తి చెందే ప్రమాదం ఉందని ఆయన పేర్కొన్నారు. అలాగే సెప్టిక్ ట్యాంకుల నుంచి సేకరించిన వ్యర్థాలను ఆరుబయట డంపింగ్ చేయడం వలన దుర్వాసనతో పాటు వాయు, జల కాలుష్యం ఏర్పడి ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని తెలిపారు. దీర్ఘకాలిక వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సెప్టిక్ ట్యాంకర్ల నిర్వాహకులకు పర్యావరణ పరిరక్షణ, శాస్త్రీయ వ్యర్థాల నిర్వహణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. వ్యర్థాలను నిర్దేశిత ప్రదేశాల్లో మాత్రమే శుద్ధి చేయాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ అనధికారిక డంపింగ్ జరగకుండా పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. భీమవరం మున్సిపాలిటీ పరిధిలో డంపింగ్ యార్డు, ఎస్ టి పి లకు సంబంధించి ఇప్పటికే గుర్తించిన స్థలానికి సంబంధించిన న్యాయపరమైన వివాదాలను త్వరితగతిన పరిష్కరించి పనులు ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. నరసాపురం మున్సిపాలిటీలో డంపింగ్ యార్డు పనులతో పాటు ఎస్టీపీలు, ఎఫ్ఎస్టిపిలు ఏర్పాటుకు అవసరమైన స్థలాలను సేకరించి ప్రాజెక్టులను వేగవంతం చేయాలని తెలిపారు. మిగిలిన మున్సిపాలిటీలలో కూడా అనువైన స్థలాలను గుర్తించి, భూసేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి పనులు ప్రారంభించేలా కృషి చేయాలని ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లో మురుగునీటి శుద్ధి, పారిశుధ్య నిర్వహణ సమర్థవంతంగా జరగాలంటే ఎస్టీపీలు, ఎఫ్ఎస్టిపిలు అత్యంత అవసరమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్లు, మున్సిపల్ ఇంజనీర్లు, మున్సిపల్ పబ్లిక్ హెల్త్ అధికారులు, డిస్ట్రిక్ట్ ఎన్విరాన్‌మెంటల్ అండ్ పబ్లిక్ హెల్త్ అధికారులు, పాల్గొన్నారు.



# ప్రపంచంలోనే అతిపెద్ద క్యాన్సర్ స్క్రీనింగ్ మనదే: హైదరాబాద్ లో కేంద్ర మంత్రి అనుప్రియ పటేల్

క్యాన్సర్ మహమ్మారిపై కేంద్ర ప్రభుత్వం సమగ్ర యుద్ధం ప్రకటించిందని, ఇందులో భాగంగా ప్రపంచంలోనే అతిపెద్ద స్క్రీనింగ్ కార్యక్రమాన్ని అమలు చేస్తోందని కేంద్ర ఆరోగ్య శాఖ సహాయ మంత్రి అనుప్రియ పటేల్ తెలిపారు. హైదరాబాద్‌లోని బసవతారకం ఇండో-అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ రజతోత్సవ వేడుకల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

ఈ సందర్భంగా అనుప్రియ పటేల్ మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా 1.84 లక్షల ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ల (ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు) ద్వారా 30 ఏళ్లు దాటిన వారికి ఉచితంగా క్యాన్సర్ పరీక్షలు నిర్వహిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమం కింద ఇప్పటివరకు 35 కోట్ల మందికి ఓరల్ క్యాన్సర్, 16 కోట్ల మంది మహిళలకు బ్రెస్ట్ క్యాన్సర్, 9 కోట్ల మందికి సర్వైకల్ క్యాన్సర్ స్క్రీనింగ్ పూర్తి చేశామని పేర్కొన్నారు. ముందస్తుగా వ్యాధిని గుర్తిస్తే ప్రాణాలు కాపాడవచ్చని, చికిత్సా భారాన్ని తగ్గించవచ్చని ఆమె అన్నారు. క్యాన్సర్ చికిత్సకు అవసరమైన మౌలిక సదుపాయాలను భారీగా పెంచామని, 2014కు ముందు 384గా ఉన్న మెడికల్ కాలేజీల సంఖ్య ఇప్పుడు 820కి చేరిందని తెలిపారు. ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన (పీఎంజేఏవై) కింద 62 కోట్ల మంది పేదలకు క్యాన్సర్ చికిత్సలో ఆర్థిక భద్రత కల్పిస్తున్నామని చెప్పారు. జన్ ఔషధి కేంద్రాల ద్వారా తక్కువ ధరకే మందులు అందిస్తున్నామని గుర్తుచేశారు. నివారణ చర్యల్లో భాగంగా 14 ఏళ్ల బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్‌ను ఉచితంగా అందిస్తున్నట్లు వెల్లడించారు.

స్వర్గీయ ఎన్టీ రామారావు దార్శనికతతో, బసవతారకం గారి స్ఫూర్తితో ఏర్పాటైన ఈ ఆసుపత్రి, గత 25 ఏళ్లుగా పేదలకు తక్కువ ఖర్చుతో నాణ్యమైన సేవలు అందించడం అభినందనీయమన్నారు. ఛైర్మన్ నందమూరి బాలకృష్ణ ఆధ్వర్యంలో

ఆసుపత్రి చేస్తున్న సేవలను కొనియాడారు. అమరావతిలో కొత్తగా ఏర్పాటు చేయబోయే ఆసుపత్రికి ఆమె శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ సీఎం చంద్రబాబు, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# ఎల్‌నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా ఆందోళన !

ఎల్‌నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా ఆందోళన నెలకొంది. చినుకు పడడమే కష్టంగా మారింది. నైరుత ప్రవేశించినా చుక్కనీరు చిక్కలేదు. భూములు తడవలేదు. వ్యవసాయం పూర్తిగా పడకేసింది. నదులు నోరెళ్లబెట్టాయి. భూగర్భజలాలు అడుగంటాయి. ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే సాగు ఎలా ఉన్నా తాగునీటికి తీవ్ర కటకట ఏర్పడేలా ఉంది. కృష్ణా,గోదావరి నదులు వట్టిపోయాయా అన్నట్లుగా మారాయి. ఈ పాటికి గోదావరిలో ఎగువ నుంచి నీరు వచ్చేది. దీంతో సాగు సాగేదెలా అని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే రైతుల కోణంలో చూస్తే పరిస్థితి అంత సులభంగా కనిపించడం లేదు. గతంలో కొన్ని ప్రత్యామ్నాయ పంటలకు మార్కెట్ అనిశ్చితి, ధరల హెచ్చుతగ్గులు, కనీస మద్దతు ధర అమలులో ఎదురైన సమస్యలు రైతుల్లో సందేహాలను పెంచుతున్నాయి. వరికి ఉన్న మార్కెట్ భరోసా ఇతర పంటలకు లేదనే భావన రైతుల్లో కనిపిస్తోంది. వ్యవసాయం కేవలం రైతు కుటుంబానికే పరిమితం కాకుండా వ్యవసాయ కూలీలు, యంత్రాల యజమానులు, రవాణా రంగం, గ్రామీణ ఉపాధితో ముడిపడి ఉండటంతో పంటల ఎంపికపై తీసుకునే నిర్ణయాలు విస్తృత ప్రభావం చూపే అవకాశం ఉంది. ఎల్‌నినో ప్రస్తుత వాతావరణ పరిస్థితులపై తీవ్ర ప్రభావం చూపుతున్నదని వాతావరణ శాఖ తెలియచేస్తోంది. జూన్ నుంచి సెప్టెంబర్ వరకు సాగే ఖరీఫ్ సీజన్ ప్రారంభ దశలోనే ఈ పరిస్థితులు కనిపించడం వల్ల వ్యవసాయ రంగం, నీటి వనరుల నిర్వహణ, గ్రామీణ జీవనోపాధులపై ప్రభావం ఎంత మేరకు ఉంటుందన్న చర్చ సాగుతోంది. అయితే వాతావరణ పరిస్థితులు నిరంతరం మారుతుంటాయని, రాబోయే రోజుల్లో వర్షాల పరిస్థితిలో మెరుగుదల సంభవించే అవకాశాన్ని కూడా కొట్టిపారేయలేమని నిపుణులు చెబుతున్నారు. తెలంగాణ రైతాంగం ప్రతి ఏడాది మాదిరిగానే ఈసారి కూడా మృగశిర కార్తెతో పాటు ఖరీఫ్ సీజన్‌పై ఆశలు పెట్టుకుంది. జూన్ తొలి వారం నుంచే నాగలి పట్టి, నారుమళ్లు పోసి, విత్తనాలు సిద్ధం చేసుకున్న రైతులు ఆకాశం వైపు చూస్తున్నారు. అయితే సాధారణంగా కనిపించే నైరుతి వర్షపాత చురుకుదనం ఈసారి అనేక ప్రాంతాల్లో కనిపించకపోవడంతో వ్యవసాయ వర్గాల్లో ఆందోళన వ్యక్తమవు తోంది. వాతావరణ నిపుణులు, అంతర్జాతీయ పరిశోధనా సంస్థలు, భారత వాతావరణ శాఖ విడుదల చేస్తున్న విశ్లేషణల ప్రకారం, పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడిన ఎల్‌నినో ప్రస్తుత వాతావరణ పరిస్థితులపై ప్రభావం చూపుతున్నది. వాతావరణ మార్పుల కారణంగా నైరుతి రుతుపవనాల పురోగతిపై ప్రభావం చూపుతున్నాయి. భారత వాతావరణ శాఖకు సంబంధించిన గణాంకాలను ఉటంకిస్తూ ప్రచురితమైన నివేదికల ప్రకారం, వ్యాప్తంగా సుమారు 64 శాతం లోటు వర్షపాతం నమోదైనట్లు విశ్లేషణలు సూచిస్తున్నాయి. దేశంలోని పలు రాష్ట్రాల మాదిరిగానే తెలంగాణలోనూ వర్షాల పురోగతిపై రైతులు, వ్యవసాయ నిపుణులు, నీటివనరుల ప్రణాళికాధికారులు దృష్టి సారిస్తున్నారు. జిల్లాల వారీగా, మండలాల వారీగా పరిస్థితులు భిన్నంగా ఉండే అవకాశం ఉన్నందున స్థానిక గణాంకాలను నిరంతరం సమీక్షించాల్సిన అవసరం ఉంది. వర్షపాతం ఆలస్య మవడం వల్ల సాగు పనుల షెడ్యూల్, విత్తనాల వినియోగం, నీటి అవసరాలు, వ్యవసాయ పెట్టుబడులపై ప్రభావం పడే అవకాశం ఉంది. ప్రకృతి ప్రభావంతో పాటు జల నిర్వహణ సామర్థ్యం, నీటి నిల్వల వినియోగం, సాగునీటి ప్రణాళికలు కూడా ప్రస్తుత పరిస్థితుల్లో చర్చకు వస్తున్నాయి. అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించడం, చెరువుల పునరుద్ధరణ, వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పరిరక్షణ వంటి అంశాలపై మరింత దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. గోదావరి పరివాహక ప్రాంతంలోని మౌలిక వసతుల సమర్థ వినియోగం, రిజర్వాయర్ల నిర్వహణ, నీటి పంపిణీ వ్యవస్థల మెరుగుదల వంటి అంశాలు కూడా చర్చలో ఉన్నాయి. అయితే ఈ అంశాలపై సాంకేతిక, ఆర్థిక, పరిపాలనా కోణాలను సమగ్రంగా పరిశీలించి నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రస్తుత పరిస్థితి ఒకవైపు వాతావరణ ప్రభావాన్ని గుర్తు చేస్తే, మరోవైపు నీటి వనరుల దీర్ఘకాలిక నిర్వహణ ఎంత కీలకమో కూడా స్పష్టం చేస్తోంది. వర్షాలు ఆలస్యమవడం, సాధారణ స్థాయిలో లేకపోవడం వంటి పరిస్థితులు కొత్తవి కావు. అయితే వాతావరణ మార్పుల ప్రభావం పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ముందస్తు ప్రణాళిక, శాస్త్రీయ వ్యవసాయం, సమర్థవంతమైన జల నిర్వహణ మరింత కీలకంగా మారాయి. ప్రభుత్వం, వాతావరణ నిపుణులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, రైతు సంఘాలు, స్థానిక సంస్థలు సమన్వయంతో పనిచేస్తే ప్రస్తుత సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనే అవకాశాలు ఉన్నాయి. రైతులకు సమయానుకూల సమాచారం, పంటలపై శాస్త్రీయ మార్గదర్శకాలు, నీటి వనరుల సమర్థ వినియోగం వంటి అంశాలు రాబోయే రోజుల్లో కీలకపాత్ర పోషించనున్నాయి. ప్రకృతి సవాళ్లను పూర్తిగా నియంత్రించడం సాధ్యం కాకపోయినా, వాటి ప్రభావాన్ని తగ్గించే ముందస్తు చర్యలు మాత్రం మన చేతుల్లోనే ఉన్నాయి. అందుకే ఆందోళన కంటే అప్రమత్తతకు,

విమర్శల కంటే కార్యాచరణకు, నిరాశ కంటే ముందుచూపుకు ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంది. నీటి లభ్యతపై అనిశ్చితి కొనసాగుతున్న నేపథ్యంలో రైతులు వరి సాగుకు బదులుగా తక్కువ నీటి అవసరం ఉండే పొద్దుతిరుగుడు, పత్తి, మొక్కజొన్న, ఉల్లి వంటి ప్రత్యామ్నాయ పంటలను పరిశీలించాలని ప్రభుత్వం సూచిస్తోంది. పరిమిత నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలనే ఉద్దేశంతో ఈ సూచనలు చేస్తున్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి.

# మూర్తీభవించిన జాతీయ సమైక్యత

డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ పేరు వినగానే దేశభక్తి, సిద్ధాంత నిబద్ధత, జాతీయ సమైక్యత మనకు గుర్తుకొస్తాయి. 1943లో బెంగాల్‌లో సంభవించిన భయంకర కరవులో లక్షలాది ప్రజలు ఆకలి, పోషకాహార లోపంతో ప్రాణాలు కోల్పోయినప్పుడు, బ్రిటిష్ ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని తీవ్రంగా ప్రశ్నించిన నాయకుడు ఆయన. ఆ సమయంలో బెంగాల్ ఆర్థికమంత్రిగా ఉన్న ముఖర్జీ, బాధితులకు తక్షణ సహాయం అందించాలని ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చారు. స్పందన లేకపోవడంతో మంత్రి పదవికి రాజీనామా చేసి స్వయంగా రిలీఫ్ కార్యక్రమాలు నిర్వహించి, దేశవ్యాప్తంగా నిధులు సేకరించి కరవు బాధితులకు అండగా నిలిచారు.ఆయన మరణానంతరం అప్పటి ఉపరాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ నివాళులర్పిస్తూ, "మౌనంలోనే అత్యంత క్రూరమైన అసత్యాలు వ్యాపిస్తాయి, అన్యాయం జరుగుతున్నప్పుడు మౌనంగా ఉండటం కూడా ఒక నేరమే, ప్రజా జీవితంలో ఆయన తన అంతరంగ విశ్వాసాలను వ్యక్తపరచడానికి ఎప్పుడూ వెనుకాడలేదు" అని పేర్కొనడం ముఖర్జీ వ్యక్తిత్వానికి అద్దం పడుతుంది. 1901 జూలై 6న కలకత్తాలో జన్మించిన శ్యామా ప్రసాద్ ముఖర్జీ చిన్న వయస్సు నుంచే అసాధారణ ప్రతిభ కనబరిచారు. ఇంగ్లీషులో బీఏ ఆనర్స్, బెంగాలీలో ఎంఏ, లండన్‌లో న్యాయశాస్త్రం అభ్యసించి బారిస్టర్‌గా నమోదు అయ్యారు. కేవలం 33 ఏళ్లకే కలకత్తా విశ్వవిద్యాలయ ఉపకులపతిగా బాధ్యతలు చేపట్టడం ఆయన మేధస్సుకు నిదర్శనం. ప్రపంచవ్యాప్తంగా కమ్యూనిజం, సామ్యవాదం ప్రభావం పెరుగుతున్న కాలంలో దేశ సమైక్యతకు, జాతీయ ప్రయోజనాలకు జాతీయవాదమే సరైన మార్గమని ఆయన విశ్వసించారు. కలకత్తాలోని ప్రముఖ న్యాయవాది నిర్మల్ చంద్ర ఛటర్జీ, వీర్ సావర్కర్ పర్యటన సందర్భంగా నగరంలోని మేధావుల కోసం ఒక ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి ముఖర్జీని ఆహ్వానించారు. వీర్ సావర్కర్ ఆలోచనల ప్రభావంతో ముఖర్జీ జాతీయవాద ఉద్యమంలో చురుకుగా పాల్గొని, అఖిల భారత హిందూ మహాసభతో కలిసి పనిచేశారు. 1929లో శాసనమండలికి ఎన్నికైన ముఖర్జీ, తరువాత బెంగాల్ ఆర్థికమంత్రిగా సేవలందించారు. 1946లో మహమ్మద్ అలీ జిన్నా నాయకత్వంలోని ముస్లిం లీగ్ ప్రత్యేక పాకిస్థాన్ కోసం ప్రకటించిన 'డైరెక్ట్ యాక్షన్ దే' అనంతరం కలకత్తా, నౌఖాళీ, తిప్పర్ ప్రాంతాల్లో చెలరేగిన మతహింస దేశాన్ని కుదిపేసింది. ముస్లిం మతోన్మాదం వల్ల దాదాపు 20వేల మందికి పైగా హిందువులు ప్రాణాలు కోల్పోయారు. చరిత్రలో దీనిని 'గ్రేట్ కలకత్తా కిల్లింగ్స్'గా పేర్కొంటారు. ఆ సమయంలో బాధితుల్లో విశ్వాసం నింపేందుకు, సామాజిక శాంతి నెలకొల్పేందుకు ఆయన కృషి చేశారు. 1947లో రాజ్యాంగ సభ సభ్యునిగా భారత రాజ్యాంగ రూపకల్పనలో పాల్గొన్నారు. స్వాతంత్ర్యం అనంతరం మహాత్మాగాంధీ సూచనతో జవహర్‌లాల్ నెహ్రూ మంత్రివర్గంలో పరిశ్రమలు, సరఫరాలశాఖ మంత్రిగా చేరారు. స్వతంత్ర భారతదేశ తొలి పారిశ్రామిక విధాన రూపకల్పనలో కీలకపాత్ర పోషించారు. భారీ పరిశ్రమలతో పాటు చిన్న, కుటీర, గ్రామీణ పరిశ్రమల అభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చారు. హ్యాండ్లూమ్, హస్తకళలు, ఖాదీ, గ్రామీణ పరిశ్రమల అభివృద్ధికి తీసుకున్న చర్యలు దేశ ఆర్థిక నిర్మాణానికి బలమైన పునాది వేశాయి. అయితే తూర్పు పాకిస్థాన్‌లో హిందువులు, ఇతర మైనారిటీలపై జరుగుతున్న దాడులు ఆయనను తీవ్రంగా కలచివేశాయి. శరణార్థుల సమస్య, మైనారిటీల భద్రత విషయంలో భారత ప్రభుత్వం మరింత దృఢంగా వ్యవహరించాలని ఆయన కోరారు. నెహ్రూలియాకత్ ఒప్పందంపై తీవ్ర అభిప్రాయ భేదాలు ఏర్పడటంతో 1950లో కేంద్ర మంత్రివర్గానికి రాజీనామా చేశారు. దేశ రాజకీయాలకు ఒక ప్రత్యామ్నాయ జాతీయవాద దిశను అందించాలనే సంకల్పంతో ఆయన రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆరెస్సెస్) సర్‌సంఘచాలక్ ఎంఎస్ గోల్వాల్కర్ (గురూజీ)తో కలకత్తాలో సుదీర్ఘ చర్చలు జరిపారు. ఆ చర్చల ఫలితంగా 1951లో ఢిల్లీలో జన్‌సంఘ్‌ను స్థాపించారు. జన్‌సంఘ్ నిర్మాణానికి అంకితభావం కలిగిన సంఘ్ ప్రచారక్‌లను ముఖర్జీకి గురూజీ అందించారు. వారిలో దీనదయాళ్ ఉపాధ్యాయ, అటల్ బిహారీ వాజపేయి, నానాజీ దేశముఖ్, సుందర్‌సింగ్ భండారి, జగన్నాథరావు జోషి, కుశాభావ్ ఠాక్రే వంటి ప్రముఖులు ఉన్నారు. వీరందరూ జనసంఘ్‌ను దేశవ్యాప్త రాజకీయశక్తిగా తీర్చిదిద్దేందుకు కృషి చేశారు. 1952 తొలి సాధారణ ఎన్నికల్లో జనసంఘ్ పరిమిత వనరులతో పోటీ చేసి, మూడు లోక్‌సభ స్థానాలను గెలుచుకుంది. సభ్యుల సంఖ్య తక్కువైనా, ముఖర్జీ ప్రతిపక్ష స్వరాన్ని బలంగా వినిపించారు. పార్లమెంటులో ఆయన ప్రసంగాలు వాస్తవాలు, తర్కం, హాస్యచతురతతో నిండి ఉండేవి. ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడు హిరెన్ ముఖర్జీ వంటి నాయకులు ముఖర్జీ వాదనల పట్ల శ్రద్ధాసక్తులు కనబరిచేవారు. రాజకీయ భేదాలు ఉన్నా, ప్రత్యర్థులు కూడా ఆయన మేధస్సును గౌరవించేవారు. దేశ విభజన అనంతరం జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించడం, భారత పౌరులు అక్కడికి వెళ్లేందుకు ప్రత్యేక అనుమతి అవసరమవడం ముఖర్జీని తీవ్రంగా కలచివేసింది. "ఒకే దేశంలో రెండు విధానాలు, రెండు ప్రధానులు, రెండు జెండాలు ఉండవు" అనే ఆయన నినాదం దేశవ్యాప్తంగా మారుమోగింది.

కశ్మీర్ సంపూర్ణ విలీన ఉద్యమంలో భాగంగా 1953లో కశ్మీర్‌కు బయలుదేరిన ఆయనను అరెస్టు చేసి శ్రీనగర్‌లో నిర్బంధించారు. 40 రోజుల నిర్బంధం అనంతరం 1953 జూన్ 23న అనారోగ్యంతో ముఖర్జీ మరణించారు. అప్పటికి ఆయన వయసు కేవలం 52 ఏళ్లు మాత్రమే. పిన్న వయసులోనే ప్రతిభ చూపిన ఒక గొప్ప జాతీయవాద నాయకుడిని దేశం కోల్పోయింది. డాక్టర్ ముఖర్జీ నాటిన చిన్న విత్తనమే భారతీయ జనతా పార్టీ అనే మహావృక్షంగా ఎదిగి, ఆయన భావజాలాన్ని వ్యాపింపజేసింది. 2019లో ప్రధాని మోదీ సాహసోపేతమైన నిర్ణయంతో ఆర్టికల్ 370 రద్దు కావడం ఒక చరిత్రాత్మక ఘట్టం. కశ్మీర్ భారతదేశంలో అంతర్భాగమని అది మరొకసారి ప్రపంచానికి స్పష్టం చేసి పాకిస్థాన్‌కు కనువిప్పు కలిగించింది. ఆర్టికల్ 370 రద్దుతో ముఖర్జీ కన్న ఒక కల నెరవేరినట్లయింది. శ్యామా ప్రసాద్ ముఖర్జీ జీవితం మనకు ఒక గొప్ప సందేశాన్ని అందిస్తున్నది 'పదవుల కోసం కాదు,

సిద్ధాంతాల కోసం జీవించిన నాయకులు చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తారు' అని. ఆయన త్యాగం ఒక వ్యక్తి గాథ కాదు భారత జాతీయ సమైక్యత కోసం సాగిన ఒక మహాయజ్ఞం. భారతమాతకు అంకితమైన ఆ మహనీయునికి నా వినమ్ర నివాళులు.

# కులం గోడలు ఆ ఒక్కచోటేనా?

విద్య ద్వారా కులం అడ్డుగోడలు కూల్చుతామని రాష్ట్ర ముఖ్యమంత్రులు మాట్లాడటాన్ని ఇప్పుడున్న పరిస్థితుల్లో మనం ఊహించలేం! సర్వాంతర్యామిలా కులం అన్నిరంగాల్లో పాతుకుపోయిన పరిస్థితుల్లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దాన్నొక అడ్డుగోడగా భావించటమే కాదు, దాన్ని కూల్చటానికంటూ ఒక కార్యాచరణనూ మొదలుపెట్టారు. ఒక కోణం నుంచి చూస్తే కారుచీకట్లో కాంతిరేఖలాగా ఇది కనిపిస్తుంది. మరో కోణం నుంచి చూస్తే ఇదొక ముందడుగు లాగానే కన్పిస్తుంది తప్ప గమ్యాన్ని చేరుకోగలమా? లేదా? అన్న సందేహాన్నీ కలగచేస్తుంది. ఇప్పటివరకూ విద్యావ్యవస్థను ఎంతగా దారితప్పించామో నిశితంగా పరిశీలిస్తే ఈ సందేహంలో సముచితతత్వం కొంతవరకూ అర్థమవుతుంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన విద్యార్థులకు విడివిడిగా రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటుచేయటం ద్వారా సమాజంలో ఉన్న కుల/వర్గ విభజనలను మరింతగా స్థిరీకరిస్తున్నామని రేవంత్ పదేపదే విమర్శిస్తున్నారు. విద్యార్థి దశలోనే పిల్లల్లో కులాల అడ్డుగోడలను కట్టటం ద్వారా వాళ్లలో సామాజిక సమానత్వ భావన, సౌభ్రాతృత్వం అభివృద్ధికావటం లేదని రేవంత్ వ్యక్తంచేస్తున్న ఆందోళనలో సహేతుకతను కాదనలేం. దీనికి విరుగుడుగా రేవంత్ ప్రభుత్వం 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్' ప్రాజెక్టును చేపట్టింది. నియోజకవర్గానికి ఒకటిచొప్పున 119 స్కూళ్లు ఏర్పాటుచేయాలన్నది ఆ ప్రాజెక్టు లక్ష్యం. ఇప్పటికే చాలాచోట్ల వీటి నిర్మాణానికి పరిపాలనాపరమైన అనుమతులు ఇచ్చారు. కొన్నిచోట్ల నిర్మాణాలూ మొదలయ్యాయి. ఒక్కో స్కూలుకు దాదాపు రూ.200 కోట్లు ఖర్చు పెట్టబోతున్నారు. అన్ని స్కూళ్లకు కలిపి రూ.21,000 కోట్లను వ్యయంచేయటానికి ప్రణాళికలూ తయారయ్యాయి. భారీ వ్యయమయ్యే ఏ ప్రాజెక్టుకూ స్వంత నిధులను కేటాయించలేని పరిస్థితి ఉండటంతో ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల కోసం విదేశీ, స్వదేశీ అప్పులనూ తీసుకువస్తున్నారు. ఈ స్కూళ్లల్లో విద్యార్థులను ఎలా కలిపి ఉంచుతారో, అంటే ఒక తరగతిలో అన్ని వర్గాల పిల్లలూ ఉండే విధంగా ఎలాంటి ఏర్పాటుచేస్తారో ఇంకా స్పష్టంకాలేదు. ఇప్పుడున్న వర్గాలవారీ స్కూళ్లను అలాగే కొనసాగిస్తూ ఒకే కాంపౌండ్‌వాల్ పరిధిలోకి వాటిని తీసుకువచ్చినంత మాత్రాన పెద్దగా ప్రయోజనం ఉండదనే వాదనను కొన్ని ఉపాధ్యాయ సంఘాలు చేస్తున్నాయి. ప్రభుత్వ ఆలోచనే ఇదైతే ఈ వాదనను అంత తేలికగా కొట్టేయలేం. విద్యాబోధనలో విడివిడిగానూ ఆటపాటల్లో మాత్రం కలివిడిగానూ ఉంచే ఏర్పాట్లు అనుకున్న ఫలితాలను ఇవ్వవు. కులరహిత ఆలోచనలనూ, హేతుబద్ధ అభిప్రాయాలనూ విద్యార్థుల్లో కలగచేయటానికి తరగతిగదులు ఉపయోగపడినట్లుగా మిగతావి ఉపయోగపడవు. ప్రబలంగా ఉండే అభిప్రాయాలను ప్రశ్నించే తత్వాన్నీ, కొత్త విషయాల పట్ల జిజ్ఞాసనూ తరగతి గదిలోనే పెంపొందించటానికి ఎక్కువగా అవకాశం ఉంటుంది. ఆటపాటల సమయంలో పోటీయే ప్రధానంగా ఉంటుంది తప్ప ఇతర ఆలోచనలపై అంతగా శ్రద్ధచూపే అవకాశం ఉంటుందని అనుకోలేం. కాస్త మంచి సౌకర్యాలతో మెరుగైన బోధనను అందించాలన్న లక్ష్యంతో ఏర్పాటైన రెసిడెన్షియల్ స్కూళ్లు సాధారణ ప్రభుత్వ పాఠశాలలతో పోల్చితే కొంతకాలం ఆశించిన ఫలితాలను ఎంతోకొంత అందించాయి. కానీ క్రమేపీ వాటికీ ఆదరణ తగ్గుతోన్న దృశ్యమే కనపడుతోంది.

# సింధుజలాలపై అవసరమైతే యుద్ధం

## భారత్‌తో తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధం

## పాక్ రక్షణ మంత్రి ఖవాజా ప్రేలాపనలు

సింధు జలాల కోసం అవసరమైతే భారత్‌తో యుద్ధం చేస్తామని పాక్ ప్రగల్భాలు పలికింది. సింధు జలాల ఒప్పందం విషయంలో వెనక్కి తగ్గేది లేదని భారత్ స్పష్టం చేసిన నేపథ్యంలో, పాకిస్థాన్ రక్షణమంత్రి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. భారత్ చర్యలు తమ నీటి సరఫరాకు ముప్పు కలిగిస్తున్నాయని, అవసరమైతే ఆ దేశంపై యుద్ధానికి వెళ్లేందుకు కూడా సిద్ధంగా ఉన్నామని పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ తాజాగా హెచ్చరించారు. పహల్గామ్ ఉగ్రదాడి అనంతరం సింధు జలాల ఒప్పందం అమలును భారత్ నిలిపివేసిన సంగతి తెలిసిందే. ఉగ్రవాదానికి పూర్తిగా, విశ్వసనీయంగా అడ్డుకట్ట వేయకపోతే ఒప్పందాన్ని పునరుద్ధరించే ప్రసక్తే లేదని భారత్ తేల్చి చెప్పింది. కాగా, పాకిస్థాన్‌కు వచ్చే నీటి ప్రవాహాన్ని తగ్గించే లేదా అడ్డుకునే ప్రయత్నాలు జరిగితే అది జాతీయ భద్రతా సమస్యగా మారుతుందని ఆసిఫ్ అన్నారు. పాక్ ఆర్థిక వ్యవస్థ, కోట్లాది మంది ప్రజల జీవనాధారం సింధు నదీ వ్యవస్థపై ఆధారపడి ఉందని ఆసిఫ్ అన్నారు. ఈ నేపథ్యంలో నీటి హక్కులను కాపాడుకునేందుకు అన్ని మార్గాలనూ ఉపయోగిస్తామని, అవసరమైతే యుద్ధం వరకు వెళ్లడానికి కూడా వెనుకాడబోమని ఆసిఫ్ హెచ్చరించారు. సింధు జలాల ఒప్పందం 1960లో కుదిరింది. ఈ ఒప్పందం ప్రకారం సింధు నదీ వ్యవస్థలోని ఆరు నదులను భారత్, పాకిస్థాన్‌కు సమానంగా కేటాయించారు. ఒప్పందం ప్రకారం రావి, బియాస్, స్లటెజ్ నదులపై భారత్‌కు హక్కులుంటాయి. సింధు, జీలం, చీనాబ్ నదులపై పాకిస్థాన్‌కు హక్కులుంటాయి. అలాగే పాకిస్థాన్‌కు కేటాయించిన మూడు నదులపై కూడా భారత్‌కు కొన్ని పరిమిత హక్కులు ఉన్నాయి. పాక్‌కు కేటాయించిన నదులపై భారత్ జలవిద్యుత్ ప్రాజెక్టులు నిర్మించుకోవచ్చు. తాగునీరు, గృహ అవసరాలకు నీటిని వినియోగించుకోవచ్చు. అలాగే పరిమిత స్థాయిలో సాగునీటికి కూడా ఉపయోగించు కోవచ్చు. అయితే నదుల ప్రవాహాన్ని పూర్తిగా అడ్డుకునే హక్కు భారత్‌కు లేదు. ఃాగా, ఇటీవలి ఉగ్రవాద ఘటనల తర్వాత భారత్ ఈ ఒప్పంద అమలును నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. ఉగ్రవాదానికి మద్దతు కొనసాగితే పాత విధానంలో ఒప్పందం కొనసాగదని భారత్ స్పష్టం చేసింది. ఇటీవలి కాలంలో చీనాబ్, జీలం నదులపై కొన్ని ప్రాజెక్టులు నిర్మిస్తోంది. ఈ నిర్మాణాలపై పాకిస్థాన్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తోంది.

# మాస్కోపై విరుచుకుపడ్డ ఉక్రెయిన్

## డ్రోన్‌లతో వరుస దాడులతో రష్యా ఉక్కిరిబిక్కిరి

రష్యాపై ఉక్రెయిన్ భీకర దాడులు కొనసాగిస్తోంది. మాస్కో, దాని పరిసరాల ప్రాంతాలే లక్ష్యంగా ఆదివారం వందల డ్రోన్లతో విరుచుకుపడింది. వాటిలో దాదాపు 60 డ్రోన్లను కూల్చేసినట్లు రష్యా ఎయిర్ డిఫెన్స్ అధికారులు వెల్లడించారు. దాడుల నేపథ్యంలో నగరంలోని నాలుగు విమానాశ్రయాలు మూతపడ్డాయి. క్రిమియాపై కూడా ఉక్రెయిన్ దాడులకు పాల్పడుతుండడంతో అదనపు భద్రతా చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ముందుజాగ్రత్త చర్యగా క్రిమియాలో సోమవారం జరగాల్సిన అన్ని బహిరంగ కార్యక్రమాలను అధికారులు రద్దు చేశారు. సాధ్యమైనంత వరకు విద్యుత్ వినియోగాన్ని తగ్గించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మరోవైపు.. ఇంధన సదుపాయాలు, చమురు శుద్ధి కేంద్రాలపై కీవ్ దాడులు చేయడంతో క్రిమియా ప్రాంతంలో ఇంధన సరఫరాకు తీవ్ర అంతరాయం నెలకొంది. దీంతో నగరవ్యాప్తంగా ఉన్న పెట్రోల్ స్టేషన్లలో ప్రజలకు, ప్రభుత్వేతర సంస్థలకు ఇంధన విక్రయాలను నిలిపివేశారు. విరామం ఇవ్వకుండా ఉక్రెయిన్ ప్రతిరోజూ వందల డ్రోన్‌లతో విరుచుకు పడుతుండడంతో మాస్కో ఉక్కిరిబిక్కిరవుతోంది. ఈ క్రమంలోనే ఉక్రెయిన్‌లోని దక్షిణ ఒడెసా ప్రాంతంపై రష్యా చేసిన ప్రతిదాడుల్లో ఒకరు మరణించగా.. ముగ్గురు గాయపడినట్లు అధికారులు వెల్లడించారు. ఈ దాడుల్లో పలు వాహనాలు ధ్వంసమవ్వగా.. ఇంధన నిల్వ ట్యాంకులలో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి.

# అమెరికాకు షాకిచ్చిన చైనా

## పలు రక్షణ కంపెనీలపై ఆంక్షలు

అమెరికాకు చెందిన 10 సైనిక సంబంధిత కంపెనీలపై చైనా ఆంక్షలు విధించింది. ఆయా కంపెనీలకు పౌర-మిలిటరీ వినియోగ వస్తువుల ఎగుమతిని నిషేధిస్తున్నట్లు తెలిపింది. వీటిల్లో రేథియాన్, లాక్‌హీడ్ మార్టిన్ వంటి ప్రముఖ సంస్థలు ఉన్నాయి. అగ్రరాజ్యం ఇటీవల తమ రక్షణ రంగ కాంట్రాక్టుల్లో చైనా టెక్ కంపెనీలను నిషేధించిన నేపథ్యంలో బీజింగ్ ఈ చర్యలు చేపట్టింది. దీంతో పాటు అమెరికాకు చెందిన 46 కంపెనీల నుంచి ఉత్పత్తులు కొనుగోలు చేయకుండా తమ ప్రభుత్వ రంగ సంస్థలను నిరోధించనున్నట్లు చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది. అంతే కాకుండా ఇతర దేశాలు చైనా నుంచి కొనుగోలు చేసిన వస్తువులను.. ఆంక్షలకు గురైన అమెరికా కంపెనీలకు బదిలీ చేయడాన్ని నిషేధిస్తున్నట్లు తెలిపింది. చైనా సైన్యంతో సంబంధాలు ఉన్నాయని ఆరోపిస్తూ.. అలీబాబా, బైడూ సహా పలు టెక్ కంపెనీలపై ఈ నెల ఆరంభంలో అమెరికా రక్షణ శాఖ నిషేధం విధించింది. ఇకపై ఆయా కంపెనీలు అగ్రరాజ్య సైనిక కాంట్రాక్టులను పొందలేవని తెలిపింది. ఈ ఏడాది మే నెలలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చైనాలో పర్యటించిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో భేటీ అయిన ట్రంప్.. ఇరు దేశాల మధ్య పరస్పర వాణిజ్య సహకారంపై అంగీకారానికి వచ్చారు. అయితే, నెల తిరక్కుండానే బీజింగ్ కంపెనీలపై అగ్రరాజ్యం ఆంక్షలు విధించడం గమనార్హం. దీంతో బీజింగ్ కూడా ప్రతిచర్యలు చేపట్టింది.

# ఖతార్ గ్యాస్ క్షేత్రంలో భారీ పేలుడు

## 54మందికి తీవ్ర గాయాలు..18మంది ఆచూకీ గల్లంతు

ప్రపంచ గ్యాస్ వాణిజ్యానికి ఆయువుపట్టు వంటి ఖతార్ రస్ లఫాన్ క్షేత్రంలో బర్జాన్ ప్లాంట్‌లో ఆదివారం అర్ధరాత్రి భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో 54 మంది గాయపడగా.. 18మంది జాడ గల్లంతైంది. ఈ పేలుడుతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. అయితే పేలుడుకు గల కారణాలు తెలియాల్సి ఉంది. అలాగే ప్రాణనష్టంపై వివరాలు అందాల్సి ఉంది. వాస్తవానికి ఇరాన్-అమెరికా యుద్ధం వేళ ఐఆర్‌జీసీ దళాలు ఈ గ్యాస్ క్షేత్రాన్ని లక్ష్యంగా చేసుకొని భారీగా దాడులు చేశాయి. దీంతో గ్యాస్ ప్లాంట్ దెబ్బతిని భారీగా ఉత్పత్తి సామర్థ్యం పడిపోయింది. కొన్నాళ్ల క్రితమే ఇరాన్-అమెరికా మధ్య ఉద్రిక్తతలు తగ్గు ముఖం పట్టడంతో గ్యాస్ ఉత్పత్తి తిరిగి ప్రారంభించేందుకు ఖతార్ చర్యలు చేపట్టింది. ఖతార్ రాజధాని దోహాకు ఈశాన్యంగా 80 కిలోమీటర్ల దూరంలో పర్షియన్ గల్ఫ్ తీరంలో రస్ లఫాన్ నగరం ఉంది. భౌగోళికంగా వ్యూహాత్మక ప్రదేశంలో ఉండటంతో ఇది ఆసియా, ఐరోపా ఎగుమతులకు అత్యంత అనువైన ప్రదేశం. ఇక్కడి నుంచి గ్యాస్ దాదాపు 30 దేశాలకు పైగా ఎగుమతి అవుతోంది. వీటిల్లో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలైన జపాన్, దక్షిణ కొరియా, భారత్, ఐరోపా సమాఖ్య, చైనా వంటి దేశాలు ఉన్నాయి. భారత ఎల్ఎన్‌జీ దిగుమతుల్లో ఖతార్ నుంచి 40-47శాతం వరకు హర్మూజ్ జలసంధి దాటుకొని వస్తున్నాయి. ఈ గ్యాస్ క్షేత్రాన్ని ఖతార్ ఎనర్జీనే నిర్వహిస్తుంది. భారత్-ఖతార్ మధ్య 2024లో 78 బిలియన్ డాలర్ల విలువైన ఒప్పందం జరిగింది. దీని ప్రకారం 2028 నుంచి 20 ఏళ్లపాటు ఏటా 7.5 మిలియన్ టన్నుల ఎల్ఎన్‌జీ సరఫరా చేయాల్సి ఉంటుంది. ఖతార్ ఎల్ఎన్‌జీ భారత్‌లో విద్యుత్తు, ఎరువుల ఉత్పత్తి, పరిశ్రమలు, గృహోపయోగానికి చాలా కీలకం. అమెరికా, ఆఫ్రికాతో పోల్చుకొంటే ఇక్కడి నుంచి భారత్‌కు గ్యాస్ తరలించడం చాలా చౌక.

# తిరుపతిలో జాతీయ శాసనాల మ్యూజియం..

## భూమి కేటాయించేందుకు టీటీడీ అంగీకారం

తిరుపతిలో జాతీయ శాసనాల మ్యూజియం (చీఫ్ఙశీఝశ్రీ వీబంవబఏ శీట జుజూఅస్త్రతీఖుజూష్ట్రఎ) ఏర్పాటుకు మార్గం సుగమమైంది. కేంద్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్మించనున్న ఈ ప్రతిష్ఠాత్మక మ్యూజియం కోసం రెండు ఎకరాల భూమిని కేటాయించేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) సూత్రప్రాయంగా అంగీకరించింది. ఇటీవల టీటీడీ ఈవో ఎం. రవిచంద్ర, ఛైర్మన్ బి.ఆర్. నాయుడు, కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్, కార్యదర్శి వివేక్, భారత పురావస్తు సర్వే (ఏఎస్ఐ) డైరెక్టర్ జనరల్ యదువీర్ సింగ్‌ల మధ్య జరిగిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. భారతదేశపు వేల సంవత్సరాల శాసన వారసత్వాన్ని పరిరక్షించేందుకు, పరిశోధనలకు ఒక ప్రధాన కేంద్రంగా ఈ మ్యూజియంను తీర్చిదిద్దనున్నట్లు ఏఎస్ఐ డైరెక్టర్ (ఎపిగ్రఫీ) కె. మునిరత్నం రెడ్డి తెలిపారు. ఈ మ్యూజియంలో అరుదైన శిలా, రాగి ఫలక శాసనాలతో పాటు, పురాతన భారత చరిత్రను వివరించే ఫోటో మ్యూరల్స్, ఇంటరాక్టివ్ కియోస్క్‌లు ఏర్పాటు చేస్తామని ఆయన వివరించారు.

printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com